
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 338
మంగళవారం 28-2-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'



'నంబర్‌వన్ రికార్డు'
టెన్నిస్‌లో అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన ప్లేయర్‌గా జొకోవిచ్ - 12లో



ఆ ఔషధాలతో సైడ్ ఎఫెక్ట్స్
213 ఔషధాల జాబితా విడుదల చేసిన ఫార్మకోపియా కమిషన్ - 14లో



దేశ ప్రయోజనాల కోసమే అగ్నిపథ్
అగ్నిపథ్ పథకానికి ఢిల్లీ హైకోర్టు సమర్థన. ఉన్నతమైన ఆశయం కోసం తీసుకువచ్చిన పథకమని వ్యాఖ్య.
- వివరాలు 6లో▶



సామాన్యులకూ విమాన ప్రయాణం
హవాయి చెప్పులేసుకునే సామాన్యులు కూడా హవాయీ జహాజ్ (విమానం) ఎక్కాలన్న కల ఇప్పుడు నిజమవుతోందని ప్రధాని అన్నారు.
- వివరాలు 6లో▶

మొండి బకాయి రాబట్టింది!
చాట్‌జీపీటీ సిద్ధం చేసిన మెయిల్‌తో రూ. 90 లక్షల మొండి బకాయిని వసూలు చేసిన ఓ అమెరికా డిజైనింగ్ సంస్థ.
- వివరాలు 6లో▶



పుతిన్‌కు శిరోభారంగా యుద్ధం
రష్యాకు తిరుగులేని నాయకుడిగా వెలిగిపోవాలన్న వ్లాదిమిర్ పుతిన్ ఆశలకు గండికొట్టిన ఉక్రెయిన్ పరిణామాలు.
- వివరాలు 6లో▶

వేగంగా ఇళ్ల పట్టాలు

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం ● దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారికి పట్టాలిచ్చేలా చర్యలు

ఉన్నతాధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశం

పేదలకు ఇళ్లు నిర్మించే పథకం కూడా వేగవంతంగా అమలు

సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి నిధులు.. జాగా లేని వారికి స్థలాలు

నోటరీ కేసుల సత్వర పరిష్కారానికి కార్యాచరణ!


ఉపసంఘం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, సబిత, హరీశ్, తలసాని, ఎర్రబెల్లి, పువ్వాడ తదితరులు

సాక్షి, హైదరాబాద్: నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మళ్లీ వేగంగా నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్లను నిర్మించే పథకాన్ని కూడా వేగంగా అమలు చేయాలని, సొంత జాగాలు ఉన్నవారికి ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని, జాగా లేని వారికి ప్రభుత్వపరంగా స్థలాలు కేటాయించాలని కూడా నిర్ణయించింది. ఇళ్ల స్థలాల పంపిణీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన సోమవారం సమావేశమయ్యింది. మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. 2014లో ప్రారంభించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కింద 1.25 లక్షల మందికి పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేసిన మంత్రి కేటీఆర్.. జీఓ నం. 58 కింద 20,685 ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ మిగతా 2వ పేజీలో ▶

మూడు పారిశ్రామికవాడల క్రమబద్ధీకరణ!

సాధ్యాసాధ్యాలు పరిశీలించాలన్న మంత్రివర్గ ఉపసంఘం

బాలానగర్, హఫీజ్‌పేట, ఆజామాబాద్ ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్‌పై చర్చ

రూ. 2,989 కోట్ల వరకు ఆదాయం రావచ్చని అంచనా

సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో గుర్తించిన 1,000 ఎకరాల ప్రభుత్వ భూమిపైనా చర్చ

సాక్షి, హైదరాబాద్: అదనపు ఆదాయ వనరుల సమీకరణే లక్ష్యంగా రాష్ట్రంలోని మూడు ప్రధాన పారిశ్రామికవాడల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించింది. బాలానగర్ కోఆపరేటివ్ సొసైటీ, హఫీజ్‌పేట్ మినీ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలలోని పరిశ్రమలను చాలావరకు నగరం వెలుపలకు తరలించిన నేపథ్యంలో.. ఆ స్థలాలను రెగ్యులరైజ్ చేసేందుకు గల అవకాశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కోరింది. వనరుల మిగతా 2వ పేజీలో ▶

ప్రజల దృష్టి మళ్లించడానికే

సిసోడియా అరెస్ట్

తీవ్రంగా ఖండించిన సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ట్వీట్ చేశారు. ఇది అదానీకి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉన్న అనుబంధం నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చేసిన ప్రయత్నమని ఆయన విమర్శించారు.




సిసోడియాకు ఐదు రోజుల సీబీఐ కస్టడీ
- వేర్వేరు ఫోన్లు వాడటం నేరం కాదని వాదించిన సిసోడియా తరపు లాయర్లు
- అరెస్ట్‌పై పలు రాష్ట్రాల్లో ఆప్ కార్యకర్తల ఆందోళనలు, అరెస్ట్
- కొనసాగిన ఆప్, బీజేపీ పరస్పర విమర్శలు

6 లో

క్రమబద్ధీకరణ సరికాదు..

తేల్చిచెప్పిన హైకోర్టు ధర్మాసనం
- గడువు ముగిశాక దరఖాస్తులను పరిశీలించాలని కోరడం సమర్థనీయం కాదు
- ఎల్‌ఆర్‌ఎస్ పిటిషనర్లకు స్పష్టీకరణ
- గతంలోనూ ఎల్‌ఆర్‌ఎస్‌ను తప్పుబట్టిన ఉన్నత న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: అక్రమ లే-అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేయడం అనే ప్రక్రియే తప్పని.. అలాంటిది గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వాటినీ అనుమతించాలని కోరడం ఏ మాత్రం సమర్థనీయం కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. అలా ఎక్కడైనా చేసినట్లు తెలిస్తే ప్రభుత్వ న్యాయవాది (జీపీ) దృష్టికి తీసుకురావాలని సూచించింది. ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) పేరిట చేసే క్రమబద్ధీకరణే సరికాదని స్పష్టంచేసింది. గడువు దాటిన తర్వాత దరఖాస్తు చేసుకున్నామని, ప్రభుత్వం తమ ఇంటి నిర్మాణానికి అప్లికేషన్లను అనుమతించడం లేదంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు నిర్మల్‌కు చెందిన పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తమ దరఖాస్తులను పరిశీలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

సింగిల్ జడ్జి తీర్పు సమంజసమే..
ఈ పిటిషన్లపై తొలుత హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లందరూ తమ ప్లాట్లకు యజమానులని, విక్రయ డాక్యుమెంట్లు కూడా వారి వద్ద ఉన్నాయన్నారు. టీఎస్ బీపాస్ ద్వారా ఇంటి నిర్మాణ అనుమతి కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తును సమర్పించడానికి యత్నించారని వెల్లడించారు. జీవో ప్రకారం 2022, ఆగస్టు 26 లోపు దరఖాస్తు చేయలేదని తిరస్కరించడం సరికాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మిగతా 2వ పేజీలో ▶

వాళ్లవి దివాళాకోరు రాజకీయాలు

బీజేపీ, కాంగ్రెస్‌లపై మంత్రి కేటీఆర్ ఫైర్
- ప్రజలను పట్టించుకోకుండా అంబానీ, అదానీలకు ఊడిగం
- రేవంత్ ఒక్క చాన్స్ అని అడుక్కుంటే ఓట్లు వేయాలా?
- కిషన్‌రెడ్డికి మెదడు మోకాళ్లలో ఉందో, అరికాళ్లలో ఉందో..
- హనుమకొండ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన
- అనంతరం రైతు కృతజ్ఞత సభలో మాట్లాడిన మంత్రి

సాక్షి ప్రతినిధి, వరంగల్: దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతున్నాయని.. పచ్చటి తెలంగాణను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు ప్రజల మిగతా 5వ పేజీలో ▶

నాగాలాండ్, త్రిపురల్లో బీజేపీ

మేఘాలయలో హంగ్

పెద్ద పార్టీగా ఎన్‌పీపీ

ఎగ్జిట్ పోల్స్ అంచనా

ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ కమల వికాసమేనని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. తాజాగా ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో నాగాలాండ్, త్రిపురల్లో మళ్లీ బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని, మేఘాలయలో హంగ్ తప్పదని జోస్యం చెప్పాయి. అక్కడ అధికార ఎన్‌పీపీ మరోసారి ఏకైక పెద్ద పార్టీగా నిలుస్తుందని అంచనా. త్రిపురలో ఎన్నో ఆశలతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలకు కొత్త పార్టీ టిప్రా మోతాతో గట్టి దెబ్బ తగలనుంది.
- వివరాలు 6లో▶

మేఘాలయ
అధికార ఎన్‌పీపీకి 18 నుంచి 26 సీట్లు

నాగాలాండ్
అధికారాన్ని నిలుపుకోనున్న ఎన్‌డీపీపీ-బీజేపీ కూటమి

త్రిపుర
సీపీఎం-కాంగ్రెస్ అవకాశాలకు గండి కొట్టనున్న టిప్రా మోతా

ఇది సమంజసమేనా?

బాధ్యతాయుత సీఎం హోదాలో ఉండి న్యాయమూర్తులకు వీడియో క్లిప్పింగులు పంపడం సబబేనా?

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో సుప్రీంకోర్టు అసహనం



- ఇది న్యాయమూర్తుల ఆలోచనను మార్చడమే..
- సిట్ అయితే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేయదా అని ప్రశ్న
- హోలీ సెలవుల తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని నిర్ణయం
- ఏ ధర్మాసనం విచారించేదీ చీఫ్ జస్టిస్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడి

14 లో

ముగిసిన ప్రీతి అంత్యక్రియలు

హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున స్వగ్రామానికి మృతదేహం
- పోస్టుమార్టం వీడియో చిత్రీకరణ
- రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకుల నివాళి
- పలుచోట్ల ఆందోళనలు


ప్రీతి మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి నరేందర్‌నాయక్

సైఫ్ అయినా, సంజయ్ అయినా వదలబోం
ప్రీతి కుటుంబానికి సానుభూతి తెలిపిన మంత్రి కేటీఆర్ 5 లో

కొడకండ్ల/దేవరుప్పుల: వరంగల్ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి రెవెన్యూ పరిధిలోని గిర్నితండాలో సోమవారం ముగిశాయి. ధరావత్ నరేందర్, శారదల మూడో కూతురైన ప్రీతి గత మిగతా 3వ పేజీలో ▶

కఠినంగా శిక్షించాలి
ప్రీతి తండ్రి నరేందర్

తన బిడ్డలాగా మరొకరికి జరగకూడదని ప్రీతి తండ్రి నరేందర్ నాయక్ రోదిస్తూ చెప్పారు. నిందితుడు సైఫ్‌తోపాటు కళాశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రీతి లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వపరంగా రూ.10 లక్షలతో పాటు మంత్రి దయాకర్‌రావు సొంతంగా రూ.20 లక్షలు ఇచ్చి కుటుంబంలోకి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు.

న్యూస్‌రీల్

అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడి ఆత్మహత్య



ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడు డాక్టర్ మజారుద్దీన్ అలీఖాన్ తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో కాల్చుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఆయన ఇంట్లోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ఆర్థిక, కుటుంబ వివాదాలే కారణమని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.
- వివరాలు 5లో▶

లొంగిపోయేముందే శరీర భాగాలు కాల్చేసి..



ప్రాణ స్నేహితుడైన నవీన్‌ను దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ రిమాండ్ రిపోర్ట్‌లో విస్తుపోయే అంశాలు వెల్లడయ్యాయి. ఈ నెల 17న నవీన్‌ను గొంతు నులిమి హత్య చేసి.. మృతదేహంపై విచక్షణారహితంగా కత్తితో పొడిచాడు. పోలీసులకు లొంగిపోయే ముందు నవీన్ శరీర భాగాలను దహనం చేశాడు.
- వివరాలు 5లో▶

మార్చి 23న ఎమ్మెల్సీ ఎన్నికలు



రెండు తెలుగు రాష్ట్రాల్లోని 10 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోలింగ్ జరిగిన రోజే ఫలితాలు రానున్నాయి. మార్చి 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి.
- వివరాలు 2లో▶

ఏ పరిణామానికైనా సిద్ధంగా ఉండండి!
నేడు ఢిల్లీలో రాష్ట్ర బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేయనున్న అమిత్ షా
- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



కూటమితోనే వెళ్దాం ..లేకుండా ఎలాగూ వెళ్లలేం కాబట్టి!

క్లుప్తంగా...



'న్యూఢిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్'లో తమిళిసై

ఉపరాష్ట్రపతిని కలిసిన గవర్నర్ తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌తో భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీ వచ్చిన తమిళిసై తొలుత నేషనల్ బుక్ ట్రస్ట్–కేంద్ర విద్యాశాఖ సంయుక్తంగా ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన 'న్యూఢిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్–2023'ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచ పుస్తక ప్రదర్శనలో పార్లమెంట్ లైబ్రరీ, పార్లమెంట్ మ్యూజియం–ఆర్కైవ్స్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ప్రతిఒక్కరూ పుస్తకాల సేకరణ, పుస్తకాలను కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుందని గవర్నర్ తెలిపారు. అంతేగాక ప్రతిఒక్కరూ ఇంట్లో లైబ్రరీని కలిగి ఉండాలని, చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను ఆయన నివాసంలో కలిసి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

సిసోడియా అరెస్ట్.. బీజేపీ దుర్మార్గాలకు పరాకాష్ట: జగదీశ్



సూర్యాపేట: ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా అరెస్ట్ బీజేపీ దుర్మార్గాలకు పరాకాష్ట అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎమర్జెన్సీకి మించిన దారుణ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు తమ స్వాతంత్య్రాన్ని కోల్పోయి బీజేపీ నేతల ఆరోపణల కోసమే పనిచేస్తున్నాయని విమర్శించారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు అప్రజాస్వామికంగా ఉన్నాయని, బీజేపీ అరాచకాలు ఇలానే కొనసాగితే దేశ ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలతో తెలంగాణ అభివృద్ధిని బేరీజు వేసుకుని కేంద్రమంత్రులు మాట్లాడాలన్నారు. కేసీఆర్ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతల కుయుక్తులు తెలంగాణ సమాజం ముందు సాగవని మంత్రి అన్నారు.

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ' బరిలో 21 మంది..

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానానికి పోటాపోటీ

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువైన సోమవారంలోగా ఎవరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. స్క్రూటినీలోనూ అందరి నామినేషన్లు సవ్యంగా ఉండటంతో నామినేషన్లు వేసిన మొత్తం 21 మంది అభ్యర్థులూ పోటీలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుండగా 16న ఓట్ల లెక్కింపు జరగనుంది.

పోటీలో వీరే..: ఎన్నికల్లో ఎ.వినయ్‌బాబు, అయినేని సంతోశ్‌కుమార్, అన్వర్‌ఖాన్, బి.భుజంగరావు, చాలిక చంద్రశేఖర్, చాలిక పార్వతి, దేవన్నగారి మల్లారెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, గుర్రం చంద్రశేఖర్‌రెడ్డి, కంతే సత్యనారాయణ, కాసం ప్రభాకర్, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ మారంపల్లి, లింగిడి వెంకటేశ్వర్లు, మాడిసెట్టి తిరుపతి, పాపన్నగారి మాణిక్‌రెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, వెంకటనారాయణరెడ్డి అయ్యలప్ప, డాక్టర్ గడాసు వెంకటేశ్వర్లు, డాక్టర్ వి.నటానియల్, త్రిపురారి అనంత్‌నారాయణ్ పోటీ చేస్తున్నారు.

హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీగా మీర్జా రహ్మత్‌బేగ్



రహ్మత్‌బేగ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రియాంక

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎంఐఎం పార్టీకి చెందిన మీర్జా రహ్మత్‌బేగ్ గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.ప్రియాంక.. మీర్జా రహ్మత్‌బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ వేసిన మరో అభ్యర్థి మహ్మద్ రహీంఖాన్ నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో బరిలో మిగిలిన ఏకైక అభ్యర్థి మీర్జా రహ్మత్‌బేగ్ గెలిచినట్లుగా కేంద్ర ఎన్నికల సంఘం తెలిపిందని అధికారులు వెల్లడించారు.

జన ధన భారత్!

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఈ ఏడాదే భారత్ అవతరించబోతోంది.2011 తర్వాత మన దేశంలో జనాభా వివరాల సేకరణ జరగలేదు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ కోవిడ్ కారణంగా వాయిదా పడింది. అయితే ఐక్యరాజ్యసమితి (యూఎన్‌వో) జనాభా లెక్కల కోసం పాటించే సూత్రాన్ని అనుసరించి ప్యూ రీసెర్చ్ సెంటర్ ఈ ఏడాది ఏప్రిల్ నెల నాటికి భారత జనాభా చైనాను అధిగమించనుందని అంచనా వేసింది. ఐక్యరాజ్యసమితి 1950లో ప్రపంచ జనగణన మొదలు పెట్టినప్పటి నుంచీ అధిక జనాభాగల దేశంగా పేరుపడిన చైనా ఇంకో రెండు నెలల్లో ఆ హోదాను కోల్పోబోతోందని ప్యూ రీసెర్చ్ ఇటీవల విడుదల చేసిన రిపోర్ట్‌లో పేర్కొంది.

–దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి


- ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఇండియా
- ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 140 కోట్లు దాటిపోతుందని 'ప్యూ రీసెర్చ్'అంచనా
- ఇందులో 40 శాతానికిపైగా 25 ఏళ్లలోపువారే..

2100 ఏడాది నాటికి కూడా 'యువ'భారతమే..

మన దేశం నుంచి వలసలూ పెరుగుతున్నాయని వెల్లడి

72 ఏళ్లలో 100 కోట్లు..

ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనగణన చేసిన తొలి సంవత్సరం 1950లో భారత జనాభా 35.3 కోట్లు. ఇప్పుడది 140 కోట్లకు చేరినట్లు 'ప్యూ'అంచనా. అంటే గత 72 ఏళ్లలో దేశ జనాభా 100 కోట్లకుపైగా పెరిగింది. ఇది మొత్తం యూరప్ దేశాల జనాభా (74.4 కోట్లు) కంటే అధికం. ఉత్తర, దక్షిణ, అమెరికా ఖండాల కంటే (100 కోట్లు) కూడా ఎక్కువే. చైనాలో ప్రస్తుత జనాభా 140 కోట్లుగా ఉన్నా.. అక్కడ కొన్నేళ్లుగా జనాభా పెరుగుదల మందగించింది. కానీ భారత్‌లో మాత్రం ఎప్పటి మాదిరిగానే పెరుగుతోంది. యూఎన్‌వో అంచనా ప్రకారం.. భారత దేశ జనాభా ఈ దశాబ్దం చివరికి 150 కోట్లకు, 2064 నాటికి 170 కోట్లకు చేరుకుంటుంది. అక్కడి నుంచి జనాభా పెరుగుదల మందగిస్తుంది.



యంగ్ ఇండియా

- భారత జనాభాలో 25 ఏళ్ల కన్నా తక్కువ వయసున్నవారు 40 శాతంపైగా ఉన్నారు. జనాభా సగటు వయసు 28 ఏళ్లు. అదే అమెరికాలో 38, చైనాలో 39 ఏళ్లు. అంటే ఇండియాలో ప్రతి పది మందిలో నలుగురికిపైగా పాతిక సంవత్సరాలలోపు వయసువారే.
- మరోవైపు అధిక జనాభా ఉన్న చైనా, అమెరికా దేశాల్లో వయసుపై బడిన వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. 65 ఏళ్లు దాటిన వారు భారత జనాభాలో కేవలం 7.1 శాతం మాత్రమే. వీరి సంఖ్య భారత జనాభాలో 2063 నాటికి 20 శాతం, 2100 నాటికి 30 శాతానికి మాత్రమే పెరుగుతుంది. అంటే ఈ శతాబ్దం చివరి వరకు భారత్ యువ భారతంగానే ఉంటుందన్న మాట. ఇంకా భారతదేశంలో పాతికేళ్లలోపు వారి సంఖ్య 2078 నాటికి కానీ 65 ఏళ్ల పైబడిన వారి సంఖ్యను దాటే అవకాశం లేదన్నది యూఎన్ అంచనా.



జననాల్లోనూ వేగమే..

చైనా, అమెరికాలతో పోలిస్తే భారత్‌లో జననాల రేటు కూడా అధికమే. ప్రస్తుతం సగటున భారత మహిళ తన జీవితకాలంలో 2.0 పిల్లలకు జన్మనిస్తోంది. అదే చైనాలో 1.2, అమెరికాలో 1.6గా ఉంది. అయితే గతంతో పోలిస్తే భారత దేశంలో జననాల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. 1992లో జననాల రేటు 3.4, 1950లో ఏకంగా 5.9 ఉండేది. భారత్‌లో అన్ని మతస్తుల్లోనూ జననాల రేటు తగ్గుతూనే ఉంది. ముస్లింలలో జననాల రేటు 1992లో 4.4గా ఉంటే.. 2019 కల్లా అది 2.4కి తగ్గింది. హిందువుల్లో 3.3 నుంచి 1.9కు, క్రిస్టియన్లలో 2.9 నుంచి 1.9కు, సిక్కుల్లో 2.4 నుంచి 1.6కు తగ్గింది. అయితే పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో శిశు జననాల రేటులో తేడాలు ఉన్నాయి. పట్టణాల్లో ప్రతి మహిళకు సగటున 1.6 శిశువులు జన్మిస్తే.. గ్రామాల్లో 2.1 మంది జన్మిస్తున్నారు. అదే 20 ఏళ్ల క్రితం సగటు పట్టణాల్లో 2.7, గ్రామాల్లో 3.7 మందిగా ఉండేది. ఇక జనాభా పెరుగుదల విషయంలోనూ ప్రాంతాల మధ్య వ్యత్యాసం ఉంది. 2001–2011 మధ్య మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లలో జనాభా పెరుగుదల 25 శాతం ఉంటే.. గోవా, కేరళలో 10 శాతం మాత్రమే ఉందని భారత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు చెప్తున్నాయి. అదే నాగాలాండ్‌లో అయితే 0.6 శాతం జనాభా తగ్గింది.

తగ్గుతున్న లింగభేదం

70వ దశకంలో లింగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చిన తరువాత బాల బాలికల సంఖ్యలో వ్యత్యాసం పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 111 మంది బాలురకి 100 మంది మాత్రమే బాలికలు ఉన్నట్లు తేలింది. తర్వాత వ్యత్యాసం తగ్గుతూ వస్తోంది. కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 2015 నాటికి బాల బాలికల వ్యత్యాసం 109–100కి తగ్గింది. 2019 నాటికి 108 మంది అబ్బాయిలకు 100 మంది అమ్మాయిలు ఉన్నట్లు వెల్లడైంది. లింగభేదంతో పాటు శిశు మరణాలు కూడా బాగా తగ్గుతూ వస్తున్నాయి. 1990లో ప్రతి వెయ్యిమంది శిశువులకు 89 మంది మరణించేవారు. అదే 2020 వచ్చే నాటికి 27 మందికి తగ్గింది. ఐరాస ఆధ్వర్యంలో పనిచేస్తున్న గ్రూప్ యూఎన్ఐజీ 1960 నుంచి ప్రపంచవ్యాప్తంగా శిశు మరణాల సమాచారాన్ని సేకరిస్తోంది. అయితే శిశుమరణాల విషయంలో భారత్ పొరుగు దేశాలతో పోలిస్తే వెనుకబడే ఉంది. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ప్రతి వెయ్యిమంది శిశువులకు 24 మంది, నేపాల్‌లో 24, భూటాన్‌లో 23, శ్రీలంకలో ఆరుగురు మరణిస్తున్నారు. చైనాలో 6, అమెరికాలో ఐదుగురు శిశువులు పుట్టుక సమయంలోనే అసువులుబాస్తున్నారు.

వెళ్లేవారే ఎక్కువ..

వలసలు కూడా దేశ జనాభాను ప్రభావితం చేస్తాయి. జనాభాను పెంచుకోవడం కోసం అనేక దేశాలు వలసదారుల్ని, శరణార్థులను ఆహ్వానిస్తున్నాయి. జనాభాను సంపదగా భావిస్తున్నాయి. పనిచేయగల సత్తా ఉన్న వారికి ఆశ్రయం కల్పిస్తున్నాయి. అయితే భారతదేశానికి ఇతర దేశాల నుంచి వలస వస్తున్న వారి కంటే ఇక్కడి నుంచి బయట దేశాలకు వెళుతున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. ఒక్క 2021లోనే భారత్ నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లిన వారు మూడు లక్షల మంది ఉన్నారు. అనేక సందర్భాల్లో భారత్‌కు వలస వచ్చిన వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిన దాఖలాలు ఉన్నాయి. 2016లో దాదాపు 68,000 మంది భారత్‌కు శరణుకోరి వచ్చారు. వీరిలో అధిక శాతం మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలే. ఏదేమైనా ఈ శతాబ్దం చివరి వరకు భారత్ నుంచి వెళ్లే వారి సంఖ్య అధికంగానే ఉంటుందని ఐక్యరాజ్యసమితి జనాభా వివరాల విభాగం అంచనా వేసింది.

వేగంగా ఇళ్ల పట్టాలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రక్రియ పూర్తయిందని, ఇంటి స్థలాల పట్టాల పంపిణీని ఇక నుంచి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు వెంటనే చర్యలు ప్రారంభించాలని సూచించారు. పట్టణాల్లో 60 గజాలు, గ్రామాల్లో 120 గజాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.



పేదల అనుకూల విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి..

ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో 4 లక్షల ఇళ్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.12 వేల కోట్ల మొత్తాన్ని ప్రతిపాదించారు. ఈ క్రమంలో సొంత జాగాలు ఉన్నవారికి ఇంటికి రూ.3 లక్షలు చొప్పున మంజూరు చేసి వారే ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టుకునేలా కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నారు. అయితే సొంత జాగాలు లేనివారి సంఖ్య భారీగా ఉన్నందున, వారి నుంచి కూడా ఒత్తిడి వస్తోందంటూ ఇటీవల ఎమ్మెల్యేలు మంత్రి కేటీఆర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఇప్పుడు వారికి పట్టాలు మంజూరు చేయటం ద్వారా స్థలానికి వీలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక నోటరీ పత్రాల గురించి కేటీఆర్ ప్రస్తావిస్తూ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్న కేసుల పరిష్కారానికి సమయానుకూల కార్యాచరణను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు అనుకూలమైన విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని, అర్హత ఉన్న వారి కేసుల సత్వర పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. జీఓ నం.58, 59 అంశాలతోపాటు సాదా బైనామాలు, నోటరీ పత్రాలు, ఎండోమెంట్, వక్ఫ్ భూములు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

రూ.850 కోట్ల బకాయిలపై దృష్టి

నిధులను వేగంగా సమీకరించుకునే క్రమంలో మంత్రివర్గ ఉపసంఘం హౌసింగ్ బోర్డు భూములు, రాజీవ్ స్వగృహ భూములపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ బోర్డుకు పెద్ద మొత్తంలో భూముల నిధి ఉంది. కానీ అది రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉండటంతో వాటి విక్రయాలు ఇప్పటికిప్పుడు నిర్వహించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గతంలో వివిధ ప్రాజెక్టులు, వెంచర్ల కోసం కేటాయించిన భూములకు సంబంధించి ఆయా ప్రైవేటు సంస్థలు ప్రభుత్వానికి చెల్లించకుండా బకాయిపడ్డ రూ.850 కోట్లను వేగంగా వసూలు చేయటంపై దృష్టి సారించింది. ఏయే సంస్థ ఎన్ని నిధులు చెల్లించాల్సి ఉందో వివరాలను ఆరా తీసి వాటిపై చర్చించింది. బకాయిలు ఇంతకాలం చెల్లించనందుకు పేరుకుపోయిన వడ్డీ వివరాలు తెలుసుకుని, వీలైనంత త్వరగా వాటిని వసూలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించింది. వాటికి సంబంధించి ఉన్న కోర్టు కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చొరవ చూపి బకాయిదారులకు నోటీసులు జారీ చేసి ఆ మొత్తాలను వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించింది.

చిన్న చిన్న బిట్లు వేలం వేయండి

గతంలో అమ్మగా మిగిలిన చిన్నచిన్న భూముల బిట్లను సమీకరించి వేలం పాటలో ఉంచి విక్రయించాలని మంత్రులు ఆదేశించారు. ఇక స్వగృహ కార్పొరేషన్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను ఉన్నవి ఉన్నట్టుగా వేలం వేసేందుకు వీలుగా హెచ్ఎండీఏతో కలిసి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనులు జరపకుండా ఖాళీగా ఉంచిన భూములను కూడా అమ్మే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. త్వరలో వీటికి సంబంధించిన ప్రణాళికను అందజేయాల్సిందిగా సూచించారు.

మూడు పారిశ్రామికవాడల క్రమబద్ధీకరణ!

▶ మొదటి పేజీ తరువాయి

సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆర్థిక శాఖా మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సమావేశమయ్యింది. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు కె.రామకృష్ణారావు, రజత్‌కుమార్, అర్వింద్‌కుమార్, నవీన్ మిత్తల్‌లతో పాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ, హెచ్ఎండీఏ, ఆర్అండ్‌బీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అదనపు ఆదాయ వనరుల సమీకరణపైనే చర్చ

ప్రభుత్వ ఖజానాకు అదనపు ఆదాయ వనరులను ఎలా సమీకరించాలన్న దానిపైనే సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పరిధిలోని మూడు పారిశ్రామికవాడలను క్రమబద్ధీకరించడం ద్వారా రూ.2,989 కోట్ల వరకు ఆదాయం రావచ్చని అంచనా వేశారు. ఆయా వాడల్లో నిబంధనల ప్రకారం పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు గాను ప్రభుత్వం భూములు ఇచ్చినవారు కొందరు, ప్రభుత్వం భూములు ఇవ్వకుండానే ఆక్రమణలో ఉన్నవారు మరికొందరు ఉన్నారనే చర్చ జరిగింది. అయితే ఈ భూములను ప్రభుత్వ విలువ కంటే రెండింతలు వసూలు చేసి క్రమబద్ధీకరించాలా? టీఎస్ఐఐసీ విధానం ప్రకారం పరిశ్రమ (ఇండస్ట్రియల్) సంబంధిత ధర తీసుకోవాలా అన్న దానిపై మంత్రులు, అధికారులు చర్చించారు. దీనిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వాలని ఉన్నతాధికారులను మంత్రులు ఆదేశించారు. దీంతో పాటు సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో గుర్తించిన దాదాపు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేసి అమ్మాలా? లేదా డెవలప్‌మెంట్‌కి ఇవ్వడం ద్వారా మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాల ప్రజలకు అమ్మే విధంగా ముందుకెళ్లాలా? అన్నదానిపైనా ఉప సంఘం చర్చించింది. దీనిపై కూడా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. అదే విధంగా హైదరాబాద్ చుట్టూ గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పూలింగ్ చేయాలని, లబ్ధిదారులకు ఇళ్ల ప్లాట్లు ఇచ్చి ప్రభుత్వం ఆ భూములను తీసుకోవాలనే అంశంపైనా చర్చించింది. గతంలో శంషాబాద్ మండలంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించాలని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుని ప్రత్యేక జీవో విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది.

పెండింగ్‌లో ఉన్నవి మరోమారు పరిశీలించండి

జీవో 58 ,59ల కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఉప సంఘం ఆదేశించింది. ఇప్పటికే చాలావరకు దరఖాస్తులను పరిష్కరించామని, జీవో 59 కింద కొన్ని దరఖాస్తులను హై వాల్యూ భూముల (అధిక విలువ కలిగిన భూములు) కేటగిరీలో పెండింగ్‌లో పెట్టామని రెవెన్యూ అధికారులు వివరించారు. దీంతో అలా పెండింగ్‌లో పెట్టిన భూములను మరోమారు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రులు సూచించారు. గతంలో 59 జీవో కింద తిరస్కరించిన దరఖాస్తులను కూడా పునఃపరిశీలించాలని, శాస్త్రీయత ఆధారంగా వీటిపై మళ్లీ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. గతంలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా పేదలకు ఇచ్చిన నివాస స్థలాలు, ఇండ్లకు సంబంధించి ఇప్పటికీ పట్టాలు, పొజిషన్‌లను ఇవ్వని వాటిని గుర్తించి వెంటనే వాటి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామకంఠం, సాదాబైనామా, నోటరీ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి కూడా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి వచ్చే సమావేశం నాటికి నివేదిక సిద్ధం చేయాలని మంత్రివర్గ ఉప సంఘం ఆదేశించింది. రెండు వారాల్లో మరోమారు భేటీ కావాలని సమావేశం నిర్ణయించింది.

మార్చి 23న ఎమ్మెల్సీ ఎన్నికలు

- తెలంగాణ, ఏపీల్లో మొత్తం 10 స్థానాల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

షెడ్యూల్

- నోటిఫికేషన్: మార్చి 6
- నామినేషన్లకు చివరి తేది: మార్చి 13
- నామినేషన్ల పరిశీలన: మార్చి 14
- నామినేషన్ల ఉపసంహరణ: మార్చి 16
- ఎన్నిక: మార్చి 23 (ఉదయం 9 గం.- సాయంత్రం 4 గం.)
- కౌంటింగ్, ఫలితాలు: మార్చి 23 (సాయంత్రం 5 గంటలకు)

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీల్లోని 10 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరిగిన రోజే ఫలితాలు రానున్నాయి. మార్చి 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. అదే రోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ మొదలవుతుంది. మార్చి 29తో 10మంది ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగుస్తున్న ఎమ్మెల్సీల జాబితాలో కృష్ణారెడ్డి, వి. గంగాధర్ గౌడ్, కూర్మయ్యగారి నవీన్ కుమార్ ఉన్నారు. ఇక ఏపీలో పదవీకాలం ముగుస్తున్నవారి జాబితాలో నారా లోకేశ్, చల్లా భగీరథ్ రెడ్డి, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, డొక్కా మాణిక్య వరప్రసాద్, పీవీవీ సూర్యనారాయణ రాజు, గంగుల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట

- టీడీపీతోనే తెలంగాణకు అన్నం అలవాటైందని చెప్పడం అవగాహనారాహిత్యం
- బాబు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్



సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి రూ.2కిలో బియ్యం ఇచ్చిన తర్వాతనే తెలంగాణ ప్రజలకు అన్నం తినడం అలవాటైందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనమని, మూర్ఖపు అహంకారానికి పరాకాష్ట అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. తెలుగుదేశం పార్టీతోనే తెలంగాణ ప్రజలకు అన్నం తెలిసిందన్న వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. చంద్రబాబు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని, 15వ శతాబ్దం నుంచే హైదరాబాద్ దమ్ బిర్యానీకి ప్రసిద్ధి అని పేర్కొన్నారు. బిర్యానీ, షేర్వానీ, ఖుర్బానీ అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమంలో అనేకసార్లు ప్రస్తావించారని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. 11వ శతాబ్దం నాటికే కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువుల కింద వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, పెసలు, అల్లం, పసుపు, ఉల్లి, చెరుకు పంటలకు తెలంగాణ ప్రసిద్ధి అని వివరించారు. ప్రపంచానికి తొలి వాటర్ షెడ్ పరిజ్ఞానాన్ని అందించిన నేల తెలంగాణ అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అప్పట్లోనే విష్ణు కుండినుల నుంచి కాకతీయులు, ఆ తదుపరి నిజాంల వరకు గొలుసు కట్టు చెరువుల నిర్మాణంతో వ్యవసాయవృద్ధికి బాటలు వేశారని వివరించారు. అక్కసు, ఆక్రోశం, విద్వేషం, వివక్ష, అన్యాయాలు తెలంగాణ ఉద్యమానికి పునాది అని, 1956లో ఆంధ్రలో విలీనమే తెలంగాణ వినాశనానికి బీజం పడిందని పేర్కొన్నారు. వైభవంగా ఉన్న తెలంగాణ జీవితాలను సమైక్య పాలనలో చెల్లాచెదురు చేశారని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

"జొన్నకలి, జొన్నయంబలి
జొన్నన్నము, జొన్నపిసరు, జొన్నలె తప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగ పల్నాటి సీమ ప్రజలందఱకున్ " అని మహాకవి శ్రీనాథుడు (1365 – 1441) ఆరు శతాబ్దాల క్రితమే ఆంధ్ర ప్రాంత ఆహారం గురించి రాశారని నిరంజన్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

అవును.. అప్పుడు పేదలు గట్కే తిన్నరు

- మంత్రి సింగిరెడ్డి వ్యాఖ్యలు దొరల స్క్రిప్టు
- చంద్రబాబు మాటలను సమర్థించిన కాసాని



సాక్షి, హైదరాబాద్: 'నాడు ఆకలి రాజ్యమేలింది. తెలంగాణ, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాల్లో జొన్న గట్క, సజ్జలు, ఒట్టు వడ్లు, నల్లవడ్లు, మొక్కజొన్న గట్క తిని పేదలు బతికేవారు. మా ఊళ్లో మేం గట్క తిని, గంజి తాగేవాళ్లం. ఎన్టీఆర్ తీసుకొచ్చిన రెండు రూపాయలకు కిలోబియ్యం పథకం వల్లే ఆకలి రాజ్యంపోయింది'అని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తిన నేపథ్యంలో కాసాని సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యలను సమర్థిస్తూ నిరంజన్‌రెడ్డి దొరలు రాసిచ్చిన స్క్రిప్టు చదవడం మానేయాలని ఎద్దేవా చేశారు. 15 రోజులలోనే ఒట్టు వడ్ల పంట వచ్చేదని, ఆ 15 రోజులలోనే కొన్ని వేలమంది ప్రజలు తిండికి అలమటించేవారని గుర్తుచేశారు. అలాంటి గడ్డు పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ పేదలకు కడుపు నిండా తినే అవకాశం రూ.2 కిలో బియ్యం పథకం ద్వారా ఇచ్చారని పునరుద్ఘాటించారు. కారంతో ముద్ద తిని ఆకలి తీర్చుకున్న ఆ రోజుల్లో ధమ్ బిర్యానీ ఎక్కడ దొరికిందో నిరంజన్‌రెడ్డి చెప్పాలని, హైదరాబాద్‌లోని పాతబస్తీ హోటళ్లలో దొరికిన ధమ్ బిర్యానీ మహబూబ్‌నగర్‌లో దొరికిందా అని ప్రశ్నించారు. దొరలకు కూడా ఆనాడు సన్న బియ్యం దొరికేది కాదని, రాజహంస అనే బియ్యం అక్కడక్కడ లభించేవని పేర్కొన్నారు. పచ్చజొన్నలు తినడం కరెక్టు కాదా? ఎన్టీఆర్ రూ.2 కిలో బియ్యం ఇచ్చారా.. లేదా..? ఆహార భద్రత తెలుగుదేశం పార్టీ వచ్చాకే వచ్చిందనడం వాస్తవం కాదా? చర్చకు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తామని ఆయన సవాల్ విసిరారు.

కాంగ్రెస్ తెలంగాణ పోరు 'యాత్ర'

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు...

- వచ్చే నెల మూడు నుంచి బాసరలో ప్రారంభం
- బాసర టు బోథ్ తర్వాత విరామం
- ప్రతి నియోజకవర్గంలో 1,2 రోజుల పాటు...
- గాంధీభవన్‌లో ముగింపు
- అధిష్టానం ఆదేశాల మేరకే... : మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మరో యాత్రకు సిద్ధమవుతోంది. మార్పు కోసం పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 'హాథ్‌సే హాథ్ జోడో' యాత్ర ఓ వైపు కొనసాగిస్తుండగా, మరోవైపు నుంచి ఇంకో యాత్ర ప్రారంభించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకు ఈ యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రకు సంబంధించిన వివరాలను ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో వెల్లడించారు. మహేశ్వర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మార్చి మూడో తేదీ నుంచి 'కాంగ్రెస్ తెలంగాణ పోరు యాత్ర' పేరుతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర నుంచి యాత్ర ప్రారంభమవుతుంది. బాసర సరస్వతీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భైంసా వరకు తొలి రోజు యాత్ర కొనసాగుతుంది. ఆ తర్వాత నిర్మల్, ఖానాపూర్, ఉట్నూర్, ఆదిలాబాద్, ఇచ్చోడ మీదుగా బోథ్ వరకు తొమ్మిదో తేదీవరకు యాత్ర నిర్వహిస్తారు. మధ్యలో మార్చి 7వ తేదీన హోలీ సందర్భంగా యాత్రకు విరామం ప్రకటించనున్నారు. తొమ్మిదో తేదీన బోథ్ వరకు తొలి విడత యాత్ర ముగిసిన తర్వాత రెండో విడత షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. మొత్తం మీద బాసర నుంచి హైదరాబాద్ వరకు యాత్రను పూర్తి చేసి, ముగింపు కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించేలా యాత్ర షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో 1,2 రోజుల పాటు యాత్ర కొనసాగేలా షెడ్యూల్ తయారు చేశామని, అధిష్టానం ఆదేశాల మేరకే ఈ యాత్ర జరుగుతోందని, యాత్రలో రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నేతలందరూ పాల్గొంటారని మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

క్రమబద్ధీకరణ సరికాదు..

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషనర్లు తమ పిటిషన్‌లో జీవోను ప్రశ్నించలేదని చెప్పారు. అసలు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేయకుండా, ఇంటి నిర్మాణానికి ఎలా దరఖాస్తు చేస్తారని ప్రశ్నించారు. జీవోలో ఎలాంటి తప్పిదం కనిపించడం లేదని, ఈ క్రమంలో ప్రతివాదులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమంటూ రిట్ పిటిషన్లను కొట్టివేశారు. దీంతో పిటిషనర్లు సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ద్విసభ్య ధర్మాసనం కూడా సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించింది.

గతంలోనూ తీవ్ర వ్యాఖ్యలు

ప్రభుత్వం 2020లో అనధికారిక ప్లాట్లు, లే–అవుట్ల క్రమబద్ధీకరణ కోసం జీవో 131ని తెచ్చింది. దీన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు వెలువడ్డాక విచారణ చేపడతామని హైకోర్టు కూడా స్పష్టం చేసింది. అప్పటివరకు బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌లపై స్టే యథావిధిగా కొనసాగుతుందని హైకోర్టు ధర్మాసనం గతంలో వెల్లడించింది. అప్పటివరకు అర్జీదారులను ఇబ్బందులకు గురి చేయకూడదని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం అక్రమ లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం తెచ్చిన జీవో అక్రమార్కులను ప్రోత్సహించేలా ఉంది. చట్టాలను ఉల్లంఘించిన వారికి మేలు చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడమేంటి?'అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

క్లుప్తంగా...

ప్రతి విద్యాసంస్థలో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ప్రతి విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ర్యాగింగ్‌ను నిరోధించేందుకు యూజీసీ, ర్యాగింగ్ మార్గదర్శకాలు పాటించడంతో పాటుగా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి ఆయా నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతి విద్యాసంస్థలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేయాలని, కమిటీల్లో తల్లిదండ్రులు, సైక్రియాటిస్ట్, సైకాలజిస్టులను భాగస్వాములను చేసి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.

సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ రద్దు

వైఎస్ వివేకా హత్య కేసులో హైకోర్టు విచారణ

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకా హత్య కేసులో నిందితుడు(ఏ–2) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. విచారణ దశలో బెయిల్ మంజూరు చేయలేమని తేల్చి చెప్పింది. బెయిల్ మంజూరు చేయాలని సునీల్ హైకోర్టులో ఈ నెల 6న బెయిల్ పిటిషన్ వేశారు. అయితే ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ వివేకా కూతురు సునీతారెడ్డి, భార్య సౌభాగ్యమ్మ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సుమలత సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది నయన్‌కుమార్, సీబీఐ తరపు ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సీబీఐ, సునీత పిటిషన్లలోని విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. ప్రధాన కేసు విచారణ మార్చి 10న కొనసాగనుంది.

ఖదీర్‌ఖాన్ మృతిపై నివేదిక ఎందుకివ్వడం లేదు?

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ సహేజాది ఆగ్రహం



మెదక్ మున్సిపాలిటీ: ''రాజ్యాంగ బద్ధమైన కమిషన్ అడిగితే ఎందుకు డాక్యుమెంట్ చూపించరు... ఖదీర్ ఖాన్‌ను ఏ అధికారంతో కొట్టారు..దొంగతనం చేసినట్టు ఆధారాలున్నాయా? పోలీసులే ముస్లింను హత్యచేశారు అని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు కుమారి సయ్యద్ సహేజాది మండిపడ్డారు. సోమవారం మెదక్ వచ్చిన ఆమె ప్రభుత్వ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఖదీర్‌ఖాన్ మృతిపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీని అడిగినా కూడా ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం లేదన్నారు. డాక్యుమెంట్స్ ఇవ్వకపోతే ఎస్పీని ఢిల్లీకి పిలుస్తామని, అవసరమైతే డీజీపీని, చీఫ్ సెక్రెటరీని కూడా కమిషన్ ముందుకు పిలుస్తామని ఆమె వ్యాఖ్యానించారు. ఖదీర్ ఖాన్ మృతిపై హోం మంత్రి స్పందించాలన్నారు. తెలంగాణ సర్కారు ముస్లింలపై వివక్ష చూపుతోందని ఆమె ఆరోపించారు.

పద్మశాలీలు రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న పద్మశాలీలు రాజకీయంగా దృష్టిసారించాల్సిన అవసరం నేడు అత్యంత ఆవశ్యంగా మారిందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. గ్లోబల్ పద్మశాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో సమ్మిట్ నిర్వహించారు. అమెరికా నుంచి ప్రాతినిధ్యం వహించిన జెల్ల బాలాజీ నేతృత్వంలో కొనసాగిన ఈ సమ్మిట్‌లో 12 దేశాల పద్మశాలీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ సేవా గుణాన్ని తమ కణకణాల్లో జీర్ణించుకున్న పద్మశాలీలు రాజకీయంగా రాణించగలిగినప్పుడే అణగారిన వర్గాలకు, పీడిత వర్గాలకు అండగా నిలబడగలుగుతారన్నారు. తద్వారా తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో సామాజికంగా, రాజకీయంగా పెను మార్పులు సంభవిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో 12 దేశాల ప్రతినిధులు, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవులు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలీ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఏపీ పద్మశాలీ అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి మద్యం, డ్రగ్స్‌తో యువత పక్కదారి: టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: మద్యం, డ్రగ్స్ విచ్చలవిడి వినియోగంతో మహిళలు, బాలికలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని టీపీసీసీ నేతలు ఆరోపించారు. ఈమేరకు సోమవారం నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్, ఫిషర్మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో మద్యం ఆదాయం పెరిగిందని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

ఓటీపీ.. కుచ్చుటోపీ!



రూటు మార్చిన సైబర్ కేటుగాళ్లు

- ఓఎల్‌ఎక్స్ తరహాలో మీషో, క్వికర్లో ఆర్డర్ల పేరిట మోసాలు.. ఆర్డర్ ఇవ్వకుండానే వస్తువు వచ్చిందంటూ నమ్మిస్తారు
- ఆర్డర్ క్యాన్సిలేషన్ పేరిట ఓటీపీ సేకరించి మోసాలు



ఇంటి లోపల మీరేదో పనిలో ఉంటారు.. ఈలోగా డెలివరీ బాయ్ వచ్చి తలుపు తడతాడు. ఆర్డర్ వచ్చిందంటాడు. మీరేమీ ఆర్డర్ ఇవ్వలేదే అనుకుంటూ అదే సమాధానం చెబుతారు. 'లేదు.. లేదు మీ అడ్రస్‌తోనే బుక్ అయింద'ని నమ్మబలుకుతారు. ఒకవేళ బుక్ చేయకుంటే.. ఆర్డర్ క్యాన్సిల్ చేసుకోవడానికి మీ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వచ్చింది చెప్పండి చాలు అంటారు. వారిని నమ్మి మీరు ఓటీపీ చెప్పారో.. ఇక అంతే..

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసానికి తెరతీస్తున్నారు. జనంలో అవగాహన పెరిగిన అంశాల్లో కాకుండా కొత్త దారులు వెతుక్కుంటున్నారు. ఇప్పటివరకు ఓఎల్‌ఎక్స్‌లో వస్తువుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన మోసాలు ఉంటుండగా తాజాగా మీషో, క్వికర్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో వస్త్రాలు, ఇతర గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి మోసాలకు తెరతీస్తున్నారు. ఇటీవల ఈ తరహా మోసాలు పెరిగినట్లు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఇదీ ▶ మోసం తీరు..

ఆన్‌లైన్‌లో మనం ఆర్డర్ ఇవ్వకుండానే మీ ఇంటికి డెలివరీ బాయ్స్ వచ్చి మీకో ఆర్డర్ వచ్చిందంటారు. తీరా మనం ఆ ఆర్డర్ ఇవ్వలేదని చెబితే పొరపాటున మీ అడ్రస్‌తో ఈ ఆర్డర్ బుక్ అయినట్లుందని నమ్మబలుకుతారు. ఆర్డర్ క్యాన్సిల్ చేసుకోకపోతే ఆ డబ్బులు మా జీతంలోంచి కట్ అవుతాయని, మా కమీషన్ పోతుందని జాలి నటిస్తారు. మీ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వచ్చింది దయచేసి అది చెప్పండి చాలు అని నమ్మబలుకుతారు. వారిని నమ్మి మనం ఓటీపీ చెప్పిన వెంటనే అప్పటికే మన వివరాలు సేకరించి ఉంటున్న సైబర్ నేరగాళ్లు మన ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుని మన బ్యాంకు ఖాతాలు కొల్లగొడతారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

మనం ఆర్డర్ ఇవ్వకుండానే వస్తువులు రావని గుర్తుంచుకోవాలి. మనం ఇవ్వని ఆర్డర్‌ను మనం క్యాన్సిల్ చేయాల్సిన పనిలేదు. ఆర్డర్ క్యాన్సిలేషన్ పేరిట ఎవరైనా ఓటీపీ అడిగితే చెప్పవద్దు. అది సైబర్ మోసం అని గుర్తించాలి. ఒకటికి రెండుసార్లు సరిచూసుకోకుండా నగదు చెల్లింపులు చేయకండి. మనం ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చేముందు ఆ కంపెనీ ప్రొఫైల్, రేటింగ్ తప్పక గమనించాలి. సైబర్ మోసం జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే దగ్గరలోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలు ఇవ్వాలి.

ఏ వివరాలు ఇవ్వొద్దు..
-శ్రీనివాస్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

ఆన్‌లైన్‌లో వచ్చిన ఆర్డర్‌ను క్యాన్సిల్ చేసేందుకు ఓటీపీ చెప్పండి అని ఎవరైనా అడిగితే వివరాలు చెప్పవద్దు. మీరు ఆర్డర్ ఇవ్వకుండా వస్తువులు మీ పేరిట రావని గుర్తించాలి. ఓటీపీ, ఇతర వివరాలు, బ్యాంక్ ఖాతాల గురించి అడిగితే అది కచ్చితంగా మోసమని గ్రహించాలి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే సమయంలోనూ ఆ వెబ్‌సైట్ నమ్మకమైనదేనా? లేదా? అని తెలుసుకోవాలి. ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు, అమ్మకాల్లోనూ మోసం జరిగే ప్రమాదం ఉందన్న విషయాన్ని మరవొద్దు.

ఏ పరిణామానికైనా సిద్ధంగా ఉండండి!

- నేడు ఢిల్లీలో అమిత్‌షాతో రాష్ట్ర మినీ కోర్ కమిటీ భేటీ
- ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో మనీశ్ సిసోడియా అరెస్ట్ నేపథ్యంలో భేటీకి పెరిగిన ప్రాధాన్యత
- అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రపార్టీ సన్నద్ధత, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తారంటున్న పార్టీ నేతలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధత, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకోబోయే పరిణామాలపై బీజేపీ దృష్టి సారించింది. మంగళవారం ఢిల్లీలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో జరిగే రాష్ట్ర మినీ కోర్‌కమిటీ భేటీలో ఈ అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను మద్యం కుంభకోణం కేసులో సీబీఐ అరెస్ట్ చేసిన రెండోరోజే ఈ సమావేశం ఉండటంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. రాష్ట్ర బీజేపీ చేపట్టిన 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ చివరి రోజున మంగళవారం 119 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగసభలు నిర్వహించాలని నాయకత్వం ఆదేశించింది. అయితే పార్టీకి సంస్థాగతంగా కీలకమైన రోజునే రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలను ఢిల్లీకి అత్యవసరంగా పిలిపించడం గమనార్హం.

మనకూ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు ప్రకంపనలు

తెలంగాణ రాజకీయాలను కూడా ఢిల్లీ లిక్కర్ స్కాం ప్రకంపనలు తాకుతాయా, ఒకవేళ ఆ దిశలోనే చర్యలుంటే అవి ఏ రూపంలో ఉంటాయన్న దానిపైనా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార పార్టీ నేతలపై విచారణ, దర్యాప్తు సంస్థలు ఏవైనా చర్యలు తీసుకుంటే వాటి పర్యవసానాలను రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే ఉద్బోధను రాష్ట్ర ముఖ్యనేతలకు నాయకత్వం చేయొచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది కర్ణాటక, తెలంగాణసహా వివిధ రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికలపై అమిత్‌షా ఢిల్లీ నుంచి పూర్తి దృష్టిని కేంద్రీకరించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికల తయారీలో అమిత్‌షా బిజీ షెడ్యూల్ కారణంగా ఢిల్లీలో ఈ భేటీని నిర్వహిస్తున్నారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

సునీల్ బన్సల్ నివేదిక కీలకం

ఇప్పటికే వారంరోజులు రాష్ట్రంలో బసచేసిన ఆ పార్టీ సంస్థాగత ఇన్‌చార్జీ సునీల్ బన్సల్ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ ఎలా జరుగుతున్నాయి, నేతల పనితీరు ఎలా ఉంది, వాటికి ప్రజల స్పందన ఎలా ఉందనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు, చక్కదిద్దుకోవాల్సిన అంశాలపై బన్సల్ ఇచ్చిన నివేదికను ఆధారం చేసుకునే ఈ భేటీలో అమిత్‌షా రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయనున్నట్టు తెలుస్తోంది. భేటీకి సునీల్ బన్సల్, తరుణ్ చుగ్, బండి సంజయ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, పార్టీజాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయకార్యవర్గసభ్యులు మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి, విజయశాంతి తదితరులు పాల్గొంటున్నట్టు పార్టీవర్గాల సమాచారం.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించం


పౌర సరఫరాల సంస్థ ఉద్యోగులతో మంత్రి గంగుల



సాక్షి, హైదరాబాద్: ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, మిల్లర్లతో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని పౌర సరఫరాల సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఎలాంటి అంశాన్నయినా ఉపేక్షించబోమని, కఠినచర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. రాష్ట్రం ధాన్యం సేకరణలో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని, 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ స్థాయి నుంచి కోటి 41 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల పౌర సరఫరాల సంస్థ మేనేజర్లు, ఉద్యోగులతో మంత్రి సోమవారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ భవన్‌లో సమావేశమయ్యారు. ఉద్యోగుల డైరీని ఆవిష్కరించి, వారికి హెల్త్‌కార్డులు అందజేశారు.

ఠాక్రే ఈసారి ఐదు రోజుల టూరు

కాంగ్రెస్ ముఖ్య నేతలతో రెండు రోజుల పాటు కీలక సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మరో సారి తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా సూర్యాపేట జిల్లా కోదాడ వెళ్లనున్నారు. రాత్రికి అక్కడే బసచేసి బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో భేటీ అవుతారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో సమావేశం తర్వాత అదే రోజు సాయంత్రం కోదాడలో జరిగే హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొంటారు. అక్కడి నుంచి రాత్రికి ములుగు వెళ్తారు. గురువారం ఉదయం డీసీసీ అధ్యక్షుడు ఎస్ కుమారస్వామి సంతాప సభలో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ములుగు నుంచి వరంగల్ మీదుగా గురువారం సాయంత్రానికి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఇటీవల బీఆర్‌ఎస్ కార్యకర్తల దాడికి గురైన తోట పవన్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. హైదరాబాద్‌లో జరిగే మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 86వ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. శుక్రవారం ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీలతో, శనివారం డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ జనరల్ సెక్రటరీలతో, మండలపార్టీ అధ్యక్షులతో వేర్వేరుగా జరిగే సమావేశాల్లో దిశానిర్దేశం చేయనున్నారు.

ప్రీతి కేసులో కొత్త ట్విస్ట్

వేధింపులతోపాటు రూ.50 లక్షల అడ్మిషన్ బాండ్ కూడా ఈ అఘాయిత్యానికి కారణమే!

అంత మొత్తం ఎలా కడతావంటూ నాన్నతో ఆమె చివరి మాటలు

సాక్షి, వరంగల్: ఎంబీబీఎస్ పీజీ సీటు రావడం ఒక ఎత్తయితే.. ఆ మూడేళ్ల కోర్సు పూర్తి చేయడం కూడా ఓ సవాల్.. ఎందుకంటే.. ఇటు తరగతులతోపాటు ప్రాక్టికల్‌గా ఆస్పత్రుల్లో సీనియర్లతో కలిసి పనిచేయడం, వారి ఆలోచనలకు తగ్గట్టుగా నడవడం అనేది ఓ చాలెంజ్ లాంటిదే. ఆకతాయిలుంటే వేధించేవారూ లేకపోలేదు. కేఎంసీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య కేసు ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. పీజీ సీటు వచ్చిన సమయంలో అడ్మిషన్ బాండ్ రూ.50 లక్షల అగ్రిమెంట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ తీసుకున్నాక కారణాలేవైనా కోర్సు మధ్యలో డ్రాప్ అయితే ఆ మొత్తం తిరిగి కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి చెల్లించాలి. ఇదే ఇప్పుడు ప్రీతి పాలిట శాపమైందన్న వాదన తెరపైకి వచ్చింది.

మోయలేని భారమేనా...: గతేడాది వర్సిటీ మెడికల్ పీజీ సీటు మధ్యలోనే ఆపేస్తే రూ.20 లక్షలు చెల్లించాలన్న నిబంధన ఉండేది. అయితే చాలామంది విద్యార్థులు మధ్యలోనే వెళ్లిపోతున్నారన్న కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.50 లక్షలకు పెంచింది. దీంతో చాలామంది విద్యార్థులు వేధింపులు, ర్యాగింగ్, ఇతరత్రా ఏవైనా ఉన్నా వాటిని భరిస్తూ పీజీ పూర్తి చేస్తున్నారన్న వాదనలు వర్సిటీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. సైఫ్ నుంచి వేధింపులు ఎక్కువవడంతో పీజీ కోర్సు ఆపేసి రావొచ్చు కదా అని తండ్రి నరేందర్ అన్నప్పుడు రూ.50 లక్షలు వర్సిటీకి చెల్లించాల్సి ఉంటుంది కదా.. వద్దులే అంత మొత్తం ఎలా అడ్జస్ట్ చేస్తావు అని ఆమె చివరి మాటల్లో చెప్పినట్లు చర్చ జరుగుతోంది. వేధింపులు తట్టుకోలేక, డ్రాప్ అయితే అంత మొత్తం కట్టలేక ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటుదన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేధింపులు, ర్యాగింగ్‌లపై ప్రభుత్వం కొత్త అడ్మిషన్ బాండ్ నిబంధనలు తీసుకురావాలని, లేదా విద్యార్థినులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయండి

- మంత్రి కేటీఆర్‌కు 2009 బ్యాచ్ ఎస్సైల వినతిపత్రం
- డీజీపీతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ

సాక్షి, హైదరాబాద్: పదోన్నతుల కల్పనలో తమకు న్యాయం చేయాలని 2009 బ్యాచ్ ఎస్సైలు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం 2009 బ్యాచ్‌కు చెందిన దాదాపు 85 మంది వరకు సబ్ ఇన్‌స్పెక్టర్లు బీఆర్‌కేఆర్ భవన్ వద్ద మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 175 పోస్టులు ఖాళీగా ఉన్నా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు దక్కకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు రూల్స్‌లో స్పష్టత లేని కారణంగా తమకు పదోన్నతులు రావడం లేదని వివరించారు. 2009 బ్యాచ్‌లో మొత్తం 435 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లలో ఇప్పటికే 220 మంది సీఐలుగా ప్రమోషన్లు పొందారని, మరో 215 మందికి పదోన్నతులు రావాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రమోషన్లు పొందిన తమ బ్యాచ్‌మేట్లు సీఐలుగా పనిచేస్తున్న చోటే తాము ఎస్సైలుగా పనిచేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాతజోన్ల విధానంలో లేదంటే నూతన మల్టీ జోన్ విధానంలో అయినా సరే తమకు వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. డీజీపీ అంజనీకుమార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినట్టు ఎస్సైలు తెలిపారు.

ముగిసిన ప్రీతి అంత్యక్రియలు

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం కాలేజీ సీనియర్ సైఫ్ వేధింపులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. 5 రోజులపాటు హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందిన ఆమె ఆదివారం రాత్రి కన్నుమూసిన సంగతి తెలిసిందే. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం ఉదయం 6:30 గంటలకు గిర్నితండాకు తెచ్చారు. ప్రీతి మృతదేహం వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అంతిమయాత్రలో మంద కృష్ణమాదిగ, బీజేపీ, గిరిజన సంఘాల నాయకులు పాడె మోశారు. ఆ తరువాత గిరిజన సంప్రదాయ పద్ధతిలో వారి వ్యవసాయ భూమిలో ఖననం చేశారు.

ప్రీతికి పలువురి నివాళి

ప్రీతికి గ్రామస్తులతోపాటు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండి శ్రీధర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తదితరులు నివాళులర్పించారు. ప్రీతి మృతిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలంటూ బీజేపీ నాయకులు గిర్నిబావితండా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

పోస్టుమార్టం వీడియో చిత్రీకరణ

గాంధీఆస్పత్రి: ప్రీతి నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 9.10 గంటలకు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించగా, మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించే క్రమంలో కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాలు అడ్డుకున్న విషయం విదితమే. దీంతో ఆదివారం రాత్రి నుంచి గాంధీ ఆస్పత్రి వద్ద పోలీసులు భారీసంఖ్యలో మోహరించారు. ఆస్పత్రిలోకి మీడియాను అనుమతించలేదు. రోగులు, రోగి సహాయకులను ధ్రువీకరణ పత్రం చూపించాకే ఆస్పత్రిలోకి అనుమతించారు. అర్ధరాత్రి 1.46 గంటలకు ప్రీతి మృతదేహం గాంధీ మార్చురీకి వచ్చింది. ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్ నేతృత్వంలో వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం వేకువజామున 4.15 గంటలకు ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి ప్రీతి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మృతదేహం గాంధీ మార్చురీకి వచ్చినప్పటి నుంచి పోస్టుమార్టం పూర్తయి అంబులెన్స్‌లో తరలించేంత వరకు వీడియో చిత్రీకరించారు.



పాడె మోస్తున్న మంద కృష్ణమాదిగ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా ఆందోళనలు

సాక్షి నెట్‌వర్క్: ప్రీతి మరణానికి కారకులైన సైఫ్, కేఎంసీ కళాశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. కేఎంసీ ఎదుట ఏబీవీపీ నాయకులు, ఎంజీఎం జంక్షన్‌లో బీజేపీ, ఐద్వా నాయకులు ఆందోళనలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి సైఫ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ములుగులో ఎల్‌హెచ్‌పీఎస్, డీవైఎఫ్ఐ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. జనగామ జిల్లా కేంద్రంతోపాటు నర్మెట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, పాలకుర్తి తదితర మండలాల్లో ఏబీవీపీ, వీహెచ్‌పీ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐబీఎస్ఎస్, మహిళా కాంగ్రెస్, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇలా!

- మెంబర్ పోర్టల్‌లో లింకు అందుబాటులోకి తెచ్చిన ఈపీఎఫ్ఓ.. మే 3 వరకు గడువు
- ఈసారి జాయింట్ ఆప్షన్ ఇవ్వకుంటే భవిష్యత్తులో అవకాశం ఉండదు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పరిధిలో అధిక పెన్షన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధిక పెన్షన్‌పై ఈపీఎఫ్ఓ మార్గదర్శకాలు జారీ చేసిన క్రమంలో అర్హత ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు.. అధిక పెన్షన్‌కు సంబంధించి ఆప్షన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌లో ప్రత్యేక లింకును అందుబాటులోకి తెచ్చింది. 2014 సెప్టెంబర్ 1 తర్వాత పదవీ విరమణ పొందిన వారు, ప్రస్తుతం సర్వీసులో ఉండి అధిక పెన్షన్‌కు అర్హత ఉన్న వారు తమ వివరాలను నమోదు చేసుకోవడంతోపాటు జాయింట్ ఆప్షన్ ఇవ్వాలి. వీరు మే నెల 3 వరకు ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు గడువు విధించింది. అయితే 2014 సెప్టెంబర్ 1 కంటే ముందే పదవీ విరమణ పొంది అధిక పెన్షన్‌కు అర్హతలుండి ఆప్షన్ ఇచ్చి ఈపీఎఫ్ఓ ద్వారా తిరస్కరణకు గురైన వారు మాత్రం మార్చి 3లోపు జాయింట్ ఆప్షన్‌తోపాటు వివరాలు సమర్పించాలి. కాగా, అర్హులు ఎవరైనా కూడా అధికపెన్షన్‌కు సంబంధించిన జాయింట్ ఆప్షన్‌ను ఇప్పుడు ఇవ్వకుంటే భవిష్యత్తులో మళ్లీ అవకాశం ఉండదని అధికార వర్గాలు స్పష్టంచేశాయి.

సర్వర్ సతాయింపు

ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌లో అధిక పెన్షన్ లింకు అందుబాటులో ఉంచడంతో ఎక్కువ మంది దానిని ఓపెన్ చేస్తున్నారు. దీంతో సర్వర్‌పై ఒత్తిడి తీవ్రమైంది. సాధారణ సమయంలోనే అత్యంత నెమ్మదిగా ఉండే ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్... తాజాగా అధిక పెన్షన్‌కు సంబంధించిన ఒత్తిడి పెరగడంతో స్తంభించిపోతోంది. వెబ్‌సైట్‌లో పేజీ తెరిచి ఆప్షన్ నమోదు లింకు, దరఖాస్తు లింకును క్లిక్‌చేస్తోంటే చాలామందికి ఎర్రర్ మెసేజ్ వస్తోంది. దీంతో అటు ఉద్యోగులు, ఇటు యాజమాన్యాలు గందరగోళానికి గురవుతున్నాయి. 2014 సెప్టెంబర్ 1 కంటే ముందే పదవీ విరమణ పొంది అధిక పెన్షన్‌కు అర్హతలున్న వారికి ఈ సాంకేతిక సమస్య గుబులు పుట్టిస్తోంది.

'వర్జీనియా టెక్'తో భాగస్వామ్యం బలోపేతం

సాక్షి, హైదరాబాద్: వర్జీనియా పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ అండ్ స్టేట్ యూనివర్సిటీతో తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రమేశ్‌భట్ పేర్కొన్నారు. ఆ సంస్థకు చెందిన ప్రతినిధుల బృందానికి ఈనెల 13, 14వ తేదీల్లో ఎన్ఎంఐఎంఎస్ వర్సిటీ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల పరిశోధకులు పరిశోధన రంగాల్లో వారి విజయాలు, పాఠ్యాంశాల అభివృద్ధి, ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్స్ వంటి వాటిపై చర్చించారు. ఎన్ఎంఐఎంఎస్–వర్జీనియా టెక్ మధ్య భాగస్వామ్యం పరిజ్ఞానాన్ని పంచుకోవడం, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు దోహదం చేస్తుందని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ పేర్కొన్నారు. కాగా, ఎన్ఎంఐఎంఎస్ ముఖేశ్ పటేల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ అండ్ వర్జీనియా టెక్ ఇప్పటికే త్రీ ప్లస్ వన్ ప్లస్ వన్ ప్రోగ్రామ్‌తో పాటు ఎన్ఎంఐఎంఎస్ సరళ అనిల్ మోదీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి.

అనుమతి ఇవ్వమని చెప్పలేం

మహేశ్వర మెడికల్ కాలేజీకి హైకోర్టులో చుక్కెదురు

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ కోర్సుల నిర్వహణను పునరుద్ధరించాలంటూ మహేశ్వర మెడికల్ కాలేజీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. కాంగ్రెస్ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కుటుంబీకులు ఈ కాలేజీని నడుపుతున్న విషయం తెలిసిందే. మెడికల్ కాలేజీలకు అనుమతుల నిబంధనల ప్రకారం, ఆ కాలేజీలోని సీట్ల ఆధారంగా బ్యాంక్ గ్యారెంటీని అందించాలి. అయితే మహేశ్వర కళాశాల యాజమాన్యం బ్యాంక్ ఆఫ్ బరోడాకి నకిలీ బ్యాంకు గ్యారెంటీలను సమర్పించినట్లు ఎన్ఎంసీకి తెలిసింది. ఈ నేపథ్యంలో పీజీ మెడికల్ కోర్సుల అనుమతిని ఉపసంహరించుకున్న ఎన్ఎంసీ.. ప్రస్తుతం ఉన్న విద్యార్థులను ఇతర ప్రైవేట్ కాలేజీలకు తరలించాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ కాలేజీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి పిటిషన్‌ను కొట్టివేశారు. దీంతో యాజమాన్యం అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అప్పీల్‌ను కొట్టివేసింది.

డీ ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

- 28 జిల్లాల్లో నేటి నుంచే ప్రారంభిస్తాం
- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 28 జిల్లాల్లో డీ ఎడిక్షన్ (దేనికైనా బానిసైన వారిని ఆ అలవాటు మాన్పించేలా చికిత్స ఇచ్చే విధానం) నేటి నుంచి ఏర్పాటు చేస్తామని, ఆ మేరకు చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. డ్రగ్స్, లిక్కర్, స్మోకింగ్ లాంటి వాటి నుంచి బయటపడేందుకు చికిత్స అందిస్తామని పేర్కొంది. ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో కౌంటర్ దాఖలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్ డీ ఎడిక్షన్, లిక్కర్ డీ ఎడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జీవోలో ఉన్నా.. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదంటూ న్యాయవాది, సామాజిక కార్యకర్త మామిడి వేణుమాధవ్ హైకోర్టులో 2016లో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ సెంటర్ల ఏర్పాటుపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను మార్చి 6కు వాయిదా వేశారు.

శివశంకర్ సేవలు చిరస్మరణీయం: ఎంపీ రవిచంద్ర

సాక్షి, హైదరాబాద్: న్యాయ కోవిదుడిగా, కేంద్రమంత్రిగా పుంజాల శివశంకర్ దేశానికి, దళిత బహుజన సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. శివశంకర్ ఆరో వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, మున్నూరుకాపు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ తదితరులు శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. విదేశాంగ, మానవ వనరుల అభివృద్ధి, న్యాయ, పెట్రోలియం శాఖల మంత్రిగా శివశంకర్ చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. బీసీ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు.



సుఖకరమైన వివాహానికి కావాల్సింది నువ్వు ఎంత అనుకూలంగా ఉన్నావన్నది కాదు, ఆ ప్రతికూలతతో నువ్వు ఎలా వ్యవహరిస్తున్నావన్నది.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 28

కూడదీసుకొనే ప్రయత్నం

ఆటలో గెలవాలంటే ప్రత్యర్థి బలం తెలియాలి. అంతకన్నా ముందు మన బలహీనత తెలియాలి. ఈ తత్త్వం గ్రాండ్ ఓల్డ్ పార్టీ ఆఫ్ ఇండియాకు క్రమంగా తలకెక్కుతున్నట్టుంది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ ఫిబ్రవరి 24 నుంచి 3 రోజుల కాంగ్రెస్ 85వ ప్లీనరీని చూశాక ఈ అభిప్రాయమే కలుగుతుంది. ప్రతిపక్షంగా బలంగా నిలబడాలనీ, పాలకపక్షంతో కలబడాలనీ ప్లీనరీ సాక్షిగా కాంగ్రెస్ కసరత్తు చేయడం సంతోషమే. కానీ గతం నుంచి ఏం నేర్చుకుంది? ఎంత మారింది? ఇతర ప్రతిపక్షాల్ని కలుపుకొనిపోవడానికి ఏం చేస్తోందన్నది కీలకం. అందుకే, బీజేపీని ఢీ కొనడానికి భావసారూప్య పక్షాలతో పొత్తులకు సిద్ధమంటూనే, ప్రతిపక్షాలు చీలి మూడో కూటమి కడితే బీజేపీ సారథ్య ఎన్డీఏకే లాభిస్తుందని హస్తం పార్టీ బాహాటంగా ఒప్పుకోవడం గమనార్హం. బీజేపీ వివిధ సామాజిక వర్గాల్లో విస్తరిస్తున్న వేళ దీటుగా కొత్త సామాజిక న్యాయ అజెండాతో ముందుకొచ్చింది.

ఈ ప్లీనరీలో వ్యవస్థాపరమైన సంస్కరణలు, ఎన్నికల పొత్తులు, ఉత్తరాదిన పార్టీ భవితవ్యం మెరుగుదలకు చర్యలు వగైరా చర్చిస్తారని ఆది నుంచి అందరూ భావించారు. ఆ మాటకొస్తే, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ పునరుజ్జీవనానికి దిశానిర్దేశం జరిగేలా మేధామథనం చేయడం ఈ మూడు రోజుల ప్లీనరీ ప్రధాన ఉద్దేశం. అది పూర్తిగా నెరవేరిందా అంటే అనుమానమే. కానీ, ఆశ, నిరాశల మేళవింపుగా పార్టీ ప్రతినిధుల మహా జాతర ముగిసింది. నిరుడు ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సామర్థ్యాన్ని ప్లీనరీలో ఒకరిద్దరు ప్రస్తావించినా, అంతా గాంధీ త్రయం స్తోత్రపాఠాలకే పరిమితమవడం మారని నైజానికి ఉదాహరణ.

దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న సంస్కరణలకు చడీచప్పుడు లేకుండా తిలోదకాలు ఇచ్చేశారు. నిరుడు మేలో ఉదయ్‌పూర్‌లో పార్టీ 'నవ సంకల్ప శిబిరం'లో చేసుకున్న బాసలు, చెప్పుకున్న ఊసులు ఎటు పోయాయో తెలీదు. 'ఒక వ్యక్తికి ఒకే పదవి' అంటూ రాహుల్ మానసపుత్రికగా వచ్చిన ప్రతిపాదన పార్టీలో అత్యవసర ప్రక్షాళన తెస్తుందని అప్పట్లో తెగ ప్రచారమైంది. తీరా ఇప్పుడు దాన్ని చాప కిందకు నెట్టేశారు. అలాగే, పార్టీ కొందరి కుటుంబ వ్యవహారం కాదని చెప్పేందుకు 'ఒక కుటుంబంలో ఒకరికే టికెట్' అన్న అప్పటి మరో సంస్కరణకు అతీగతీ లేదు. ఇక, 1998లో తొలిసారి అధ్యక్షపదవి చేపట్టి, పాతికేళ్ళలో పార్టీ ఉత్థానపతనాలకు సాక్షిగా నిలిచిన సోనియా రిటైర్మెంట్ వార్తల సంచలనం సరేసరి. పార్టీ వెంటనే నష్టనివారణకు దిగి, ఇన్నింగ్స్ ముగింపని సోనియా అన్నది అధ్యక్ష పదవికేనని వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

పార్టీ అత్యున్నత నిర్ణాయక సంఘమైన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' (సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు సైతం ప్లీనరీలో జరగాలన్నది కాంగ్రెస్ రాజ్యాంగం. 2020 ఆగస్టులో 'జీ–23' అసమ్మతి నేతలు సోనియాకు లేఖాస్త్రంలో చేసిన డిమాండ్ అదే. కానీ, ప్లీనరీ ప్రారంభం కాక ముందే ఆ ఎన్నికల కథ కంచికి చేరింది. ఎన్నికై వచ్చేవారు రేపు ఖర్గే చేసే ప్రతి పనికీ తల ఊపరేమోననే సందేహంతో, సీడబ్ల్యూసీపై పార్టీ యూ టర్న్ తీసుకోవాల్సి వచ్చింది. 18మంది ఎన్నికైన సభ్యులు, 17 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారని పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసినా, మొత్తం 35 మందినీ నామినేట్ చేసి, సొంత 'టీమ్35'ను ఎంపిక చేసుకొనే సర్వాధికారాన్ని ఖర్గేకే కట్టబెట్టడం విడ్డూరం. కుర్చీలో వ్యక్తులు మారినా, కాంగ్రెస్ తీరు మారలేదన్న భావన కలుగుతున్నది అందుకే.

అలాగని ప్లీనరీలో సానుకూల అంశాలేమీ లేవని కాదు. పార్టీ రాజ్యాంగంలో పలు సవరణల్ని ఆమోదిస్తూనే, అధికారంలోకి వస్తే చేయనున్న చట్టాలను ప్లీనరీ పేర్కొంది. ఉన్నత న్యాయవ్యవస్థ, ప్రైవేట్ రంగాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు తెస్తామంటూ సామాజిక న్యాయ అజెండాను భుజానికెత్తుకుంది. బీజేపీ కాదంటున్న కులగణనకూ తాను సిద్ధమంది. విద్యార్థులపై వివక్షను నివారించే రోహిత్ వేముల చట్టం, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కన్నా తక్కువకు వ్యవసాయ ఉత్పత్తులు కొంటే శిక్షార్హమైన నేరంగా పరిగణించే చట్టం లాంటివి చెప్పుకోదగ్గవే. అలాగే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీలకు పార్టీలో 50 శాతం రిజర్వేషన్ కల్పించే సవరణా ఆహ్వానించదగ్గదే. భారత్ జోడో యాత్రతో చేపట్టిన తపస్సును కొనసాగించడానికి కొత్త ప్రణాళికతో పార్టీ ముందుకు వస్తుందన్న రాహుల్ ప్రకటన, ఈసారి దేశంలో తూర్పు నుంచి పశ్చిమానికి మరో యాత్ర ఉంటుందన్న వార్తలు ఉత్సాహజనకాలే. అయితే, స్వీయతప్పిదాలు, రానున్న సవాళ్ళపై ప్లీనరీలో జరగాల్సిన అంతర్మథనం పూర్తిగా జరిగినట్టు లేదు.

2024 జాతీయ ఎన్నికలకు ముందు ఈ ఏడాది 9 రాష్ట్రాల ఎన్నికల కర్టెన్‌రైజర్ కీలకం. సోమవారం 3 ఈశాన్య రాష్ట్రాల్లో పోలింగ్ జరగ్గా, రానున్న నెలల్లో కర్ణాటక, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్, బీజేపీలు ముఖాముఖి తలపడనున్నాయి. ఆ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి ప్రతిపక్షాల పొత్తులు, కాంగ్రెస్ బేరసారాల శక్తి ఉండనున్నాయి. ఆ ఎన్నికల్లో హస్తానిది పైచేయి కాకుంటే, ఇప్పటికే కాంగ్రెస్ వినా మూడో ఫ్రంట్‌కై సాగుతున్న యత్నాలు ఊపందుకుంటాయి. అందుకే, గతంలో యూపీఏ సారథిగా ముందున్న కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోవడానికి శ్రమించక తప్పదు. ప్లీనరీకి ఇచ్చిన ప్రకటనల్లో మౌలానా ఆజాద్ ఫోటో విస్మరించిన నేతలు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఇలాంటి పొరపాట్లు ప్లీనరీలో చిన్నవే కావచ్చు. కానీ, రేపు ఎన్నికల్లో చిన్న పొరపాట్లకూ పెద్దమూల్యం ఉంటుంది. గత రెండు ఎన్నికలుగా కాంగ్రెస్‌కు అది అనుభవైకవేద్యమే!

ఎందుకు పోటీ చేస్తున్నానంటే...

అభిప్రాయం



వివేక్ రామస్వామి

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు అప్పుడే కోలాహలం మొదలైంది. ముఖ్యంగా ఈసారి భారత సంతతీయుల సందడి ఎక్కువగా ఉండేట్టుంది. ఇప్పటికే ఆంత్రప్రెన్యూర్, రచయిత వివేక్ రామస్వామి తాను అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తానని ప్రకటించారు. దీనికిగానూ ముందు తన సొంత పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ మద్దతు కూడగట్టవలసి ఉంటుంది. ఏమైనా నిండా నలభై ఏళ్లు లేని, కేరళ మూలాలున్న వివేక్ రామస్వామి ఇంత పెద్ద పదవికి పోటీ పడాలని అనుకోవడమే విశేషం. 'ఒక నూతన అమెరికన్ స్వప్నాన్ని రూపొందించడానికి నేను రాజకీయ ప్రచారం మొదలుపెట్టడం మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తున్నాను' అని ఆయన చెబుతున్నారు.

అమెరికా ప్రస్తుతం జాతీయ అస్తిత్వ సంక్షోభంలో ఉంది. విశ్వాసం, దేశభక్తి, కఠిన శ్రమ వంటివి కుప్పగూలుతున్న క్షణంలో మనం ఒక పరమార్థం కోసం తపిస్తున్నాం. అవగాహనకు సంబంధించిన మన అవసరాలను సంతృప్తిపర్చుకునేందుకు వాతావరణతత్వం, కోవిడ్ తత్వం, జెండర్ భావజాలం వంటి లౌకిక మతాలను కౌగిలించుకుంటున్నాం. కానీ అమెరికన్ అంటే అర్థం ఏమిటనే ప్రశ్నకు మన వద్ద సమాధానం లేదు.

ఈ మేలుకొలుపు వాదాన్ని (వోక్ ఎజెండా) పలుచన చేసి దాని ప్రాసంగికతను నిర్వీర్యం చేయడం, ఆ శూన్యాన్ని ఉత్తేజకర జాతీయ అస్తిత్వంతో భర్తీ చేయడం రిపబ్లికన్ పార్టీ ప్రథమ ప్రాధాన్యం కావాలి. కానీ దీనికి బదులుగా చాలామంది అగ్రశ్రేణి రిపబ్లికన్లు 1980లలో కంఠస్థం చేసిన నినాదాలను వల్లెవేస్తున్నారు. ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించకుండానే వామపక్ష సంస్కృతిని విమర్శిస్తున్నారు. అమెరికాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు, అమెరికా అంటే ఏమిటి అని మనం కొత్తగా ఆవిష్కరించాల్సిన అవసరం ఉంది. అందుకే నేను అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నాను. ఒక నూతన అమెరికన్ స్వప్నాన్ని రూపొందించడానికి రాజకీయ ప్రచారాన్ని మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తున్నాను.

37 సంవత్సరాల ఒక రాజకీయ ఔట్‌సైడర్ భూమ్మీద అత్యున్నతమైన అధికారాన్ని సాధించాలనుకోవడం అహంకారంగానే కనిపించవచ్చు. కానీ, నేను మన జాతి కోసం, అమెరికన్ జీవితంలోని ప్రతి రంగంలోనూ ప్రతిభను పునరుద్ధరించగలిగే జాతి కోసం దార్శనికతలో భాగంగా పోటీ చేస్తున్నాను.

మనం ప్రతిభను పునరుద్ధరించాలి. నా తల్లిదండ్రులు ఈ దేశానికి చట్టబద్ధంగా వచ్చారు, కష్టపడి పనిచేశారు, వేలాది అమెరికన్ల జీవితాలను మెరుగుపర్చిన వ్యాపార సంస్థలను రూపొందించిన ఇద్దరు పిల్లలను పెంచి పెద్దచేశారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవేశిస్తున్న వారికి బదులుగా మా తల్లిదండ్రుల వంటి వలస ప్రజలు అవసరం. ఎలాంటి మొహమాటాలకూ తావులేకుండా అమెరికా సరిహద్దులకు భద్రత కల్పించడం, ప్రతిభా ప్రవేశాలకు అనుకూలంగా లాటరీ ప్రాతిపదికతో కూడిన వలస విధానాన్ని నిర్మూలించడం అవసరం.

అమెరికాకు వచ్చి విజయాలు పొందినవారి ప్రతిభను మనం తప్పక ప్రోత్సహించాలి. అమెరికా శ్రామిక శక్తిలో దాదాపు 20 శాతం మందిని నియమిస్తున్న ఫెడరల్ కాంట్రాక్టర్లు జాతి ప్రాతిపదికన నియామకాలను చేపట్టడాన్ని తప్పనిసరి చేస్తూ అమెరికా పూర్వ అధ్యక్షుడు లిండన్ బి. జాన్సన్ కార్యనిర్వాహక ఆదేశం 11246 జారీ చేశారు. దీనివల్ల నల్లజాతి, హిస్పానిక్(స్పానిష్ దేశాలు) ఉద్యోగుల పట్ల అగ్రశ్రేణి కంపెనీలు ఎక్కువ అక్కర చూపుతూ– శ్వేత జాతి లేదా ఆసియన్ అమెరికన్లుగా ఉంటున్న అర్హత కలిగిన అభ్యర్థుల పట్ల అనిష్టం ప్రదర్శిస్తున్నాయి. ఇలాంటి కార్యనిర్వాహక ఆదేశాన్ని రద్దు



చేయటమే కాకుండా, అక్రమమైన జాతి ప్రాతిపదిక ప్రాధాన్యాలపై విచారణ జరిపించాలని న్యాయ శాఖను ఆదేశిస్తాను.

ప్రభుత్వాన్ని నిర్వహించడానికి ఎంపికైనవాళ్లు వాస్తవంగా ప్రభుత్వాన్ని నిర్వహించాలి. కాన్నీ ఎన్నికలలో పాల్గొనని ఆంథోనీ ఫాచీ (అమెరికా ముఖ్య వైద్య సలహాదారు), మెర్రిక్ గార్లండ్ (అమెరికా అటార్నీ జనరల్) వంటి బ్యూరోక్రాట్లు తమ పరిధిని మీరి ప్రవర్తించారు. ఇంకోసారి ఇలాంటి బ్యూరోక్రాట్లు తమ పరిధిని మీరినప్పుడు ఒక అధ్యక్షుడికి రాజ్యాంగం కల్పించిన సాధికారతను నేను తప్పకుండా అమలు చేయడానికి నిబద్ధత వహిస్తాను; వారిని తొలగిస్తాను. ఫెడరల్ ఉద్యోగులకు కల్పించిన సివిల్ సర్వీస్ సంరక్షణలను అవసరమైతే కార్యనిర్వాహక ఆదేశం ద్వారా రద్దు చేస్తాను. వీటికి బదులుగా నిర్దిష్టకాలం మాత్రమే రక్షణ కల్పించే మేనేజీరియల్ నిబంధనలను తీసుకొస్తాను. దేశాధ్యక్షుడు ఎనిమిదేళ్లకు మించి అధికారంలో ఉండనప్పుడు, బ్యూరోక్రాట్లకు కూడా దాన్నే వర్తింప జేయాలి. డబ్బును వృథా చేస్తున్న లేదా కాలం చెల్లిన సంస్థలకు నిధులను నిలిపివేసేలా– 1974 నాటి 'ఇంపౌండ్‌మెంట్ కంట్రోల్' చట్టాన్ని రద్దు చేయాలని లేక సవరించాలని అమెరికన్ కాంగ్రెస్‌ను కోరతాను. సంస్కరించడానికి సాధ్యం కాని సంస్థలను మూసివేస్తాను. వాటి స్థానంలో పునాదుల నుంచి కొత్త సంస్థలను నిర్మిస్తాను.

ఏ భావాలనూ సెన్సార్ చేయనప్పుడే ఉత్తమ ఆలోచనలు పుట్టుకొస్తాయి. తమకు అనుకూలంగా లేని రాజకీయ ప్రసంగాలను సెన్సార్ చేయడంపై మన ప్రభుత్వం టెక్నాలజీ కంపెనీలపై ఒత్తిడి తీసుకొస్తోంది. అవి అలా చేసేట్టుగా ప్రత్యేక భద్రతను కల్పిస్తోంది. రాజ్య శక్తులతో కలిసి పనిచేసేలా ఇంటర్నెట్ కంపెనీలు అమెరికన్ రాజ్యాంగ తొలి సవరణకు కట్టుబడి ఉండాలి. ఎలాన్ మస్క్ ట్విట్టర్ విషయంలో చేసినట్టుగా, ఫెడరల్ గవర్నమెంట్ నుంచి 'స్టేట్ యాక్షన్ ఫైల్స్'ను బహిర్గత పరుస్తాను. రాజ్యాంగం నిషేధించిన కార్యకలాపాలను చేపట్టేలా కంపెనీలను బ్యూరోక్రాట్లు తప్పుడు పద్ధతుల్లో ఒత్తిడిపెట్టినట్టు తెలిపే ప్రతి ఉదంతం దీని ద్వారా బయటికొస్తుంది.

ఇంటర్నెట్‌ని దాటి మన ఆర్థిక వ్యవస్థ మొత్తంగా అభిప్రాయాల సెన్సార్‌షిప్ విస్తరించింది. నల్లజాతి, గే లేదా ముస్లింగా ఉంటున్నందుకు మీరు ఎవరినైనా ఉద్యోగం లోంచి తొలగించలేనట్లయితే, రాజకీయ ప్రసంగం కోసం కూడా మీరు ఎవరినీ ఉద్యోగం లోంచి తొలగించకూడదు. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్తగా రాజకీయ వ్యక్తీకరణను ప్రతిష్ఠించడానికి నేను అమెరికన్ కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాను. విభేదించే అభిప్రాయాలను కలిగివుండే కార్మికులను వివక్ష నుంచి కాపాడటానికి ప్రస్తుతం ఉనికిలో ఉన్న పౌర హక్కులను అమలు చేస్తాను. మత పరమైన వివక్షపై ఉన్న ఫెడరల్ ప్రభుత్వ నిషేధం ఉద్యోగులను ఏ మతానికీ లోబడనీయకుండా యజమానులను కట్టడి చేస్తోంది. కార్పొరేట్ అమెరికాలో వ్యాపించివున్న మేలుకొలుపు వాదానికి ఇది సరిగ్గా సరిపోయేట్టుగా ఉంది.

పరస్పరం పంచుకునే సూత్రాల చుట్టూ మన జాతీయ అస్తిత్వాన్ని పునరుద్ధరించుకున్న తర్వాత, అమెరికాకు అతి పెద్ద విదేశీ ప్రమాదంగా ఉన్న కమ్యూనిస్టు చైనా వికాసాన్ని ఓడించడానికి అవసరమైన దృఢత్వాన్ని సమకూర్చుకోగలం. 1980లలో సోవియట్ యూనియన్‌లాగా కాకుండా, చైనా నేడు ఆధునిక అమెరికన్ జీవన శైలికి కావాల్సిన శక్తిని ప్రసాదిస్తోంది. అందుకే మనం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవాలి. చైనాను కనీసం తాకకుండా, అమెరికాను వణికిస్తున్న సరికొత్త వాతావరణ మతం చేస్తున్న డిమాండ్లను వ్యతిరేకించడం ద్వారా మనం ప్రపంచ ఇంధన నాయకత్వాన్ని తిరిగి పొందాలి. తైవాన్‌ను ఏ విధంగానైనా సరే కాపాడుతూనే సెమీ కండక్టర్ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించాలి. 16 సంవత్సరాల లోపు పిల్లలు టిక్ టాక్ ఉపయోగించకుండా నిషేధం విధించాలి. కోవిడ్–19ను వ్యాప్తి చెందించడంపై చైనాను జవాబుదారీని చేయడానికి మనం ఆర్థిక తులాదండాన్ని తప్పకుండా ఉపయోగించాలి. చౌర్యం, వ్యాపారమయ ఎత్తుగడలను చైనా ప్రభుత్వం నిలిపి వేసేంతవరకు అవసరమైతే చైనాలోకి అమెరికన్ కంపెనీలు విస్తరించడాన్ని నిషేధించడానికి కూడా మనం సిద్ధపడాలి.

మనం నిజంగా ఎవరం అని తిరిగి ఆవిష్కరించుకున్నట్లయితే మళ్లీ కాలానికి తగినట్టుగా మనం ఎదగగలం. అమెరికా బలం మన భిన్నత్వం కాదు, ఆ భిన్నత్వానికి అతీతంగా మనల్ని ఐక్యం చేస్తున్న ఆదర్శాలే మన బలం. ఈ ఆదర్శాలే అమెరికన్ విప్లవాన్ని గెలిపించాయి, అంతర్యుద్ధం తర్వాత దేశాన్ని ఐక్యపరిచాయి, రెండు ప్రపంచ యుద్ధాలను, ప్రచ్ఛన్న యుద్ధాన్ని గెలిపించాయి. ఈ ఆదర్శాలు ఇప్పటికీ స్వేచ్ఛాయుత ప్రపంచం పట్ల ఆశను కలిగిస్తున్నాయి. వీటిని మనం పునరుద్ధరించినట్లయితే మనల్ని ఏ శక్తీ ఓడించలేదు.

వ్యాసకర్త అమెరికా అధ్యక్ష స్థానం కోసం పోటీ పడనున్నారు
('వాల్ స్ట్రీట్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పక తలొగ్గారు



మనీశ్ సిసోడియా అరెస్టు పట్ల చాలామంది సీబీఐ అధికారులు వ్యతిరేకంగా ఉన్నట్టు నాకు తెలిసింది. వారందరికీ సిసోడియా అంటే చాలా గౌరవం. పైగా ఆయనకు వ్యతిరేకంగా ఏ సాక్ష్యమూ లేదు. కానీ రాజకీయ ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉందంటే, వాళ్లు తమ రాజకీయ గురువులకు తలొగ్గక తప్పలేదు.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

అవసరం



ప్రభుత్వ కార్యాలయాల్లోంచి మహాత్మా గాంధీ ఫొటోను తొలగించడం నుంచి, సీబీఐ ఘటనలను ఎదుర్కోవడానికి అవసరమైన స్థైర్యం కోసం అదే బాపు సమాధి ముందు ప్రార్థించడం చూస్తుంటే– ఆమ్ ఆద్మీ పార్టీ ఒక పూర్తి చక్రభ్రమణం పూర్తిచేసినట్టుంది.

– ఎస్ ఎస్ ఓర్ఖూ, మాజీ ఉన్నతాధికారి

ముంబయికి ఏమైంది?



ముంబయిలో నేను కలుస్తున్న ప్రతి ఐదుగురిలో ఒకరికి గొంతు నొప్పి, దగ్గు, జలుబు ఉన్నాయి. పైగా ఈ సాధారణ జలుబు నుంచి కోలుకోవడానికి మూడు వారాల కంటే ఎక్కువ సమయం పడుతోంది. ఏమైనట్టు? గాలి నాణ్యత సమస్యా? మిగతా నగరాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉందా?

– అదిత్ పోద్దార్, ఆంత్రప్రెన్యూర్

మూసుకుపోతుంది



ఐడియాలజీ అనేది మనల్ని ఒక వాస్తవంతో కూడా విభేదించేలా చేస్తుంది – కేవలం ఆ వాస్తవం మరో వైపు నుంచి వచ్చిందన్న కారణంగా. మేధను ఐడియాలజీ విషపూరితం చేస్తుంది.

– అమిత్ పాండేయా, కాలమిస్ట్

దేనికోసం?



లాక్‌డౌన్లు పని చేయలేదు. మాస్కులు పని చేయలేదు. 'టీకాలు' పని చేయలేదు. మరెందుకోసం అవన్నీ?

– అనస్తాసియా మారియా లూపిస్, డెన్మార్క్ వైద్యురాలు

అత్యంత విషాదకరం

వరంగల్ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరం. ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తరచుగా బలవన్మరణాలకు పాల్పడడం విస్మయకరం. ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితుల్ని అధిగమించలేని బలహీన స్థితినీ, వాటికి ఊతమిస్తున్న వాతావరణాన్నీ లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. గత వారమే ఐఐటీ ముంబై విద్యార్థి దర్శన్ క్యాంపస్‌లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు ముంబై వైద్య కళాశాలలో మరో పీజీ విద్యార్థి పాయల్‌దీ ఇదే కథ. దశాబ్ద కాలంలో ఉన్నత విద్యాలయాల్లో 122 మంది ఇలా బలవన్మరణాలకు పాల్పడగా అందులో సగానికి పైగా బలహీన వర్గాల నుండి వచ్చిన వారే. పైన ఉదహరించిన ముగ్గురూ దళిత, ఆదివాసీ కుటుంబాల నుండి వచ్చిన వారే. పేదరికం నేపథ్యంగా ఎదిగిన వారే. ఆత్మహత్యలకు వేరు వేరు కారణాలు ఉండొచ్చుగానీ వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన మార్గాలు స్పష్టమే. మొదట విద్యాలయాల్లో అంతర్గతంగా, బహిరంగంగా వివక్షకు గురిచేసే పరిస్థితులకు అడ్డుకట్ట పడాలి. ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపాలి. మార్కుల విధానం, ఇతర అసెస్‌మెంట్ విధానాలు పారదర్శకంగా ఉండాలి. పక్షపాతం లేని విధంగా పాలనా విధానాలు యూనివర్సిటీల్లో అమలు కావాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులకు, మానసికంగా మద్దతు అవసరం పడ్డవారికి కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి. గౌరవ సుప్రీం ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డట్టు యూనివర్సిటీలో సహానుభూతి (ఎంపతీ) వాతావరణం ఉండేలా చూడాలి. ఇది దేశవ్యాప్తంగా ఉన్న తీవ్ర సమస్య. లోతైన అవగాహనా, చిత్తశుద్ధి గల కార్యాచరణ అవసరం.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

దేవుడా... ఏమిటిదంతా?!

నాకు ఎప్పుడూ ప్రశాంతంగా నిద్ర పట్టదు. అందువల్ల నేల ఉబికి వస్తున్నట్టు అనిపించేసరికి వెంటనే మెలకువ వచ్చింది. కంగారుగా లేచి మేం పడుకునే మంచానికి పక్కనే నిద్రపోయే మా నాలుగేళ్ల పాప కోసం చూశాను. ఆమె మా కాళ్ల దగ్గరుంది. వెంటనే ఆమెను చేతుల్లోకి తీసుకుని నా భార్యను గట్టిగా అరుస్తూ లేపాను. ఆమె లేస్తూనే ప్రార్థన సమయంలో వాడే దుస్తుల్ని కప్పుకునే ప్రయత్నం మొదలెట్టింది. 'ముందు ప్రాణం ముఖ్యం. అవన్నీ తర్వాత చూసుకుందాం' అంటూనే తాళం చెవి కోసం వెతికాను. వీధి గదివైపు పరుగెత్తేలోగానే భూకంపం తాకిడి మరింత పెరిగింది. తలుపువైపు ఎలా పరుగెత్తామో, బ్యాలెన్స్ చేసుకోవడానికి ఎంత ప్రయత్నించామో తల్చుకుంటే ఇప్పటికీ భయం వేస్తుంది. తాళం చెవి సరిగా పెట్టి తీయడానికి దాదాపు 15 సెకన్ల సమయం పట్టింది. బయటికొచ్చి తలుపులు వేసి వణికించే చలిలో, వర్షం పడుతుండగా చెప్పులు లేకుండా రోడ్డు మీది కొచ్చాం.

'బాబా ఇది కూడా అసాద్ ఛూ...ఛూ అని పేలుస్తున్నందు వల్లేనా?' మా పాప అడిగింది.

అంతర్యుద్ధం జరిగే ప్రాంతానికి కొన్ని మైళ్ల దూరంలోని బిన్నిష్ పట్టణంలో ఉండటం వల్ల నాలుగేళ్ల మా పాపకు తుపాకి గుళ్ల చప్పుడు, వైమానిక దాడులు, యుద్ధ విమానాల మోతలు అలవాటై పోయాయి. వాటన్నిటినీ తన భాషలో 'ఛూ...ఛూ' అంటుంది.

నిజానికి ఆమె ఈసారి వింటున్న చప్పుడు సమీపంలోని మసీదుల గుమ్మటాలు కూలిపోతున్న చప్పుళ్లు.

మా ఇరుగుపొరుగంతా ఇళ్లల్లోంచి బయటకు రావటం మొదలైంది. మాలాగే ఎవరి కాళ్లకూ చెప్పుల్లేవు. పైజమాలతో వణికించే చలిలో, వర్షంలో నిస్సహాయంగా నిలబడ్డారు.

భూకంపం కాస్త తగ్గాక వెంటనే నేను లోపలికి పరుగెత్తి సిరియాలోనూ, దక్షిణ టర్కీలోనూ ఉన్న మా బంధువులకు ఫోన్లు చేయడం మొదలుపెట్టాను. వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నాను. ఆ తర్వాత కారు తీసి ఎక్కడ ఎలాంటి విధ్వంసం జరిగిందో చూడటానికి వెళ్లాను. ఎటు చూసినా కూలిన ఇళ్లు, గోడలు. రోడ్లన్నీ అంబులెన్సులతో, పౌర రక్షణ బృందాలతో నిండివున్నాయి.

డ్రైవింగ్ చేస్తున్నంతసేపూ నన్ను తొలుస్తున్న ప్రశ్న ఒక్కటే. 'దేవుడా! ఇదంతా మాకు అవసరమా? నియంతృత్వం, యుద్ధం, నరమేధాలు... ఇప్పుడు ఈ భూకంపం! అన్నీ మాకే ఎందుకు జరుగుతున్నాయి? ఇది మా సహనానికి నువ్వు పెట్టే పరీక్షా?'

రోజంతా నేను కలిసినవారితో ఇదే చర్చ. ఎక్కడికెళ్లినా రోదనలు. అందరూ కాపాడమని, ఈ కష్టాలనుంచి గట్టెక్కించాలని దేవుణ్ణి వేడుకుంటున్నవారే.

అతారిబ్ పట్టణంలో నేను చూసిన దృశ్యాలు వర్ణించ శక్యం కానివి. ఫుట్‌బాల్ గ్రౌండ్ అంత సైజులో ఉన్న భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.



సిరియా ప్రభుత్వ నరమేధం నాటి రోజుల్లోకి మళ్లీ వెళ్లామా అన్న భావన నాలో కలిగింది. ఇప్పుడు కూడా గాలిలో ఆ నెత్తుటి వాసనే. మరో రాకెట్ దాడి ఏ క్షణమైనా జరగొచ్చని అప్పట్లో భయపడినట్టే ఇప్పుడు భూమి ఏ క్షణంలో మళ్లీ కంపిస్తుందోనన్న భయం మమ్మల్ని వదలడం లేదు. ఇంతవరకూ వరసబెట్టి ఒక డజను సార్లయినా ప్రకంపనలు వచ్చాయి. వచ్చినప్పుడల్లా మా ప్రాణాలు తోడేశాయి. పౌరరక్షణ బృందాలు కూలిన ఇళ్లలో గాలిస్తుంటే ఆ శిథిలాల ముందు తమ ఆప్తుల జాడ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న జనాన్ని చూస్తే నాకు దుఃఖం ఆగలేదు. సజీవంగా బయటపడుతున్నవారు కొందరైతే... విగతజీవులుగా మారినవారు కొందరు. కొన్ని ముఖాలైతే ఆనవాలుకు కూడా చిక్కనంతగా చితికిపోయాయి. వారి స్థానంలో నన్ను నేను ఊహించుకుని ఆపుకోలేక భోరున విలపించాను.

(సిరియాలో వేలాదిమందిని బలిగొన్న భూకంపంపై అక్కడి పాత్రికేయుడు మహమ్మద్ హాజ్ కదౌర్ రాసిన వ్యాసం)

సార్వజనీన సైన్స్ ఇప్పటి అవసరం

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

1986 నుంచి మన దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీని 'జాతీయ విజ్ఞాన దినోత్సవం' (నేషనల్ సైన్స్ డే)గా జరుపుకొంటున్నాం. సైన్స్‌కు సంబంధించి పెరిగిన అవసరాలు, ప్రాముఖ్యం మరింత తెలియజెప్పడానికి సీవీ రామన్ మహాశయుడు 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) కనుగొన్న ఫిబ్రవరి 28 (1928) తేదీని ఎంచుకుని ప్రత్యేక ఇతివృత్తం (థీమ్) దిశగా పలు కార్యక్రమాలు పలు స్థాయిలలో జరగడం పరిపాటి అయ్యింది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ శాస్త్రవేత్తలు వ్యాపించి ఎన్నో రకాల పరిశోధనలు చేస్తున్నారు అలాగే అణుశక్తి పరిశోధనలోనూ, అంతరాళ ప్రయోగాలలోనూ ఎంతో ప్రతిభ కనబరిచిన మన దేశం... ఆహార ధాన్యాల దిగుబడిలో, ఆరోగ్యసదుపాయాల కల్పనలో, సగటు మనిషికి అవసరం అయిన సౌకర్యాలను అందివ్వడంలో ఎంతో విజయం సాధించిన మాట వాస్తవమే. అయినా మౌలిక రంగంలో విశేషమైన ప్రభావం కల్గించిన ఆ స్థాయి పరిశోధనలు మన దేశం నుంచి ఎక్కువగా రాక పోవడం బాధాకరమే.



మనిషి పుట్టుక నుంచీ పరిణామాన్ని గమనిస్తే ఎందుకు? ఎలా? ఏమిటి? ఎప్పుడు? ఎవరు? వంటి సందేహాలే ఇతర జీవకోటి నుంచీ మనిషిని వేరు పరిచాయి. అటువంటి ఆలోచనారీతి కారణంగానే మనిషి తన చుట్టూ ఉన్న పరిసరాలు, వాతావరణ మార్పు, ఇతర జంతుకోటి వంటివాటి గురించిన భయాన్ని పోగొట్టుకునే రీతిలో అన్వేషణ ప్రారంభించాడు. ఈ తొలి అడుగుకు దోహదపడిందీ, నేపథ్యంగా నిలిచిందీ సైన్సు మాత్రమే. ఈ పరిశీలన రీత్యా పలు రకాల పరిజ్ఞానాన్ని గడించి దాన్ని వివిధ శాఖలుగా వింగడించి, వర్గీకృతమైన జ్ఞానాన్ని (క్లాసిఫైడ్ నాలెడ్జ్) 'సైన్స్' అని పేర్కొంటున్నాం.

ప్రపంచవ్యాప్తంగా మానవాళికి తెలిసిన శాఖోపశాఖల విజ్ఞానాన్నంతా 'విజ్ఞానం' (సైన్స్)గా పిలుస్తున్నారు. ఈ సూత్రాలు, నియమాల ఆధారంగా సౌలభ్యంగా మానవ శ్రమని తగ్గిస్తూ, సౌకర్యవంతంగా జీవితం ఉండేలాగున తయారు చేసుకున్న పనిముట్లను; రూపొందించుకున్న నిర్మాణ సామగ్రిని, పద్ధతుల్ని 'సాంకేతిక శాస్త్రం' (టెక్నాలజీ)గా సంభావిస్తాం. సైన్స్ స్థాయిలో అది ఖర్చుతో కూడిన వ్యవహారం, ప్రత్యేకంగా నేరుగా లాభం కలిగే సదుపాయం లేనిది. దీనిని మౌలిక విజ్ఞాన శాస్త్రాలు (బేసిక్ సైన్సెస్) అంటారు. ప్రస్తుత ప్రపంచంలో ఆకర్షణ కోల్పోయినవి ఈ మౌలిక విజ్ఞాన శాస్త్రాలే.

ఏ పార్శ్వంలో అయితే అవసరాలు పెరిగాయో... ఆ దిశలో దృష్టి పెట్టే రీతిలో ఆయా సంవత్సరాల సైన్స్ డే ఇతివృత్తం (థీమ్) స్వీకరించబడుతుంది. 2023వ సంవత్సరానికి మనదేశం విజ్ఞానశాస్త్రం పరంగా 'గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్' (ప్రపంచ శ్రేయస్సుకి ఊతం ఇచ్చే సార్వజనీనమైన విజ్ఞానం) అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసుకుంది. కరోనా పరామర్శతో ప్రపంచవ్యాప్తంగా మనం ఎంతోకాలంగా రూపొందించుకున్న వ్యవస్థలు ఛిన్నాభిన్నం అవడమే కాకుండా... మనం నిర్మించుకున్న టెక్నాలజీ కవచాలు డొల్లవని కూడా తేలిపోయింది. కనుక ప్రపంచ మానవాళిని దృష్టిలో పెట్టుకుని ఉపయోగపడే సైన్స్ గురించి ఇప్పుడు ఆలోచించాలి.

ప్రాంతం, భాష, దేశం, ఖండం వంటి పరిమితులు నియంత్రించని విజ్ఞానాన్ని రూపొందించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. వనరులను పొదుపు చేయడంలో కానీ, తక్కువ కాలుష్యం కలిగించే రీతిలో వనరుల వినియోగ విధానాలు ఏర్పరచుకోవడంలో కానీ, అలాగే ప్రపంచ స్థాయిలో మన దేశ గౌరవాన్ని ప్రతిష్ఠను ద్విగుణీకృతం చేసే సైన్సు గురించి గానీ మనం కృషి చెయ్యాలి. అంటే మనకున్న పరిమితుల్ని అధిగమిస్తూ ప్రపంచ అవసరాల దృష్ట్యా వ్యూహం సారిస్తూ ముందుకు సాగాలి. అయితే సైన్స్ లక్ష్యం వాణిజ్యం కానీ, ఆర్థికం కానీ, అధికార వ్యూహాలు కానీ, రాజకీయాలు కానీ, రాజకీయ ఎత్తుగడలు కానీ కాకుండా ప్రపంచ శ్రేయస్సే పరమావధి కావాలి! ఆ రీతిలో మనలను మనం సమాయత్తం చేసుకోవాలి. అవసరం అయితే సంకుచిత భావాలను తగ్గించుకుని, విశ్వమానవాళి గురించి ఆలోచించాల్సిన అగత్యం కూడా ఉంది. దానికి తగ్గట్టుగానే మన వాదనలు, ప్రణాళికలు, ప్రయోగాలు, వ్యూహాలు సాగాల్సి ఉంటుంది.

వ్యాసకర్త పాపులర్ సైన్సు రచయిత । 99407 32392
(నేడు నేషనల్ సైన్స్ డే)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.నవమి పూర్తి (24గంటలు), నక్షత్రం: రోహిణి ఉ.10.16 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.4.17 నుండి 5.59 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.28 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: రా.2.33 నుండి 4.16 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 601.

క్లుప్తంగా...

నృసింహస్వామి పెండ్లికొడుకాయెనే..

- వైభవోపేతంగా ఎదుర్కోలు మహోత్సవం
- నేడు తుల లగ్న ముహూర్తంలో శ్రీస్వామివారి కల్యాణోత్సవం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఉదయం ప్రధానాలయ మాఢ వీధుల్లో శ్రీస్వామివారు జగన్మోహిని అలంకార సేవలో..సాయంత్రం అశ్వవాహనంపై పెండ్లి కొడుకుగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారిని ఆలయ మాఢవీధిలో ఊరేగించారు.

గజవాహనంపై కల్యాణోత్సవానికి...

శ్రీనృసింహస్వామికి లక్ష్మీదేవితో వివాహం చేసేందుకు మూహుర్తాన్ని ఆచార్యులు నిర్ణయించారు. శ్రీస్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి 7.30 గంటలకు గజవాహనంపై శ్రీస్వామి, ప్రత్యేక పల్లకీపై అమ్మవారు మాఢవీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ మండపానికి చేరుకుంటారు. అనంతరం 8 గంటలకు బ్రహ్మోత్సవ మండపానికి చేరుకున్న తర్వాత శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ వేడుకను ప్రారంభించి...తుల లగ్నం ముహుర్తంలో రాత్రి 9.30గంటలకు శ్రీస్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ చేయనున్నారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లను ఆలయాధికారులు, ఆచార్యులు పూర్తి చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీస్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. రాష్ట్ర మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ముఖరా(కె) గ్రామానికి రాష్ట్రపతి అవార్డు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కె) గ్రామం ఓడీఎఫ్ ప్లస్ సాధించి రాష్ట్రపతి అవార్డుకు ఎంపికై ంది. సర్పంచ్ గాడ్గే మీనాక్షి మార్చి 4న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈమేరకు ఆమెకు సోమవారం ఆహ్వానం అందింది. కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సుజల జలశక్తి సమ్మాన్‌–2023 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపికై నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మీనాక్షి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ముఖరా (కె) అవార్డుకు ఎంపికకావడం గర్వకారణంగా ఉందన్నారు.

ప్రేమికుడి వంచనతో విద్యార్థిని బలవన్మరణం

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఘటన



ఎల్కతుర్తి: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన పోగుల ఉషారాణి(25) కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని శ్రీవికాస్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) కోర్సు చేస్తోంది. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా దామెరకుంటకు చెందిన రామ్‌ప్రశాంత్ అనే యువకుడు ఏడాది నుంచి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లోబర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోవాలని ఉషారాణి .. ఒత్తిడి చేయడంతో చేసుకోనని మాట మార్చాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ఉషారాణి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జక్కుల పరమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రామ్‌ప్రశాంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

'జనగణనలో భాగంగా కులగణన చేపట్టాల్సిందే'

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా గణనలో భాగంగా కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులాలవారీగా జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలంటే కులగణన కీలకమన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చే యాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం అత్యంత దారుణమన్నారు. ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనగణనలో భాగంగా కులగణనకు మద్దతు తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి కోసంజాతీ య స్థాయిలో న్యాయ సలహా మండలి ఏర్పా టు చేస్తామని చెప్పడం శుభపరిణామమని జాజుల వ్యాఖ్యానించారు.

లొంగిపోయే ముందే శరీర భాగాలు కాల్చేసి..

- నవీన్‌ను హత్యచేసిన హరిహరకృష్ణ రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే అంశాలు... గొంతు నులిమి చంపేసి.. తల, కాళ్లు, చేతులు, గుండె, పెదాలు కోసేసి..
- శరీర భాగాలను సంచీలో వేసుకెళ్లి దూరంగా పడేసిన వైనం
- దీనికి సంబంధించిన ఫొటోలను ప్రియురాలికి పంపిన తీరు
- అనంతరం తప్పించుకునేందుకు వేరే ఊర్లకు వెళ్లిన నిందితుడు
- అన్నివైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో తిరిగి హైదరాబాద్‌కు..
- శరీర భాగాలను దహనం చేసి పోలీస్‌స్టేషన్‌లో లొంగుబాటు
- హరిహరకృష్ణ కస్టడీ కోసం కోర్టులో పోలీసుల పిటిషన్

అబ్దుల్లాపూర్‌మెట్: తన ప్రేమకు అడ్డుగా ఉన్నాడని ప్రాణ స్నేహితుడైన నవీన్‌ను దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ రిమాండ్ రిపోర్ట్‌లో విస్తుపోయే అంశాలు వెల్లడయ్యాయి. హరిహరకృష్ణ లొంగిపోయిన తర్వాత వెల్లడించిన వివరాలు, తమ దర్యాప్తులో తేలిన అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆ రిపోర్టుప్రకారం.. ప్రియురాలికి, తనకు అడ్డుగా ఉన్నాడన్న ఉద్దేశంతో నవీన్‌ను అంతం చేసేందుకు హరిహరకృష్ణ 3 నెలల ముందే ప్రణాళిక రచించాడు. అందులో భాగంగానే మలక్‌పేటలోని ఓ దుకాణంలో పదునైన కత్తిని కొనుగోలు చేసి పెట్టుకున్నాడు. అదును కోసం ఎదురుచూస్తూ ఈ నెల 17న ప్లాన్ అమలుకు సిద్ధమయ్యాడు. ఇంటర్ మిత్రుల గెట్ టు గెదర్ ఉందని నవీన్‌ను పిలిచాడు. మధ్యాహ్నం దాకా ఇద్దరూ కలిసి తిరిగారు. సాయంత్రం పెద్దఅంబర్ పేటలోని వైన్స్ వద్ద మద్యం కొని తాగారు.

గొంతు నులిమి చంపి..

ఇద్దరూ మద్యం తాగాక హరిహరకృష్ణ ప్లాన్ ప్రకారం నవీన్‌ను ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోకి తీసుకువచ్చాడు. ఈ క్రమంలోనే ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న హరిహరకృష్ణ.. నవీన్ ను గొంతు నులిమి హత్య చేశాడు. వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్ మృతదేహంపై పొడిచాడు. తల, కాళ్లు, చేతులు, గుండె, పెదాలను కోసేశాడు. ఆ భాగాలను ఓ సంచీలో వేసుకుని అర్ధరాత్రి వరకూ అక్కడే ఉన్నాడు. 18వ తేదీన తెల్లవారుజామున నవీన్ శరీర భాగాలున్న సంచీని తీసుకుని ఘటనా స్థలానికి దగ్గరలో ఉన్న తుర్కయాంజాల్‌లోని బ్రాహ్మణపల్లి వద్ద చెట్ల పొదల్లో విసిరేశాడు. తర్వాత అదే గ్రామంలో ఉన్న స్నేహితుడు హసన్ ఇంటికి వెళ్లాడు. స్నానం చేశాక నవీన్‌ను హత్య చేసిన విషయం అతడికి చెప్పాడు. దీంతో భయపడిన హసన్ అక్కడి నుంచి వెళ్లిపోవాలనడంతో.. హరిహరకృష్ణ తన ప్రియురాలికి ఫోన్ చేసి, నవీన్‌ను హత్య చేసిన విషయాన్ని చెప్పాడు. ఆమె నమ్మకపోవడంతో నవీన్ శరీర భాగాల ఫొటోలను ఆమెకు వాట్సాప్‌లో పంపించాడు. దీనిపై ఆందోళన చెందిన ప్రియురాలు.. పోలీసులకు లొంగిపోవాలని హరిహరకృష్ణకు సూచించింది.

పారిపోయి.. తిరిగొచ్చి కాల్చేసి..

నవీన్ ఆచూకీ కోసం అతడి కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి పెరగడంతో.. హరిహరకృష్ణ ఫోన్ స్విచాఫ్ చేసి హైదరాబాద్ నుంచి వెళ్లిపోయాడు. వరంగల్, కోదాడ, ఖమ్మం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి వారం తర్వాత తిరిగి వచ్చాడు. నేరుగా బ్రాహ్మణపల్లికి వెళ్లాడు. చెట్ల పొదల్లో విసిరేసిన నవీన్ శరీర భాగాలతోకూడిన బ్యాగును బయటికి తీసి, దహనం చేశాడు. అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు హరిహరకృష్ణను తీసుకెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. 25న హయత్‌నగర్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపర్చి.. రిమాండ్ కోసం చర్లపల్లి జైలుకు తరలించారు.

హరిహరకృష్ణ కస్టడీ కోసం పోలీసుల పిటిషన్

నవీన్ హత్య కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు 8 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు మొదట హయత్‌నగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ ఘటనకు సంబంధించి హత్యకేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదవడంతో.. పోలీసుల పిటిషన్‌ను రంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. దీనిపై కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకోనుంది.

పురుగుల మందు తాగి.. చెట్టుకు ఉరేసుకుని..

ప్రేమ జంట బలవన్మరణం

- ప్రేమను పెద్దలు అంగీకరించరనే భయంతో అఘాయిత్యం
- మృతదేహాల వద్ద సూసైడ్‌నోట్ లభ్యం
- నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలంలో విషాదం



రాకేశ్ (ఫైల్)



దేవి (ఫైల్)

చందంపేట: తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరన్న భయంతో ఓ ప్రేమ జంట పురుగుల మందు తాగి ఆపై చెట్టుకు ఉరేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా.. దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామానికి చెందిన అందుగుల భిక్షమయ్య, మార్తమ్మ దంపతుల కుమారుడు రాకేశ్(20) డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేసి కూలి పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కొండమల్లేపల్లి మండలం దోనియాల గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణయ్య, జయమ్మ దంపతుల కుమార్తె దేవి(16) దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. దేవి గతేడాది చింతపల్లి మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న సమయంలో రాకేశ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరువురూ తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్పడంతో రాకేశ్ కుటుంబసభ్యులు అంగీకరించగా దేవి తరఫు బంధువులు నిరాకరించారు. ఈ క్రమంలో దేవి ఆదివారం రాకేశ్‌కు ఫోన్ చేసి తనకు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, నేను వేరొకరిని పెళ్లి చేసుకుని బతకలేనని, వచ్చి తీసుకెళ్లాల్సిందిగా కోరింది. దీంతో రాకేశ్ అదే రోజు ఆమెను ఇంటి నుంచి తీసుకొచ్చి బైక్‌పై నేరెడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామ శివారులోని ఉచ్చలబుడ్డి వద్దకు చేరుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆపై చెట్టుకు తాడుతో ఉరి వేసుకున్నారు. సోమవారం కాచరాజుపల్లి గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలంలో తమ చావుకు ఎవరూ కారణం కాదని, తల్లిదండ్రులు క్షమించాలని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఒవైసీ వియ్యంకుడి ఆత్మహత్య

- పిస్టల్‌తో కాల్చుకొని డాక్టర్ మజారుద్దీన్ మృతి
- ఒవైసీ ఆస్పత్రిలో ఆయన ఆర్థోపెడిక్ విభాగం డీన్
- కుటుంబ, ఆర్థిక వివాదాలే కారణమని అనుమానం

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడు డాక్టర్ మజారుద్దీన్ అలీఖాన్ (60) తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో కాల్చుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఆయన ఇంట్లోనే ఈ ఉదంతం జరిగింది. ఆర్థిక, కుటుంబ వివాదాలే కారణమని అనుమానిస్తున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మజారుద్దీన్ ప్రస్తుతం ఒవైసీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగం డీన్‌గా పనిచేస్తుండగా.. ఆయన కుమారుడు అబేద్ అలీఖాన్ అదే హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జన్‌గా ఉన్నారు. అబేద్‌కు అసదుద్దీన్ ఒవైసీ కుమార్తె యాస్మిన్ ఒవైసీతో 2020 సెప్టెంబర్ 22న వివాహమైంది. మజారుద్దీన్ ఇంట్లో భార్య అఫియా రషీద్ అలీఖాన్, అబేద్, యాస్మిన్ ఉంటుండగా.. మజారుద్దీన్ కుమార్తె జైనా అలీఖాన్ అమెరికాలో నివసిస్తున్నారు. ఆర్థిక, కుటుంబ వివాదాల నేపథ్యంలో కొన్నాళ్లుగా మజారుద్దీన్, అఫియా మధ్య విభేదాలు ఉన్నాయి. దీంతో వారు ఒకే ఇంట్లోనే వేర్వేరుగా ఉంటున్నారు. రెండు రోజులుగా వారి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సోమవారం ఉదయం తన గదిలోకి వెళ్లిన మజారుద్దీన్ తలుపులు గడియపెట్టుకున్నారు. ఆపై తన వద్ద ఉన్న .32 క్యాలిబర్ లైసెన్స్ పిస్టల్‌తో కుడివైపు చెవి పైభాగంలో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గది పూర్తిగా మూసి ఉండటంతో శబ్దం ఎవరికీ వినిపించలేదు. మజారుద్దీన్ మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్పత్రికి రాకపోవడంతో అబేద్ ఆయనకు ఫోన్ చేశారు. ఫోన్ ఎత్తకపోవడంతో తాజుద్దీన్‌కు ఫోన్ చేసి విషయం ఆరా తీయాలని సూచించారు. దాదాపు ఒంటి గంట ప్రాంతంలో తాజుద్దీన్ వెళ్లి మజారుద్దీన్ గది తలుపు తట్టినా ఎంతకీ తెరుచుకోకపోవడంతో కిటికీ నుంచి చూడగా మజారుద్దీన్ మంచంపై రక్తపు మడుగులో పడి ఉండటం గమనించాడు. వెంటనే మజారుద్దీన్ భార్య, పనిమనిషుల సాయంతో తలుపులు తీసి మజారుద్దీన్‌ను కారులో అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలి నుంచి తూటా, ఖాళీ క్యాట్రిడ్జ్‌ను క్లూస్ టీమ్ స్వాధీనం చేసుకుంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. ఆస్తి తగాదాలు ఉన్నట్లుగా విచారణలో తేలిందని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలోనే వెనుకబడిన ప్రాంతం అలంపూర్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



శింగవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్

అలంపూర్ రూరల్: రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠం ఉన్న అలంపూర్ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యం వల్ల చాలా వెనుకబడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌తోపాటు జిల్లెలపాడు, సుల్తాన్‌పూర్, ర్యాలంపాడు, శింగవరం-1, శింగవరం-2, కాశీపురంలో సోమవారం బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారానికి 189వ రోజుకు చేరిందన్నారు. రాష్ట్రంలో చివరి ప్రాంతమైన అలంపూర్ మండలం జిల్లెలపాడు, సుల్తాన్‌పూర్, ర్యాలంపాడ్ గ్రామస్తులను ప్రభుత్వాలు ఓట్ల కోసమే వినియోగించుకుంటున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆరోపించారు. ఆయా గ్రామాల్లో రహదారులు సరిగా లేక స్థానికులు అవస్థలు పడుతున్నారని, బస్సు సౌకర్యానికి నోచుకోని దయనీయస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన మెడికో ధరావత్ ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ లేదని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఎందుకు ఖాళీగా ఉంచారో ముఖ్యమంత్రి కేసీఆర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'ముస్లిం 4 శాతం కోటాపై ఉన్నతస్థాయి విచారణ'

సాక్షి, హైదరాబాద్: ముస్లింలకు ఉద్యోగాల్లో బీసీ–ఈ కేటగిరీ కింద 4 శాతం కోటాపై ఇటీవల తలెత్తిన గందరగోళంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కోరారు. 2022లో 4 శాతం ముస్లిం కోటాను 3 శాతానికి తగ్గించినట్లు చూపుతున్న సాధారణ నిబంధనల రోస్టర్ పాయింట్ నంబర్ 69 కాపీని సోషల్ మీడియాలో ప్రసారం చేశారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ–ఈకోటాపై గందరగోళం వెనుక పెద్ద కుట్ర ఉందని, తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడాలని, తప్పుడు పుకార్లు వ్యాప్తి చేసిన అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.



బహిరంగ సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వాళ్లవి దివాలాకోరు రాజకీయాలు

▶ మొదటి పేజీ తరువాయి

బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదని.. అంబానీలు, అదానీలకు ఊడిగం చేయడంలోనే మునిగిపోయాయని ఆరోపించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఎక్కువకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ.. కరువు, కరెంటు కోతలు, దారిద్ర్యాన్ని మిగిల్చిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అరాచకపాలనను ప్రశ్నిస్తే దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడాషపల్లిలో సుమారు రూ.152 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సోడాషపల్లి క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన రైతు కృతజ్ఞత సభలో ప్రసంగించారు. కేటీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''కొందరు రాజకీయ నిరుద్యోగులు పాదయాత్రలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వండి అని పీసీసీ అధ్యక్షుడు అడుక్కుంటున్నాడు. మీ దిక్కుమాలిన పార్టీకి ప్రజలు 10 చాన్సులు ఇచ్చారు. ఏం చేశారు? గుడ్డి గుర్రాల పళ్లు తోమారా? కరెంట్, సాగు, తాగునీరు ఇవ్వలేదు. ఇప్పుడేమో ఎగతాళిగా మాట్లాడుతూ.. ఒక్క చాన్స్ ఇవ్వండి అని అడుక్కుంటే మీకు ఓటెయ్యాలా? రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే మాటలను ఎవరూ నమ్మరు.

మతం పేరుతో మంటపెడ్తున్న బీజేపీ

బీజేపీ మతం పేరుతో మంటలు రేపుతూ, కులం పేరిట కుంపట్లు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. కేంద్రంలో అరాచక పాలన సాగిస్తున్న బీజేపీని విమర్శిస్తే దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తున్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదు. ఎందాకైనా పోరాడుతాం. అన్నింటి ధరలు పెంచి ప్రజలపై భారం మోపినందుకు మోదీని దేవుడని అనాలా? బండి సంజయ్ ఏం మాట్లాడుతాడో ఎవరికీ అర్థం కాదు. కిషన్‌రెడ్డికి మెదడు మోకాళ్లలో ఉందో, అరికాళ్లలో ఉందో అర్థం కాదు.

ప్రజలంతా మా కుటుంబమే..

కేసీఆర్‌ను విమర్శించేందుకు విపక్షాలకు ఏ కారణమూ దొరకక కుటుంబ పాలన అని విమర్శలు చేస్తున్నారు. బరాబర్ చెప్తున్నా.. మాది కుటుంబ పాలనే.. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలంతా మా కుటుంబ సభ్యులే. ప్రతి కుటుంబంలో కేసీఆర్ భాగస్వామే. 65లక్షల మందికి పెట్టుబడి సాయం ఇచ్చి రైతులందరికీ పెద్దన్న అయ్యారు. 45లక్షల మందికి ఆసరా పెన్షన్లతో వృద్ధులను కడుపులో పెట్టుకున్నారు. 12 లక్షల మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఇచ్చి పేదింటి ఆడబిడ్డలకు మేనమామ అయ్యారు. ఇందులో కులం పంచాయతీ లేదు. మతం పిచ్చి లేదు. జనహితమే మా అభిమతంగా పని చేస్తున్నాం. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు, పట్టణాలు బాగు పడుతున్నాయి. సీఎం కేసీఆర్ ముందు చూపుతో పంజాబ్, హరియాణాలతో తెలంగాణ రైతులు పోటీ పడుతున్నారు..''అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రాజయ్య, దాస్యం వినయభాస్కర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, అరూరి రమేష్, వొడితెల సతీశ్‌కుమార్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు సైఫ్ అయినా.. సంజయ్ అయినా వదలం..

పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం, పార్టీపరంగా ప్రీతి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కాలేజీలో జరిగిన ర్యాగింగ్ వల్ల మనస్తాపానికి గురై డాక్టర్ ప్రీతి చనిపోవడం చాలా బాధాకరమని.. కానీ ఈ విషయాన్ని కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ''నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలేది లేదు. నిందితుడు సైఫ్ అయినా.. సంజయ్ అయినా వదిలిపెట్టబోం..''అని వ్యాఖ్యానించారు.

మాజీ మంత్రి డీఎస్‌కు అస్వస్థత

బంజారాహిల్స్ (హైదరాబాద్): మాజీ మంత్రి డి.శ్రీనివాస్ (డీఎస్) తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో సోమవారం ఆయన్ను చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని సిటీన్యూరో ఆస్పత్రిలో చేర్చారు. ఉదయం ఆయనకు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి తగ్గిపోగా ఆ వెంటనే ఫిట్స్ రావడంతో గుర్తించిన డీఎస్ తనయుడు, ఎంపీ ధర్మపురి అర్వింద్ సిటీ న్యూరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఐసీయూలో ఆయనకు ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం పరీక్షలు నిర్వహించింది. ఎంఆర్ఐతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించగా.. అన్నిట్లోనూ రిపోర్ట్ నార్మల్‌గా వచ్చినట్లుగా వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం డీఎస్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని, రెండు, మూడ్రోజులు ఆస్పత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుందని వైద్యులు వెల్లడించారు.

సాగునీటి కోసం అన్నదాత ఆందోళన

- పురుగుమందు డబ్బాలతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు
- కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి పట్టించుకోలేదని ఆవేదన
- పురుగుల మందు తాగేందుకు ప్రయత్నం.. అడ్డుకున్న పోలీసులు



సూర్యాపేట కలెక్టరేట్ వద్ద బైఠాయించిన రైతులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్లపైకి వచ్చారు. సాగునీరు కోసం కంటనీరు పెట్టారు. ఎస్సారెస్పీ జలాలు పూర్తిస్థాయిలో రావడం లేదని మోతె మండలం గోల్ తండాకు చెందిన రైతులు సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎస్సారెస్పీ ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నామని, ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం తమ గోడు వినాలని మొరపెట్టుకున్నారు. తమ పొలాలకు సాగునీరు అందించకపోతే చావే శరణ్యమంటూ తమ వెంట పురుగుల మందు డబ్బాలను తెచ్చుకున్నారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రారంభించడానికి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి వచ్చారు. నిరసన తెలుపుతున్న రైతులను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పురుగుల మందు డబ్బాలను లాగేసుకున్నారు. రైతులు మంత్రిని కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, రైతులకు తోపులాట జరిగింది. రైతులను పోలీసులు అరెస్టు చేసి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు, చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఖాళీ బాటిళ్లతో బోట్ తయారీ



చెరువులో బాటిళ్లతో తయారీ చేసిన బోట్

హుస్నాబాద్: మున్సిపల్ కార్మికుల ఆలోచనలు...వినూత్న ఆవిష్కరణకు బాటలు వేశాయి. 'వేస్ట్ టు ఇన్నోవేషన్'కాన్సెప్ట్‌తో సరికొత్త ఆలోచనలకు రూపమిచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో పడవను తయారు చేశారు. ఈ పడవను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత చేతుల మీదుగా ప్రారంభించి, ఎల్లమ్మ చెరువులో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు.

తునికాకు సేకరణదారులకు బోనస్ చెల్లింపులు షురూ!

సాక్షి, హైదరాబాద్/ దహెగాం/చింతలమానెపల్లి: తునికాకు విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని తిరిగి తునికాకు సేకరణదారులకే చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తునికాకు సేకరించే కూలీలకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో సేకరణ చార్జీలతో పాటు రెవెన్యూ నెట్ షేర్(బోనస్)ను కూడా చెల్లిస్తోంది. ఏజెన్సీ గ్రామాలకు తునికాకు సేకరణ ఉపాధి వనరుగా ఉన్న విషయం తెలిసిందే. సోమవారం సిర్పూర్ నియోజవర్గంలోని కర్జెల్లి అటవీ రేంజ్ చింతలమానేపల్లిలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. బీడీ ఆకుల సేకరణ ధరను కట్టకు రూ.2.05 పైసల నుంచి రూ.3కు పెంచిన ఈ సీజన్ నుంచి వర్తింపజేస్తున్నారు. ఈ సీజన్‌లో 2.27 లక్షల స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించి విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించారు. మే నెలాఖరుకల్లా దీనిని పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. 2023 తునికాకు సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో 225 యూనిట్లలో తునికాకును అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ విక్రయించనుంది.

క్లుప్తంగా...

ప్రశ్నపత్రాల లీకేజీ వార్తలను నమ్మొద్దు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: 10, 12వ తరగతి బోర్డ్ పరీక్ష పత్రాలు లీకయ్యాయంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులను కోరింది. ఈ పుకార్లకు కారకులని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పేపర్ లీకైందని, 2023 పరీక్షా పత్రాలు అందుబాటులో ఉన్నాయంటూ యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీబీఎస్ఈ సభ్యుడొకరు తెలిపారు. 'ఇలాంటి పుకార్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజేందుకు కొందరు వ్యక్తులు, సమూహాలు, సంస్థలు పథకం వేస్తున్నాయి. బాధ్యతారాహిత్య చర్యలు, అయోమయం, భయాందోళనలకు పురిగొల్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి'అని పేర్కొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా ఖుష్బూ


న్యూఢిల్లీ: ప్రముఖ సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ సుందర్(52) జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలిగా నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలైన ఆమె సోమవారం ఈ మేరకు ట్వీట్ చేశారు. ఆమెతో పాటు మేఘాలయకు చెందిన డెలినా ఖోంగ్‌డుప్, జార్ఖండ్‌వాసి మమతా కుమారి కూడా ఎన్‌సీడబ్ల్యూకు నామినేట్ అయ్యారు. సినీ నటి, నిర్మాత అయిన ఖుష్బూ తొలుత డీఎంకేలో, తర్వాత కాంగ్రెస్‌లో కొనసాగారు. బీజేపీలో చేరి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.



నీట్-పీజీ వాయిదా పిటిషన్లు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: నీట్-పీజీ 2023ను వాయిదా వేయాలన్న పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రిపేరయ్యేందుకు చాలినంత సమయం లేనందున వాయిదా వేయాలని ఇంటర్న్‌షిప్ గడువు ముగియనందున కౌన్సిలింగ్ ఆగస్టు 11వ తేదీ తర్వాత చేపట్టాలని పిటిషన్లు కోరారు. దీనిపై సోమవారం జస్టిస్ ఎస్ఆర్ భట్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారణ చేపట్టింది. పరీక్ష తేదీ మార్పుకు ఈ దశలో అవకాశం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి చెప్పారు. ''తప్పో, ఒప్పో. పరిణామక్రమంలో ఇదంతా ఒక భాగం. ఇది కొన్నిసార్లు కరెక్టు, కొన్నిసార్లు తప్పు కావొచ్చు. మీరెలా అనుకుంటే అలా! పరీక్షను మరోసారి రాయాలనుకునే విద్యార్థిని ఈ ప్రపంచంలో ఏశక్తీ అడ్డుకోజాలదు' అని పేర్కొంటూ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది.

అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి!



ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం రెండో ఏడాదిలోకి చొరబడింది. దురాక్రమణ ప్రయత్నాలు జోరుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏడాది మారణహోమం తర్వాత కూడా వ్లాదిమిర్ వ్లాదిమిరోవిచ్ పుతిన్ రాజ్యకాంక్ష ఏమాత్రం చల్లారలేదు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా ఉక్రెయిన్‌పై ఉరుకులు పరుగుల మీద విరుచుకుపడ్డ రష్యాకు, తన అస్త్రాలేవీ పనికిరాకుండా పోయాయని జ్ఞానోదయం కలగడానికి ఎంతోసేపు పట్టలేదు. బాహుబలిగా కాలుదువ్విన పుతిన్ ఏడాది తిరిగేసరికి ప్రపంచం దృష్టిలో విలన్ అయ్యారు. సొంత ప్రజల దృష్టిలోనూ బాహుబలి హోదాను ఒకింత కోల్పోయారు. ఇంతకీ పుతిన్ ఊహించినదేమిటి? ఆయనకు ఎదురైందేమిటి...?

ఎస్ రాజమహేంద్రారెడ్డి

పూర్వపు సోవియట్ యూనియన్ రిపబ్లిక్కులన్నింటినీ మళ్లీ ఒకే తాటిమీదకు తేవాలన్నది తన లక్ష్యమని పుతిన్ చెప్పుకుంటారు. పొరుగు దేశాలైన ఉక్రెయిన్, బెలారస్ కూడా ఒకప్పుడు రష్యాలో అంతర్భాగమేనని అంటారాయన. రెండేళ్ల క్రితం ఆయన రాసిన ఓ సుదీర్ఘ వ్యాసంలో కూడా ఈ విషయాన్ని సుస్పష్టం చేశారు. బెలారస్‌తో రష్యాకు ఎలాంటి విభేదాలూ లేవు. పైగా ఉక్రెయిన్‌పై దాడిలో రష్యాకు ఆదినుంచీ అది వెన్నుదన్నుగా ఉంది. రష్యా తొలుత ఉక్రెయిన్‌లో చొరబడేందుకు తన భూభాగాన్ని అనుమతించింది కూడా. ఎటొచ్చీ పుతిన్‌కు పేచీ అల్లా ఉక్రెయిన్‌తోనే! ఆ దేశ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి కూడా రష్యా ఎన్నడూ ఇష్టపడలేదు. రష్యా, ఉక్రెయిన్ ఒకే దేశమన్నదే పుతిన్ గట్టి నమ్మకం.

లోగుట్టు వేరే

నిగూఢంగా చూస్తే మాత్రం, ఈ గొడవంతా పైపై పటారమే. అసలు విషయం ఏమిటంటే సుదీర్ఘ కాలం పాటు రష్యాకు తిరుగులేని నాయకునిగా వెలిగిపోవాలన్నది పుతిన్‌లో అంతర్లీనంగా ఉన్న ఆశగా చెప్తారు. మూడేళ్ల క్రితం ఆయన ఆ దిశగా ప్రయత్నం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణతో రాజ్యాంగాన్ని మార్చి అధ్యక్షునిగా 16 ఏళ్లపాటు నిరాటంకంగా కొనసాగేలా కొత్త చట్టం తెచ్చేందుకు క్రెమ్లిన్ ప్రయత్నించింది. ఆ సమయంలో రష్యా టీవీ పుతిన్ కీర్తనలు, గుణగానాలతో హోరెత్తేది. 'కల్లోల సాగరంలాంటి ప్రపంచంలో రష్యా నౌకను సమర్థంగా నడిపిస్తున్న కెప్టెన్ పుతిన్' అంటూ ఊదరగొట్టేవారు. క్రెమ్లిన్ దృష్టిలో పుతిన్ సకల కళావల్లభుడు, సకలశాస్త్ర పారంగతుడు. అందుకే జూడో, రేసింగ్, స్విమ్మింగ్, హార్స్ రైడింగ్ విన్యాసాల్లో పుతిన్ సాహసకృత్యాల తాలూకు ఫొటోలను తరచూ ప్రపంచం ముందుకు తెస్తూంటుంది క్రెమ్లిన్. రష్యా ప్రజలను ప్రభావితం చేసి పుతిన్ పట్ల ఆరాధనా భావాన్ని పెంపొందించే ప్రయత్నాల్లో క్రెమ్లిన్ ఎంచుకున్న మార్గమిది. అసలు విషయమేమిటంటే 2024లో రష్యా అధ్యక్ష ఎన్నికలున్నాయి. ఆలోపు ఏదో ఒక ఘనకార్యం చేసి పుతిన్ కీర్తిని అమాంతం పెంచేయడం క్రెమ్లిన్ లక్ష్యం. పశ్చిమ దేశాల కనుసన్నల్లో సాగుతున్న ఉక్రెయిన్‌ను ఓ దారికి తెస్తే బాహుబలి పుతిన్ సత్తా ఏమిటో తెలుస్తుందని, అధ్యక్ష ఎన్నికల్లో మంచి ప్రచారాస్త్రంగా మారుతుందని క్రెమ్లిన్ థింక్‌టాంక్ అంచనా. అనుకున్నదే తడవుగా దాడికి దిగడం, ఆరంభంలో కొన్ని ప్రాంతాను ఆక్రమించి ఎగిరి గంతెయ్యడం... తర్వాత ఉక్రెయిన్‌ధాటికి తట్టుకోలేక వాటిని వదిలేసి తోకముడవడం చకచకా జరిగిపోయాయి. అయినా సరే, ఇప్పటికీ ఉక్రెయిన్‌పై దాడిని తప్పుగా పుతిన్ అంగీకరించడం లేదు. రెండు మూడు రోజుల క్రితం మాట్లాడుతూ ఇదంతా పశ్చిమ దేశాల కుట్రేనని సెలవిచ్చారు! దానికి జవాబుగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఏకంగా ఉక్రెయిన్ యుద్ధభూమిలో అడుగుపెట్టారు! ఈ పోరులో తమ వైఖరిని మరోసారి కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌ను గెలవడం రష్యా తరం కాదని అక్కడే మీడియాముఖంగా ప్రకటించేశారు. బహుశా పుతిన్ కూడా ఇలాంటి సవాలు కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు! ఏదోలా వచ్చే ఏడాది రష్యా అధ్యక్ష ఎన్నికల దాకా యుద్ధం కొనసాగాలన్నదే ఆయన అభిమతమని పరిశీలకుల అంచనా. యుద్ధం సమాధుల మీద 2024 అధ్యక్ష ఎన్నికలను నెగ్గాలని పుతిన్ భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఆపద్ధర్మ పాత్రతో మొదలై...

1999లో బోరిస్ యెల్సిన్ ఆకస్మిక రాజీనామాతో ఆపద్ధర్మ అధ్యక్షునిగా తొలిసారి గద్దెనెక్కిన పుతిన్ 2000-2004, 2004-08ల్లో రెండు దఫాలుగా అధ్యక్షునిగా కొనసాగారు. అప్పట్లో రష్యా అధ్యక్ష పదవీకాలం నాలుగేళ్లే. తర్వాత 2008 నుంచి 2012 దాకా ఆయన ప్రధానిగా ఉన్నారు. ఈ దశలో రాజ్యాంగ సవరణల ద్వారా అధ్యక్ష పదవీకాలాన్ని ఆరేళ్లకు పెంచారు. తర్వాత 2012 నుంచి 2018 దాకా, 2018 నుంచి ఇప్పటిదాకా పుతిన్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. 2024 మార్చితో పదవీకాలం ముగుస్తుంది. ఒక వ్యక్తి వరుసగా రెండుసార్లకు మించి అధ్యక్షునిగా ఉండరాదన్న నిబంధనను కూడా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చారు. ఫలితంగా 2024తో పాటు 2030 ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం పుతిన్‌కు సంక్రమించింది. ఈ రెండుసార్లూ గెలిస్తే 2036 దాకా ఆయనే రష్యా అధినేతగా చక్రం తిప్పుతారు. అలా ఒకే దెబ్బకు రెండు పిట్టల్లా ఒకే యుద్ధంతో అటు రాజ్యకాంక్షను, ఇటు పదవీకాంక్షనూ నెరవేర్చుకోవాలని పుతిన్ పట్టుదలగా ఉన్నారు. అందుకే యుద్ధానికి ఇప్పుడప్పట్లో ముగింపు పలికేందుకు ససేమిరా అంటున్నారు. యుద్ధంలో వెనకబడుతున్నట్టు అన్పించినప్పుడల్లా అణ్వాయుధ బూచితో ప్రపంచాన్ని బెదిరిస్తున్నారు. అటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా అమెరికా మద్దతుతో లొంగేది లేదంటూ దీటుగా తలపడుతున్నారు. చివరికి గెలుపెవరిదైనా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం మాత్రం వైరి వర్గాలు రెండింటినీ వెంటాడుతూనే ఉంటాయి. చరిత్ర చెక్కిలిపై యుద్ధం ఎప్పుడూ ఓ కన్నీటి బిందువే! చెరిగిపోని మచ్చే!!

పుతిన్‌కు శిరోభారంగా యుద్ధం

- వికటిస్తున్న దుస్సాహసం
- ఇమేజీకి ఇంటాబయటా డ్యామేజీ
- అధ్యక్ష ఎన్నికల్లో విజయంపై కన్ను
- యుద్ధాన్ని అప్పటిదాకా సాగదీసే యత్నం

కొసమెరుపు

ఏడాది యుద్ధం బాహుబలిగా వ్లాదిమిర్ పుతిన్‌కున్న పేరుప్రతిష్టలను బలి తీసుకుంటే, పూర్వాశ్రమంలో సినిమాల్లో కమేడియన్ పాత్రలు పోషించిన వొలోదిమిర్ జెలెన్‌స్కీని మాత్రం నిజజీవితంలో హీరోను చేసింది!

సిసోడియాకు 5 రోజుల సీబీఐ కస్టడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ ఐదు రోజులపాటు కస్టడీకి తీసుకుంది. ఆదివారం ఎనిమిదిగంటలపాటు ప్రశ్నించాక ఆయనను అరెస్టు చేయడం తెలిసిందే. సోమవారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచింది. 'మద్యం విధానాలు, అమలులో సిసోడియా స్వయంగా నిర్ణయాలు తీసుకున్నట్లు సాక్ష్యాలున్నాయి. కానీ ఆయన పూర్తి విరుద్ధమైన, దాటవేసే ధోరణిలో సమాధానాలు చెప్తున్నారు. దర్యాప్తు సాగాలంటే ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సి ఉంది. అందుకు అనుమతించండి' అని సీబీఐ న్యాయవాదులు కోరారు. సిసోడియా తరఫు లాయర్లు దీన్ని వ్యతిరేకించారు. 'ఇది కక్షపూరిత కేసు. సిసోడియాకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేవు. మద్యం విధానంలో లెఫ్టినెంట్ గవర్నర్ మార్పులుచేస్తే ఆప్ ప్రభుత్వంపై సీబీఐ దృష్టిపెట్టింది'' అని వాదించారు. తర్వాత సిసోడియాను ఐదు రోజుల సీబీఐ కస్టడీకిస్తూ జడ్జి నాగ్‌పాల్ ఉత్తర్వులు జారీచేశారు.

ఢిల్లీసహా పలు రాష్ట్రాల్లో ఆప్ నిరసనల సెగ

సిసోడియా అరెస్టుపై ఆప్ శ్రేణులు పలు రాష్ట్రాల్లో ఆందోళనలకు దిగాయి. ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్, బిహార్, గోవాల్లో కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. కేంద్రం దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. చండీగఢ్‌లో మంత్రి హర్పాల్ సింగ్ చీమా, మరో మంత్రిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టు సీబీఐ అధికారులకే ఇష్టం లేదు: కేజ్రీవాల్

సిసోడియాను అరెస్ట్‌చేయడం సీబీఐలోనే చాలా మంది అధికారులకు ఇష్టం లేదని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. అరెస్టును కేరళ, జార్ఖండ్ సీఎంలు పినరయి విజయన్, హేమంత్ సొరెన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తదితరులు తప్పుబట్టారు. ఆప్‌వి వీధి రాజకీయాలని బీజేపీ ఆరోపించింది.

అతి సమీపానికి గురుశుక్రులు


న్యూయార్క్: గురు, శుక్ర గ్రహాలు పరస్పరం అత్యంత సమీపానికి రానున్నాయి. ఈ అరుదైన ఘటన మార్చి 1వ తేదీన కనువిందు చేయనుంది. ఆ రాత్రి భూమి నుంచి చూస్తే అవి రెండూ దాదాపు ఒకదాన్నొకటి ఆనుకున్నంత దగ్గరగా కన్పిస్తాయి! నిజానికవి ఎప్పట్లాగే పరస్పరం కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయి. కాకపోతే సూర్యుని చుట్టూ వాటి పరిభ్రమణ క్రమంలో భాగంగా భూమి నుంచి చూసేవాళ్లకు మాత్రం ఆ రోజు పరస్పరం అత్యంత దగ్గరగా వచ్చినట్టు కన్పిస్తాయన్నమాట. దీన్ని మామూలు కళ్లతోనే చూడొచ్చు. సౌరమండలంలో సూర్యచంద్రుల తర్వాత అత్యంత ప్రకాశవంతమైనది శుక్రుడే. భూమికి అత్యంత సమీపంలో ఉండటంతో అప్పుడప్పుడూ పగటి పూటా కనిపిస్తుంటుంది!



3,500 ఏళ్ల నాటి ఎలుగు కళేబరం...

చెక్కుచెదరని స్థితిలో దొరికింది!

మాస్కో: దాదాపుగా 3,500 ఏళ్ల నాటి ఎలుగుబంటి కళేబరం ఏమాత్రం చెక్కుచెదరని స్థితిలో దొరికి సైంటిస్టులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేసింది. అది పూర్తిగా అతిశీతల వాతావరణంలో మంచులో కూరుకుపోవడమే ఇందుకు కారణం. రష్యాలో మాస్కోకు 4,600 కిలోమీటర్ల దూరంలో న్యూ సైబీరియన్ ఆర్చిపెలాగోలో భాగమైన బొల్షోయ్ ల్యాక్షోవ్‌స్కీ ద్వీపంలో జింకల వేటగాళ్లు దీన్ని 2020లో గుర్తించారు. ''అది ఆడ ఎలుగుబంటి. గోధుమ రంగుతో, 1.55 మీటర్ల ఎత్తు, దాదాపు 78 కిలోల బరువుంది. చనిపోయేనాటికి బహుశా మూడేళ్ల వయసుంటుంది'' అని తూర్పు సైబీరియాలోని లజరేవ్ మామూత్ మ్యూజియం లేబొరేటరీ చీఫ్ మాక్సిం చెప్రసోవ్ అంచనా వేశారు. ఆయన సారథ్యంలోని సైంటిస్టుల బృందం దానికి శవపరీక్ష జరిపింది. ''దాని ఒంట్లోని అతి మృదువైన కణజాలం కూడా గులాబి రంగులో ఇప్పటికీ ఏమాత్రం పాడవకుండా ఉండటం నిజంగా అద్భుతం. అలాగే పసుపు రంగులోని కొవ్వు కూడా. అంతేగాక దాని చివరి తిండి తాలూకు పక్షి ఈకలు, మొక్కలు కూడా పొట్టలో అలాగే ఉన్నాయి. అంత పురాతన కాలపు జంతువు తాలూకు కళేబరం ఇంత చక్కని స్థితిలో పరిపూర్ణంగా దొరకడం ఇదే తొలిసారి'' అని పేర్కొంది. దాని మెదడు, అంతర్గత అవయవాలను కోసి లోతుగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా కణజాల, సూక్ష్మజీవ, జన్యుపరమైన పరీక్షల్లో తలమునకలుగా ఉన్నారట.



అందరికీ విమానయోగం

త్వరలో స్వదేశీ విమానాలు: మోదీ ● బెల్గావీలో భారీ రోడ్ షో



బెల్గావీలో ర్యాలీలో మద్దతుదారులకు మోదీ అభివాదం

శివమొగ్గ/బెల్గావీ: ''హవాయి చెప్పులేసుకునే సామాన్యులు కూడా హవాయీ జహాజ్ (విమాన) ప్రయాణం చేయగలగాలి. ఆ కల ఇప్పుడు నిజమవుతోంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆయన సోమవారం కర్నాటకలోని శివమొగ్గలో నూతన విమానాశ్రయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. భారత వైమానిక రంగం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ''మున్ముందు మనకు వేలాది విమానాలు అవసరమవుతాయి. వాటిని ప్రస్తుతానికి దిగుమతి చేసుకుంటున్నా భారత్‌లోనే తయారు చేసే రోజు ఎంతో దూరంలో లేదు. అప్పుడు మనమంతా దర్జాగా మేడిన్ ఇండియా విమానాల్లోనే ప్రయాణిస్తాం'' అని చెప్పుకొచ్చారు. చిన్న నగరాలు, పట్టణాల్లోనూ విమానాశ్రయాల నిర్మాణంతో బీజేపీ ప్రభుత్వం విమానయానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిందని మోదీ చెప్పారు. 2014 దాకా దేశంలో మొత్తం 74 విమానాశ్రయాలుంటే గత తొమ్మిదేళ్లలోనే తాము మరో 74 కొత్త విమానాశ్రయాలు నిర్మించామన్నారు. కాంగ్రెస్ పాలనపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. ''2014కు ముందు ఎయిరిండియాను నష్టాలు, కుంభకోణాల సంస్థగా చూసే పరిస్థితి ఉండేది. నేడు అలాంటి సంస్థ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. నూతన భారతదేశానికి ప్రతీకగా విజయపుటంచులు చూస్తోంది'' అన్నారు. రూ.3,600 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. శివమొగ్గ జిల్లాకే చెందిన కర్నాటక మాజీ సీఎం, బీజేపీ అగ్ర నేత బి.ఎస్.యడియూరప్ప సోమవారం 80వ పుట్టినరోజు జరుపుకున్నారు. దాంతో సభికులంతా మొబైల్ ఫ్లాష్ లైట్లు ఆన్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలపాల్సిందిగా మోదీ కోరారు. ఆయన జీవితమంతా ప్రజా సేవకు అంకితం చేశారని, రాజకీయ నాయకులందరికీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. డబుల్ ఇంజన్ సర్కారుకే మరో అవకాశమివ్వాలని కర్నాటక ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారన్నారు. అనంతరం బెల్గావీలో మోదీ భారీ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు కారులో నుంచుని అభివాదం చేస్తూ సాగారు. అభివృద్ధి చేసిన బెల్గావీ రైల్వేస్టేషన్ భవనాన్ని, రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. 8 కోట్ల మంది రైతులకు ప్రధాన్‌మంత్రీ కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకంలో 13వ విడతగా రూ.16 వేల కోట్ల నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో విడుదల చేశారు. సీఎం బసవరాజ్ బొమ్మైతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేపాల్ ప్రభుత్వంలో కుదుపు

కాఠ్మాండు: వచ్చే నెలలో జరగబోయే నేపాల్ అధ్యక్ష ఎన్నికల్లో అధికార కూటమి పార్టీ సీపీఎన్-యూఎంఎల్ బలపరిచిన అభ్యర్థినికాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధాని ప్రచండ మద్దతు పలకడం సీపీఎన్-యూఎంఎల్‌కు ఆగ్రహం తెప్పించింది. దీంతో ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ఆ పార్టీ సోమవారం ప్రకటించింది. ఆ పార్టీకి చెందిన నేతలైన ఉపప్రధాని, ఆర్థికమంత్రి బిష్ణు పౌద్యాల్, విదేశాంగ మంత్రి తమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించారు. దీంతో రెండు నెలల క్రితమే ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం కూలే అవకాశాలు ఎక్కువయ్యాయి. విపక్ష నేపాలీ కాంగ్రెస్ పార్టీకి చెందిన రామచంద్ర పౌద్యాల్‌కు గత శనివారం ఎనిమిది రాజకీయ పార్టీలు సమ్మతి తెలపడం, అధికారకూటమిలోని నేషనల్ డెమొక్రటిక్ పార్టీ.. ప్రభుత్వం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం, ఉపప్రధాని పదవికి రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లింగ్డెన్ రాజీనామాచేయడం తెల్సిందే. సీపీఎం-యూఎంఎల్ మద్దతులేకున్నా పార్లమెంట్‌లో 89 మంది సభ్యులున్న నేషనల్ కాంగ్రెస్ పార్టీతో విశ్వాసతీర్మానాన్ని ప్రచండ సర్కార్ గట్టెక్కే వీలుంది. గత డిసెంబర్‌లో 7 పార్టీల కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అధికార కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే ప్రధాని ప్రచండ నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో విశ్వాసపరీక్షలో నెగ్గాలి.

నాగాలాండ్, త్రిపురల్లో బీజేపీ

మేఘాలయలో హంగ్ ● పెద్ద పార్టీగా ఎన్‌పీపీ ● ఎగ్జిట్ పోల్స్ అంచనా

న్యూఢిల్లీ: ఈశాన్యాన మళ్లీ కమల వికాసమేనని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. తాజాగా ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో నాగాలాండ్, త్రిపురల్లో మళ్లీ బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని, మేఘాలయలో హంగ్ తప్పదని జోస్యం చెప్పాయి. అక్కడ అధికార ఎన్‌పీపీ మరోసారి ఏకైక పెద్ద పార్టీగా నిలుస్తుందని చెప్పాయి. త్రిపురలో ఎన్నో ఆశలతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను కొత్త పార్టీ టిప్రా మోర్చా గట్టి దెబ్బ కొట్టనుంది. అధికార బీజేపీ జైత్రయాత్రకూ అది కాస్త అడ్డుకట్ట వేసిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో సోమవారం పోలింగ్ పూర్తయింది.

నాగాలాండ్‌లో 83%, మేఘాలయలో 75% ఓటింగ్

షిల్లాంగ్/కోహిమా: నాగాలాండ్‌లో ఓటర్లు పోటెత్తారు. దాంతో సోమవారం జరిగిన పోలింగ్‌లో మధ్యాహ్నం మూడింటికే 83.63% ఓటింగ్ నమోదైంది! ఇక మేఘాలయలో సాయంత్రం ఐదింటికల్లా 75% ఓటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా క్యూలు ఉండటంతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటింగ్ శాతం మరింత పెరగనుంది. రెండు అసెంబ్లీల్లోనూ 60 స్థానాలకు గాను 59 సీట్లకు పోలింగ్ జరిగింది. కొన్ని బూత్‌ల్లో ఈవీఎంలతో సమస్య తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కరించారు.



మేఘాలయలోని రిభోయ్ జిల్లాలో ఓటేసిన మహిళలు

మేఘాలయ ◇ రాష్ట్రంలో ఈసారి హంగ్ తప్పకపోవచ్చని అన్ని ఎగ్జిట్ పోల్సూ చెప్పడం విశేషం! అధికార ఎన్‌పీపీకి 18 నుంచి 26 సీట్లకు మించకపోవచ్చని అవి పేర్కొన్నాయి. ఇక బీజేపీకి దక్కుతున్నది 4 నుంచి గరిష్ఠంగా 11 స్థానాలే. కాంగ్రెస్‌దీ అదే పరిస్థితి కాగా తృణమూల్‌కు మాత్రం ఎగ్జిట్ పోల్స్ 5 నుంచి 13 స్థానాల దాకా ఇచ్చాయి. యూడీపీకి ఇండియాటుడే, టైమ్స్ నౌ రెండూ 8 నుంచి 14 సీట్లిచ్చాయి.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్ నౌ	జీ న్యూస్
ఎన్‌పీపీ	18-24	18-26	21-26
కాంగ్రెస్	6-12	2-5	3-6
బీజేపీ	4-8	3-6	6-11
టీఎంసీ	5-9	8-14	8-13
యూడీపీ	8-12	8-14	--
ఇతరులు	4-8	0-2	10-19

నాగాలాండ్ ◇ రాష్ట్రంలో ఎన్‌డీపీపీ-బీజేపీ కూటమి అధికారాన్ని నిలుపుకోనుందని ఎగ్జిట్ పోల్స్ ముక్త కంఠంతో పేర్కొన్నాయి. ఎన్‌డీపీపీకి 28-34 సీట్లు, బీజేపీకి 10 నుంచి 14 వస్తాయని ఇండియాటుడే అంచనా వేసింది. ఎన్‌పీఎఫ్‌కు 3 నుంచి 8 సీట్లు వస్తుండగా కాంగ్రెస్ 2 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. టైమ్స్ నౌ కూడా ఎన్‌డీపీపీకి 27-33 సీట్లు, బీజేపీకి 12-16 ఇవ్వగా ఎన్‌పీఎఫ్‌కు 6 సీట్లతో సరిపెట్టింది.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్ నౌ	జీ న్యూస్
బీజేపీ కూటమి	38-48	39-49	35-43
ఎన్‌పీఎఫ్	3-8	4-8	2-5
కాంగ్రెస్	1-2	0	1-3
ఇతరులు	5-15	9	6-12

త్రిపుర ◇ పాతికేళ్ల సీపీఎం కూటమి జైత్రయాత్రకు అడ్డుకట్ట వేస్తూ 2018లో బీజేపీ ఏకంగా 36 సీట్లతో మెజారిటీ సాధించి ఆశ్చర్యపరిచింది. దాంతో ఈసారి బీజేపీని ఎలాగైనా అడ్డుకునేందుకు సీపీఎం కూటమి తన చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. కానీ వాటి అవకాశాలకు కొత్తగా వచ్చిన టిప్రా మోతా భారీగా గండి కొట్టనుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. మోతా 9 నుంచి 16 సీట్లు దాకా గెలుచుకుంటుందని అంచనా వేశాయి. బీజేపీ మళ్లీ మెజారిటీ సాధిస్తుందని ఇండియాటుడే, జీ న్యూస్ అభిప్రాయపడగా 24 సీట్లకు పరిమితం కావచ్చని టైమ్స్ నౌ పేర్కొంది. కాంగ్రెస్-సీపీఎం కూటమికి ఏ ఎగ్జిట్ పోల్‌లోనూ గరిష్ఠంగా 21 సీట్లు దాటలేదు. బీజేపీకి 45 శాతం ఓట్లు రావచ్చని ఇండియాటుడే అంచనా వేసింది. లెఫ్ట్-కాంగ్రెస్ కూటమికి 32 శాతం, టిప్రా మోతాకు 20 శాతం వస్తాయని పేర్కొంది. హంగ్ నెలకొనే పక్షంలో ప్రత్యేక టిప్రా లాండ్ డిమాండ్‌కు జైకొట్టే పార్టీకే మద్దతిస్తామని టిప్రా మోతా అధ్యక్షుడు ప్రద్యోత్ కిశోర్ మాణిక్య దేవ్ బర్మ ఇప్పటికే ప్రకటించారు.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్ నౌ	జీ న్యూస్
బీజేపీ కూటమి	36-45	24	29-36
కాంగ్రెస్-లెఫ్ట్	6-11	21	13-21
టిప్రా మోతా	9-16	14	11-16
ఇతరులు	0	1	0-3

దేశం కోసమే అగ్నిపథ్: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సైనిక దళాల్లో నియామకాల కోసం కేంద్రం తెచ్చిన అగ్నిపథ్ పథకాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. జాతీయ ప్రయోజనాల కోసం, జాతి భద్రత అనే ఉన్నతమైన ఆశయం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పథకమని పేర్కొంది. అన్ని కోణాల్లోనూ యోచించి తీసుకున్న ఇటువంటి విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ సుబ్రమణియమ్‌ల ధర్మాసనం తెలిపింది. అగ్నిపథ్ పథకాన్ని, నియామక ప్రక్రియకు అర్హులు కారంటూ కొందరిని మినహాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా ధర్మాసనం కొట్టివేసింది. అటువంటి వారికి సైన్యం చేరేందుకు అర్హత లేదని ధర్మాసనం పేర్కొంది. ఒకే రకమైన విధులు చేపట్టే 'అగ్నివీర్'లు, సిపాయిలకు మధ్య వేర్వేరు వేతన స్కేళ్లు ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించింది. 'ఆర్మీలో చేరికలు స్వచ్ఛంగానే జరుగుతాయి. ఇందులో ఎటువంటి బలవంతం లేదు. దీనివల్ల హక్కులకు ఎలా భంగం కలుగుతోంది?' అని పిటిషనర్లను ధర్మాసనం అడిగింది.

'ఈడీ చీఫ్ పొడిగింపు'పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని కేంద్రం మూడు విడతలుగా పొడిగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మార్చి 21న విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ నేతలు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, జయా ఠాకూర్, టీఎంసీ నేత మహువా మొయిత్రా వేసిన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు డిసెంబర్‌లో కేంద్రం, ఈడీ, సీవీసీలకు నోటీసులు జారీ చేసింది. దీనిపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది.

పడవ మునక ఘటనలో 62కు చేరిన మృతులు

రోమ్: ఇటలీలోని కలబ్రియన్ తీరంలో వలసదారుల పడవ మునక ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 62కు చేరుకుంది. సుమారు 170 మంది వలసదారులతో తుర్కియేలోని ఇజ్మిర్ తీరం నుంచి అయోనియన్ సముద్ర జలాల్లో ప్రవేశించిన చెక్క పడవ అలల తాకిడికి ముక్కలు చెక్కలైంది. ఇటలీ తీర రక్షణ బృందాలు గమనించి అందులోని సుమారు 80 మందిని కాపాడాయి. సోమవారం వరకు 62 మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. మిగతా వారి జాడ కోసం గాలింపు కొనసాగుతోంది.

మొండి బకాయి రాబట్టింది!

చాట్‌జీపీటీ మరో ఘనత

వాషింగ్టన్: కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చాక ఎన్నో పనులు అత్యంత వేగంగా, ఖచ్చితత్వంతో జరిగిపోతున్నాయి. చాట్‌బాట్‌లలో దూసుకుపోతున్న చాట్‌జీపీటీ కొత్త మరో ఘనత సాధించింది. ఒక డిజైనింగ్ సంస్థకు క్లయింట్ నుంచి రావాల్సిన దాదాపు రూ.90లక్షల(1,09,500 డాలర్లు) మొండి బకాయిని రాబట్టింది. అమెరికాకు చెందిన ఒక డిజైనింగ్ సంస్థకు సీఈవో అయిన గ్రెన్ ఐసన్‌బర్గ్ అనే వ్యక్తి తనకు చాట్‌జీపీటీ ఎలా సాయపడిందనే విషయాన్ని సంతోషంతో ట్విట్టర్‌లో షేర్‌చేశారు. '' గత ఏడాది ఒక ప్రముఖ బ్రాండ్‌కు డిజైన్లు చేసి ఇచ్చాం. అవి వారికి నచ్చాయి. అంతా సవ్యంగా సాగుతోందనే సమయానికి హఠాత్తుగా అటు నుంచి సంప్రదింపులు ఆగిపోయాయి. ఏం జరిగిందని కనుక్కుందామని సమాధానం లేదు. చేసిన డిజైనింగ్ పనికి డబ్బులు అడిగితే రిప్లై లేదు. ఐదుసార్లు మెయిల్ పెట్టినా ఇలుకూపలుకూ లేదు. ఐదు నెలలు గడిచిపోయాయి. 'ఇక లాభం లేదు. లాయర్ల ద్వారా చట్టప్రకారం ముందుకెళ్దాం' అని నా కింది ఉద్యోగులు నాకు సలహా ఇచ్చారు. చాట్‌బాట్‌ల హవా కొనసాగుతోంది. ఒకసారి చాట్‌జీపీటీతో ప్రయత్నిద్దామని నిర్ణయించుకుని వివరాలను పొందుపరిచా. క్లయింట్‌ను బెదిరిస్తూనే చక్కని దౌత్యం నెరిపేలా ఒక మెయిల్‌ను సిద్ధంచేసి ఇచ్చింది. దానికి చిన్నపాటి నా సొంత మార్పులు చేసి క్లయింట్‌కు పంపించాను. అద్భుతం. కేవలం రెండు నిమిషాల్లోనే అటు నుంచి స్పందన వచ్చింది. 'బాకీ పడిన సొమ్మును చెల్లిస్తున్నాం. చూసుకోండి'' అంటూ సమాధానమొచ్చింది. నా డబ్బొచ్చింది'' అని ట్విట్టర్‌లో ఐసన్‌బర్గ్ తెగ సంబరపడ్డాడు. భవిష్యత్తులో సంస్థల వ్యాపార లావాదేవీలు ఇలా ఆటోమేషన్ అవుతాయని అభిప్రాయపడ్డాడు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



రాజన్నకు జనజాతర

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



అక్రమ వ్యాపారంపై కొరడా

తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కె.విజయసారథి కొరడా ఝుళిపించారు. సోమవారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారుజామున ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షల్లో గందరగోళం

- అల్గునూర్ పాఠశాలలో సిబ్బంది తప్పిదం



హాల్ టికెట్ నంబర్లు సరిచేస్తున్న సిబ్బంది

మానకొండూర్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా.. అల్గునూర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో మొదటి రోజే గందరగోళం నెలకొంది. సిబ్బంది విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లు, రూం నంబర్లు తప్పుగా ప్రింట్‌చేసి గోడపై అతికించారు. వాటిని చూసుకొని గదులకు వెళ్లిన విద్యార్థులు అందులో హాల్‌టికెట్ నంబర్ లేకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. విద్యార్థుల వెంట వెళ్లిన తల్లిదండ్రులు ఏం జరిగిందని ఆరా తీయగా.. హాల్‌టికెట్, రూం నంబర్లు తప్పుగా ముద్రించారని తెలిపారు. దీంతో సిబ్బందితో గొడవకు దిగారు. సిబ్బంది పొరపాటును అంగీకరించి హాల్‌టికెట్, రూం నంబర్లు సరిచేసి మళ్లీ ముద్రించి గోడపై అంటించడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రాధాన్యతతో ప్రజా సమస్యల పరిష్కారం



ప్రజావాణిలో అర్జీదారులు

కరీంనగర్ అర్బన్: ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలను అందించగా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపారు. 202 అర్జీలు రాగా కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 24, కొత్తపల్లి తహసీల్దార్ 21, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ 13, కరీంనగర్ ఆర్డీవోకు 10, ఇతర శాఖలకు ఫిర్యాదులు రాగా ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, శిక్షణ కలెక్టర్ లెనిన్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్

కరీంనగర్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–2,3,4, ఇతర ఉద్యోగాల సాధనకు అభ్యర్థులకు స్పెషల్ ఫౌండేషన్ కోర్సును సోమవారం ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమయం వృథా చేయకుండా శిక్షణ తరగతులను వినియోగించుకొని పట్టుదలతో లక్ష్యాన్ని సాధించుకోవాలని సూచించారు. ఈ కోర్సులో చేరినవారికి అటెండెన్స్ ప్రకారం ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.75, స్టడీ మెటీరియల్‌కు రూ.1,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. కోర్సు కాలపరిమితి 90 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (ఎస్సీ డీడీ) పుల్లా నతానియల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న డీఈవో

కరీంనగర్‌రూరల్: మండలంలోని నగునూరు జెడ్పీ పాఠశాలను సోమవారం డీఈవో జనార్దన్‌రావు తనిఖీ చేశారు. ఎస్సెస్సీ విద్యార్థుల వార్షిక పరీక్ష సన్నద్ధతను పరిశీలించారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రీ ఫైనల్ పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ, తెలుగు పాఠ్యపుస్తక రచయిత గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రీతికి నివాళి

ర్యాగింగ్, మానసిక వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన మెడికో ప్రీతికి గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే ర్యాగింగ్‌కు పాల్పడిన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ బీజేపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆచూకీలేని దళితబంధు బండ్లు

- హుజూరాబాద్‌లో అధిక యూనిట్లు వాహనాలే
- యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు అధికారుల ప్రణాళిక
- బండ్లు స్థానికంగా లేవంటున్న లబ్ధిదారులు
- రేపటి నుంచి వాహనాల తనిఖీ చేపట్టనున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దళితబంధు పథకంలో ప్రభుత్వం మంజూరు చేసిన వాహనాలు జాడలేకుండా పోయాయి. ప్రభుత్వం ఇచ్చే యూనిట్లలో అధికంగా వాహనాలు తీసుకున్న లబ్ధిదారులు వాటిని ఇతర జిల్లాలకు తరలించారు. దీంతో ఇవి స్థానికంగా అధికారులకు అందుబాటులో లేకుండా పోయాయి. మార్చి 1వ తేదీ నుంచి దళితబంధు యాప్‌లో వాహనాల నమోదు మొదలవుతుండటంతో.. స్థానికంగా లబ్ధిదారుల్లో వేలాదిమంది ఇచ్చిన వాహనాలు మరో ఊళ్లో ఉన్నాయని తెలిసి అవాక్కవుతున్నారు. దళితబంధు యాప్‌లో వాహనాల నమోదు చాలా ముఖ్యమని, వాహనాలు స్థానికంగా లేకపోతే లబ్ధిదారులు నష్టపోతారని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

మెజారిటీ వాహనాలే..!

దళితుల సామాజిక ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం దళితబంధు. హుజూరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పైలెట్ ప్రాజెక్టును ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా క్రమంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు 18,000 మంది దళితబంధు కుటుంబాలను గుర్తించిన జిల్లా అధికారులు వారి అందరికీ దాదాపుగా యూనిట్లు అందజేశారు. ఇందులో అధికంగా వాహనాలే ఉండటం గమనార్హం. పైలెట్ ప్రాజెక్టు కావడం నియోజకవర్గ వ్యాప్తంగా వీలైనంత త్వరగా యూనిట్లు మంజూరు చేయాలన్న సంకల్పంతో వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంటతోపాటు కమలాపూర్ మండలాల్లో మెజారిటీ వాహనాలే మంజూరు చేశారు.

పనుల కోసమని..!

దళితబంధులో మంజూరు చేసిన ప్రతీ యూనిట్‌ను యాప్‌లో నమోదు చేసేందుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నడుంబిగించారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆధారంగా ప్రతీ యూనిట్‌ను అన్నివైపులా ఫొటోలు తీస్తారు. దాంతోపాటు యూనిట్ల ఇన్‌వాయిస్‌లు, బిల్లులు, డాక్యుమెంట్లు తదితరాలను యాప్ సాయంతో ప్రభుత్వ సర్వర్‌లో నిక్షిప్తం చేస్తారు. ఈ క్రమంలో మంజూరైన లబ్ధిదారులకు సమాచారం అందించారు. అంతా వాహనాలు తీసుకుని తాము సూచించినట్లుగా హుజూరాబాద్ జూనియర్ కాలేజీ మైదాన ప్రాంతానికి రావాలని సూచించారు. మార్చి 1,3,9 తేదీల్లో వాహనాల నమోదుకు తేదీలు కూడా ఖరారు చేశారు. అయితే.. దీనికి లబ్ధిదారుల నుంచి వచ్చిన సమాధానం విని అధికారులు అవాక్కవుతున్నారు. పథకం కింద చాలామంది ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు, జేసీబీ, హార్వెస్టర్లు, వరినాటు యంత్రాలు తదితర వాహనాలు తీసుకున్నారు. చాలాచోట్ల వ్యవసాయ, సివిల్ పనులు జరుగుతుండటంతో ఈ వాహనాలు ఆయా జిల్లాల్లో పనులకు వెళ్లాయి. ముందే ఒప్పుకున్న పనులు కావడంతో ఈ సమయంలో వాహనాలు ఉన్నఫలంగా వెనక్కి రావడం కుదరడం లేదు.



గతవారం హుజూరాబాద్‌లో వాహనాల నమోదులో పాల్గొన్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

వేదిక	నమోదుకాని వాహనాలు	నమోదు తేదీ
జమ్మికుంటరూరల్	597	1-3-2023
జమ్మికుంట మున్సిపల్	360	1-3-2023
హుజూరాబాద్	588	3-3-2023
హుజూరాబాద్ మున్సిపల్	221	3-3-2023
వీణవంక	336	9-3-2023
ఇల్లందకుంట	171	9-3-2023

నోట్: వాహనాలను హుజూరాబాద్ జూనియర్ కళాశాలకు తీసుకురావాలి

ఏంటి నష్టం..?

అధికారులు లబ్ధిదారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో వాహనాలతోపాటు వివిధ కుటీర, కిరాణ, హార్డ్‌వేర్, మెడికల్, ఇతర పరిశ్రమలను కూడా నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన యూనిట్లకే దళిత రక్షణ నిధి వర్తిస్తుంది. ఇప్పుడు పనుల పేరిట వేలాది వాహనాలకు తాజా నమోదుకు దూరంగా ఉండటం వల్ల వారి యూనిట్లకు ఎలాంటి బీమా కవరేజీ దక్కదని అధికారులు అంటున్నారు. అదే విధంగా మెజారిటీ బండ్లు ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. అందుకే.. వారి కోసం ఆర్టీవో అధికారులు స్వయంగా నమోదు కార్యక్రమానికి వస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వాహనాలకు కూడా బీమా వర్తించదు. వాహన యజమానులు యాప్‌లో వాహనాల నమోదుకు సహకరించకుంటే చాలారకాలుగా నష్టపోతారని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

నేడు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలతోపాటు పందులు, కుక్కలు, కోతుల బెడదకు సంబంధించిన సమస్యలను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లేందుకు 'సాక్షి' దినపత్రిక ఫోన్ ఇన్ ద్వారా అవకాశం కల్పిస్తోంది. కమిషనర్ పరిష్కార మార్గాలను వివరిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

తేదీ: 28.02.2023

సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సెల్ : 83330 04821

కలెక్టర్‌కు యూనిసెఫ్ ప్రశంస

కరీంనగర్ అర్బన్: మాతాశిశు సంరక్షణ సంక్షేమ పథకాల అమలులో జిల్లా కీర్తి పతాకన నిలిచింది. ఈ మేరకు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌ను యూనిసెఫ్ ప్రత్యేకంగా ప్రశంసించింది. ఇటీవల ఓడీఎఫ్ ప్లస్‌లో జాతీయస్థాయిలో 5 స్టార్ రేటింగ్ సాధించిన సందర్భంగా కలెక్టర్‌ను సోమవారం హైదరాబాద్ ఆహ్వానించి ప్రశంసించారు. నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) అనేమియా ముక్త్ కరీంనగర్ కార్యక్రమాలను వినూత్న రీతిలో నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణకు యూనిసెఫ్ 2016 నుంచి సహకారం అందిస్తోంది. పల్లె ప్రగతి స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్ జిల్లా స్వచ్ఛతలో జాతీయస్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందని, యూనిసెఫ్ కూడా తమ వంతు సహకారం అందిస్తూ అవకాశాన్ని కల్పించడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిసెఫ్ భాగస్వాముల సమక్షంలో యూనిసెఫ్ ప్రధాన కార్యాలయం (న్యూయార్క్) భారతదేశ ప్రతినిధి సైంథియా ఎంసీకాఫీరే, హైదరాబాద్ చీఫ్ మెయిటల్ రూసాడియా, టీఎస్‌సీసీసీఆర్ చైర్మన్ శ్రీనివాసరావు, వాష్ ఆఫీసర్ వెంకటేశ్ తదితరుల నుంచి ప్రశంసలు పొందారు. అనంతరం కరీంనగర్ జిల్లాలో యూనిసెఫ్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ చేస్తున్న కార్యక్రమాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. జిల్లా యూనిసెఫ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కిషన్ స్వామి, క్లస్టర్ ఫెసిలిటేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌తో కలెక్టర్ కర్ణన్, యూనిసెఫ్ ప్రతినిధులు

నేడు బల్దియా బడ్జెట్ సమావేశం

- బడ్జెట్ అంచనా రూ.628.68 కోట్లు
- ఆమోదానికి ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ మరోసారి భారీ బడ్జెట్ అంచనాను రూపొందించింది. నగరంలో జరుగుతున్న పనులు అందుకు తగిన నిధులు అవసరం అయ్యేలా బడ్జెట్‌ను తయారు చేశారు. పనులు, పన్నేతర ఆదాయాలు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు, రుణాలు తదితర అంశాల ఆధారంగా 2023–24 ఏడాదిగాను రూ.628.68 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. దీనికి నేడు జరిగే సర్వసభ్య సమావేశంలో ఆమోద ముద్ర వేయడానికి రంగం సిద్ధం చేశారు. ఎప్పటిలాగే గ్రీన్‌బడ్జెట్‌ను 10శాతం, 15వ ఆర్థిక సంఘం మ్యాచింగ్ గ్రాంట్‌ను 50శాతం కేటాయించారు. అదేవిధంగా పన్నుల ద్వారా రూ.34.24 కోట్లు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.30.50 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ ఖర్చు రూ.12.65 కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.8.10కోట్లు కేటాయించారు. వీలిన గ్రామాల అభివృద్ధి, నీటిసరఫరాకు రూ.10.90 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు సమాచారం. అయితే నగరపాలక సంస్థ రూపొందించిన బడ్జెట్‌ప్రతులను అందుకున్న పలువురు విపక్ష కార్పొరేటర్లు వారి డివిజన్లలో అభివృద్ధి పనులపై ప్రశ్నించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

కుక్కల బెడదపై చర్యలు తీసుకుంటున్నాం

చొప్పదండి మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన
- సమస్యలను లేవనెత్తిన ప్రజలు

చొప్పదండి: పట్టణంలో కుక్కల బెడద పెరిగిపోవడంపై దృష్టి సారించామని, ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చొప్పదండి పురపాలక సంఘం కమిషనర్ పి.శాంతికుమార్ అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించగా పట్టణ ప్రజలు పలు సమస్యలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారాలను కమిషనర్ వివరించారు. పట్టణంలో కుక్కలు, కోతుల బెడద, రోడ్ల మరమ్మతు, సీసీ రోడ్లు వేయడం, డ్రైనేజీల నిర్మాణం, రోడ్లపై గుంతలు, ఇంటి పన్నుల భారం తదితర సమస్యలపై ప్రజలతో మాట్లాడారు.

ప్రశ్న: ఇంటి పన్నులు తగ్గించాలి. సామాన్యులకు బిల్లులు ఎక్కువగా వచ్చాయి. ఏడాదికి రూ.1,200 ఉంటే ఒకేసారి రూ.4,100 చేశారు. తెల్లరేషన్ కార్డుదారులకు అన్యాయం జరిగింది.

– మొల్మూరి రాజేశం, 4వ వార్డు, చొప్పదండి

కమిషనర్: తమ సిబ్బంది స్థలంతోపాటు, ఇంటి నిర్మాణం కొలతలు వేసిన తర్వాతే బిల్లులు రూపొందించారు. ప్రభుత్వ రూల్ ప్రకారం ఇంటి పన్నులు వేస్తున్నాం. పొడవు, వెడల్పు కొలతలు తప్పుగా పడితే తమ దృష్టికి తీసుకురావాలి. మళ్లీ కొలిచి పన్నులు రూపొందిస్తాం.

ప్రశ్న: ప్రధాన రోడ్డుపై గుంతలను పూడ్చడం లేదు. అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డును తవ్విన వారిపై చర్యలు లేవు. స్ట్రీట్ లైట్లు వేయాలి.

– బొల్లి శ్రవణ్, 6వ వార్డు, చొప్పదండి

కమిషనర్: అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు తవ్వడంపై వచ్చిన సమాచారం మేరకు వెళ్లి పూడ్చివేశాం. ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకుపోయాం. గుంతలు ఉంటే మట్టి వేసి పూడ్చుతాం. కరీంనగర్ రోడ్డులోని పెట్రోల్ బంకుల వద్ద మట్టితో పూడ్చడానికి వీలు లేదు. అది ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. స్ట్రీట్ లైట్ల బిగింపు పూర్తి చేయిస్తాం.

ప్రశ్న: కుక్కల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నా కుమారుడు చదువుతున్నాడు. పిల్లలు కుక్కలకు భయపడుతున్నారు.

– ఎన్నం మునీందర్, 5వ వార్డు, చొప్పదండి

కమిషనర్: పాఠశాల సమీపంలోని చికెన్, మటన్, ఫిష్ సెంటర్ నిర్వాహకులకు ఇప్పటికే పత్రికా ముఖంగా వార్నింగ్ ఇచ్చాం. తమ మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు ట్రాక్టర్లలో మాత్రమే వేస్టేజీ వేయాలని చెప్పాం. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రధాన రోడ్డుతోపాటు, ఒకటో వార్డులో చిన్న రోడ్లను ఆక్రమించిన వారి గోడలు కూల్చి రోడ్డు వెడల్పు చేయాలి. ఇటీవల మా గల్లీ మొదటి ఇంటి ప్రహారీని ప్రధాన రోడ్డు వైపు కూల్చివేశారు. గల్లీ లోపలి వైపు కూడా రోడ్డును ఆక్రమించారు. దానిని కూడా కూల్చివేయాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలి.

– ఉస్కె రాజశేఖర్ రెడ్డి, 1వ వార్డు, చొప్పదండి

కమిషనర్: వంద అడుగుల రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రోడ్డు వెడల్పు జరుగుతోంది. వంద అడుగుల రోడ్డును ఆక్రమించిన వారి కట్టడాలను తొలగిస్తున్నాం. రోడ్డు ఆక్రమించిన వారిపై ఫిర్యాదు ఇవ్వండి. పర్మిషన్ పరిశీలించి చర్యలు తసుకుంటాం. రోడ్ల వెడల్పు విషయంలో ఎవరిని ఉపేక్షించేది లేదు. వచ్చే బడ్జెట్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై దృష్టి సారిస్తాం.



సమస్యలు తెలుసుకుంటున్న శాంతి కుమార్

ప్రశ్న: గాంధీనగర్‌లో రెండు బోర్‌వెల్‌లు పని చేయడం లేదు. మరమ్మతు చేయాలి.

– పెద్దెల్లి శ్రీనివాస్, 6వ వార్డు, చొప్పదండి

కమిషనర్: రెండు బోర్‌వెల్‌లను మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కోతుల బెడద, దోమల బాధ నివారించాలి. మంచినీరు రోజు సరఫరా చేయాలి – తాడూరి శివకృష్ణ, 8వ వార్డు, చొప్పదండి

కమిషనర్: దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేశాం. మళ్లీ కెమికల్ తెప్పించాం. వచ్చే వారం రోజుల్లో దోమల సమస్య పరిష్కరిస్తాం. ఎండాకాలం నీటిని పొదుపుగా వాడుకోవాలి. పైనుంచి మిషన్ భగీరథ నీరు వచ్చిన విధంగా సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: బీసీ కాలనీలో ప్రధాన రోడ్డుపై వేసిన సీసీ రోడ్డు పక్కన మొరం పోయాలి. రోడ్డు పక్కన వాహనదారులు పడిపోతున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – మారంపల్లి నాగభూషణం, 5వ వార్డు, చొప్పదండి

కమిషనర్: సీసీ రోడ్డు నిర్మాణం పూర్తియింది. సీసీ రోడ్డు పక్కన రెండు వైపులా మొరం పోయించాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. మా నోటీసులో ఉంది. కుక్కలను చంపటానికి వీలు లేదు. ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాల్సి ఉంది.

క్లుప్తంగా

మెడికో ప్రీతి మృతి బాధాకరం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌

కరీంనగర్‌: మెడికో ప్రీతి మృత్యువుతో పోరాడి మరణించిన ఘటన దురదృష్టకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ అన్నారు. వైద్యుల ప్రయత్నాలు విఫలమవ్వడం బాధ కలిగిస్తుందన్నారు. ప్రీతి మరణంపై ఆమె కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్టీసీ ఆర్‌ఎంను కలిసిన హుస్నాబాద్‌ డిపో మేనేజర్‌



మొక్క అందజేస్తున్న వెంకటేశ్వర్లు

కరీంనగర్‌: హుస్నాబాద్‌ డిపో మేనేజర్‌గా సీహెచ్‌ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు హైదరాబాద్‌ -1 డిపో అసిస్టెంట్‌ మేనేజరుగా పనిచేసి ప్రమోషన్‌పై హుస్నాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్‌ ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రో షాఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. తర్వాత డిప్యూటీ ఆర్‌ఎం(వో) చందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ట్రాఫిక్‌ పోలీసుల స్పెషల్‌ డ్రైవ్‌



పట్టుబడిన వాహనాలతో పోలీసులు

కరీంనగర్‌క్రైం: సీపీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నగరంలోని ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. నంబర్‌ ప్లేట్‌ టాంపరింగ్‌, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలను పట్టుకున్నారు. ట్రాఫిక్‌ సీఐ నాగార్జునరావు, ఎస్సై ఇషాక్‌, లింగారెడ్డి, ఆర్‌ఎస్‌ఐ రాజు, సిబ్బంది వన్‌టౌన్‌ స్టేషన్‌ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 150 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ట్రాఫిక్‌ ఏసీపీ జి.విజయకుమార్‌ మాట్లాడుతూ, వాహనాలకు నంబర్‌ప్లేట్‌ లేకపోవడం వల్ల చైన్‌ స్నాచింగ్‌, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు తప్పించుకొనిపోయే అవకాశం ఉంటుదన్నారు. ఆటో డ్రైవర్స్‌, ఓనర్స్‌ పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని, ఎక్స్‌ ట్రా ఫిట్టింగ్స్‌ చేస్తే చట్టప్రకారం క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ఐశ్వర్య

కరీంనగర్‌స్పోర్ట్స్‌: హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన సీహెచ్‌ ఐశ్వర్య అద్వితీయ ప్రతిభ కనబరిచింది. 20 సంవత్సరాలలోపు బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి జిల్లా పేరును నిలిపింది. ఈ సందర్భంగా ఐశ్వర్యను సర్పంచ్‌ అటికం శారద, ఎంపీటీసీ అటికం రాజేశం, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ, ఏఐఎస్‌ఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిందితుడి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్‌: సీనియర్‌ విద్యార్థి వేధింపులు, ర్యాగింగ్‌ భరించలేక ఆత్మహత్య చేసుకున్న ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో కమాన్‌ వద్ద ర్యాగింగ్‌ వ్యతిరేక దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్‌ మాట్లాడుతూ, వరంగల్‌ కాకతీయ మెడికల్‌ కాలేజీలో పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్న ప్రీతి సీనియర్‌ విద్యార్థి ర్యాగింగ్‌, లైంగిక వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుందని, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులపై కూడా ర్యాగింగ్‌ జరగడం బాధాకరమన్నారు. ర్యాగింగ్‌ కేసును తప్పుదోవ పట్టించేలా ప్రిన్సిపాల్‌ వ్యవహరిస్తున్నారని, వెంటనే అతడిని సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. ర్యాగింగ్‌ చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి, అలాంటి వారి అడ్మిషన్లు రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని, కళాశాలల్లో ర్యాగింగ్‌లపై ఎక్కడా సెమినార్లు, అవగాహన సదస్సులు నిర్వహించడం లేదన్నారు. అన్ని కళాశాలల్లో సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని, ర్యాగింగ్‌ నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ మామిడిపల్లి హేమంత్‌, సాయికృష్ణ, అజయ్‌, రాజేష్‌, సాయికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి, రక్షిత మరణాలపై విచారణ జరిపించాలి

డాక్టర్‌ ప్రీతి కుటుంబానికి న్యాయం చేసి, జమున కళాశాలలో ర్యాగింగ్‌ వల్ల మరణించిన రక్షిత మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్‌ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిందితుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్‌, రాష్ట్ర గర్ల్స్‌ కన్వీనర్‌ ఎం.పూజ మాట్లాడుతూ, ప్రీతిని సీనియర్స్‌ ర్యాగింగ్‌ చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. అలాగే నర్సంపేటలోని జమున కళాశాలలో రక్షితను ర్యాగింగ్‌ చేయడంతో ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో వారి బంధువుల ఇంటికి వెళ్లిన సందర్భంలో మనస్తాపానికి గురై ఉరేసుకొని చనిపోవడం జరిగిందన్నారు. రెండు ఘటనలపై కళాశాలల యాజమాన్యాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. అమ్మాయిలకు రక్షణ కల్పించేలా ర్యాగింగ్‌ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్‌, మనోజ్‌, శ్రీవాణి, నాయకులు వినయ్‌, సారిక, రమ్య, పూజిత, నవ్య, త్రిష, అరుణ, అంజలి, శ్రీలేఖ, అశ్విత తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలి

కరీంనగర్‌టౌన్‌: మెడికో విద్యార్థిని ధరావత్‌ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని, నిర్లక్ష్యం వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌, హెచ్‌వోడీలను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ బీజేపీ జిల్లా గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌక్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, జోన్ల అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్‌, నాయకులు చిట్టారెడ్డి లక్ష్మణ్‌రావు, గూగులోతు శ్రీకాంత్‌నాయక్‌, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌, మామిడి చైతన్య, రమేష్‌, మొండయ్య, కృష్ణహరి, మంజుల వాణి, రమణారెడ్డి, తిరుపతి, ప్రవీణ్‌, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

మెడికో విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు

హుజూరాబాద్‌: మెడికో స్టూడెంట్‌ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక సతీష్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మెడికో స్టూడెంట్‌లపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. వైద్య కళాశాలల్లో కేవలం సీనియర్స్‌ అనే ఫీలింగ్‌తో జూనియర్‌లపై అనుచితంగా ప్రవర్తిస్తూ వారిని మనోవేదనకు గురిచేస్తూ ఆత్మహత్యలకు దారితీస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు కాలేజీల్లో ఎన్నో జరుగుతున్నాయని, కొన్ని మాత్రమే బయటికి వస్తున్నాయన్నారు. ప్రీతి కుటుంబానికి వెంటనే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఇల్లు కట్టించాలని కోరారు.

కొవ్వొత్తులతో నివాళి

కరీంనగర్‌: డాక్టర్‌ ప్రీతి మృతికి సంతాపకంగా గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్‌ బీమా సాహెబ్‌ మాట్లాడుతూ, తక్షణం ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. కాలేజీ హెచ్‌ఓడీఎంఈ పై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోవడం, ఘటనపై ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గిరిజన నేతలు భాస్కర్‌నాయక్‌, జి.తిరుపతి, డాక్టర్‌ దశరథం, నరేష్‌, రాందాస్‌, కాళిదాస్‌, బోడా మోహన్‌, లక్పతి, రవీందర్‌, తిరుపతి, సంతోష్‌ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో..

కొత్తపల్లి(కరీంనగర్‌): వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో మెడికో ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నగేష్‌, కరీంనగర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ వరాల శ్రీనివాస్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురుమామిడి(మానకొండూర్‌): మండలంలోని ఇందుర్తిలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్‌ మారెల్ల శ్రీలత ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రీతికి నివాళులర్పించారు. మారెల్ల అంజవ్వ, కమటం రాణి, లావణ్య, అలేఖ్య, స్రవంతి, సునీత, లక్ష్మి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ విజయ ఆధ్వర్యంలో..

కరీంనగర్‌టౌన్‌: నగరంలోని జ్యోతినగర్‌ వివేకానంద జంక్షన్‌ వద్ద సోమవారం రాత్రి కార్పొరేటర్‌ రాపర్తి విజయ, పశ్చిమ జోన్‌ బీజేపీ పశ్చిమ గోదావరి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పించారు. నాగసముద్రం ప్రవీణ్‌, రాపర్తి ప్రసాద్‌, బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,650



వేలంలో పాల్గొన్న వ్యాపారులు, సీసీఐ అధికారి

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్‌ పత్తి ధర గరిష్టంగా రూ.7,650 పలికింది. సోమవారం మార్కెట్‌కు 144 వాహనాల్లో 2,099 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,650, మోడల్‌ ధర రూ.7,550, కనిష్ట ధర రూ.7,100 చెల్లించారు. గన్నీ సంచుల్లో 14 మంది రైతులు 27 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,300, మోడల్‌ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,000 పలికింది. కొనుగోళ్లను మార్కెట్‌ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్‌ పర్యవేక్షించారు. కాగా జమ్మికుంట మార్కెట్‌లో కమర్షియల్‌ కొనుగోళ్లు చేపట్టేందుకు సీసీఐ (కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా) రంగం సిద్ధం చేసింది. సీసీఐ అధికారి ఎం.ఆనందన్‌ మార్కెట్‌లో క్రయ విక్రయాలను పరిశీలిస్తున్నారు. సీసీఐ నాణ్యమైన పత్తిని సేకరించి కమర్షియల్‌ కొనుగోళ్లు చేపడుతుందని సీసీఐ అధికారి తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసుల వివరాలు.. నగరానికి చెందిన పి.కనుకయ్య హమాలీ పని చేసుకుంటూ జీవించేవాడు. అతడి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉండగా వారిని వదిలేసి ఇక్కడ వేరే మహిళతో ఉంటున్నాడు. బీపీ, షుగర్‌ ఉండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వేధించడంతో నిత్యం మద్యం తాగేవాడు. ఆదివారం వన్‌టౌన్‌ పరిధిలోని సిక్‌వాడిలో కిందపడి ఉన్నాడు. స్థానికులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు.

అక్రమ వ్యాపారంపై కొరడా

- తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్‌ కంట్రోలర్‌ తనిఖీలు
- పలు దుకాణాలపై కేసులు

కరీంనగర్‌ అర్బన్‌: అసలే కల్తీ వ్యాపారంతో ప్రజలు నలిగిపోతుంటే వ్యాపారుల జిమ్మిక్కులు వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యాపారంలో పలు మార్గాల్లో వినియోగదారులను మోసం చేస్తుండగా అడపాదడపా తనిఖీలు మినహా నిరంతర తనిఖీలు కలే. దీంతో వ్యాపారులు అందినకాడికి దండుకుంటుండగా మోసాలు షరామామూలయ్యాయి. సోమవారం పలువురి ఫిర్యాదుల క్రమంలో తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్‌ కంట్రోలర్‌(ఏసీ) కె.విజయసారథి కొరడా ఝళిపించారు. పలు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

ధరల జిమ్మిక్కులు.. తూకంలో మోసం

నగరంలోని భారత్‌ టాకీస్‌ రోడ్‌లో గల రిలయన్స్‌ రిటైల్‌ సూపర్‌ మార్కెట్‌లో 500 గ్రాముల గుడ్‌ లైఫ్‌ జీరా ధరను అవర్‌ ప్రైస్‌, ఎంఆర్‌పీ ధరలో తేడా ఉండగా వినియోగదారులను ఆకర్షించేందుకు తప్పుడు ధరలు పెడుతున్నట్లు గుర్తించారు. ధర తగ్గిస్తున్నట్లు చూపించడం, ఎక్కువ ఎంఆర్‌పీ ఉన్న ప్యాకేజీ ఉంచడం, బిల్లులో ఎక్కువ ధర వేసినట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేశారు. ఇదొక్కటే కాకుండా ఇతర వస్తువులు కూడ ఇలాగే ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఏసీ విజయసారథి స్టోర్‌ మేనేజర్‌ను వివరణ కోరగా నెల చివరి రోజుల్లో ధరలు తారుమారవుతాయని ఇంకా మార్చలేదని చెప్పుకురావడం విశేషం. అలాగే రైల్వే స్టేషన్‌ రోడ్డులో గల విష్ణుసాయి స్టీల్‌ ట్రేడర్స్‌లో దక్కన్‌ సిమెంట్‌ బస్తాను తక్కువ తూకంతో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. బస్తా 50కిలోలు ఉండాల్సి ఉండగా తక్కువ తూకంతో బస్తా ఉన్నందుకు గానూ దక్కన్‌ సిమెంట్‌ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.



సూపర్‌ మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న విజయసారథి

తక్కువ తూకముంటే చర్యలు

దుకాణాల్లో ఎవరూ వినియోగదారులను మోసగించినా చర్యలు తప్పవు. ఎక్కువ ధరకు విక్రయించినా, తక్కువ తూకం, పరిమాణంతో ఉన్నా ఫిర్యాదు చేయాలి. గ్యాస్‌ డెలివరీలో రశీదులో ఉన్న దానికంటే ఎక్కువ తీసుకున్నా, తక్కువ తూకం ఉన్నా 94418 28975 నంబర్‌కు ఫోన్‌ చేయాలి.

– కె.విజయసారథి, తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్‌ కంట్రోలర్‌

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌

కరీంనగర్‌: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 8న వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో వారోత్సవాల ఏర్పాట్లపై మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 2 నుంచి 8 వరకు జ్యోతిరావు పూలే మైదానంలో జరగనున్న వారోత్సవాల్లో జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధంగా రోజూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, ఎన్‌సీసీ వలంటీర్లు కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని తెలిపారు. మహిళ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఇతర మహిళ ప్రజాప్రతినిధులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి సబితకుమారి, మెప్మా పీడీ రవీందర్‌, జిల్లా వైద్యాధికారి జువేరియా పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రతో బీజేపీ, బీఆర్‌ఎస్‌లో వణుకు



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

సైదాపూర్‌: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రతో బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల్లో వణుకు పుట్టిందని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌ మండలం శాలపల్లి, ఇంద్రానగర్‌ గ్రామాల్లో నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్‌, డీసీసీ కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడు క్రిష్టారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. మోదీకి సంపన్నుల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్‌ పాలనలో పేదలు మరింత పేదలుగా మారేందుకు చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర మంగళవారం శాలపల్లి, ఇంద్రానగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. మార్చి 1న ఇల్లందకుంట మండలం సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శిస్తారని, అదే రోజు రాత్రి 7.30 గంటలకు హుజూరాబాద్‌లో అంబేద్కర్‌ చౌక్‌ వద్ద సమావేశం ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కోరా ఉన్నత పాఠశాలలో సైన్స్‌ డే



ప్రదర్శనలు తిలకిస్తున్న శేఖర్‌రావు, తదితరులు

కరీంనగర్‌: నగరంలోని విద్యానగర్‌లో గల కోరా ఉన్నత పాఠశాలలో ×ఐకానికి సైన్స్‌ పేరుతో జాతీయ సైన్స్‌ డే ను సోమవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వర్కింగ్‌ మోడల్స్‌, వాటి పరికల్పనలు ప్రదర్శించారు. వివిధ రకాల కాలుష్యాలు, వాటి నివారణ, మానవ శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీల పనితీరు, వాతావరణంలోని మార్పులు పరిణామాలు, హైడ్రాలిక్‌ బ్రేక్‌, డ్రిప్‌ ఇరిగేషన్‌, వివిధ రకాల పనిముట్లు వాటి పనితీరుని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌, డ్రాయింగ్‌ కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల చైర్మన్‌ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్‌, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



దేవేందర్‌ (ఫైల్‌)

జమ్మికుంట(హుజూరాబాద్‌): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ తిరుపతి వివరాలు.. జమ్మికుంట మున్సిపల్‌ పరిధి కొత్తపల్లికి చెందిన బత్తుల దేవేందర్‌ (40) ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్‌ పరిధిలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవేందర్‌ సెంట్రింగ్‌ పని చేస్తుంటాడు. మద్యానికి బానిస కాగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు సోమవారం గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘నారాయణపూర్‌’కు నీటిని విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు, రైతులు

కరీంనగర్‌: ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్‌ రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్‌ నాయకులు, రైతులు నిరసన తెలిపారు. నారాయణపూర్‌, చర్లపల్లి, ఇస్తారుపల్లి, మంగపేటను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని, ఎండి పోయిన పంట పొలాలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. సోమవారం కలెక్టరేట్‌ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణిలో కాంగ్రెస్‌ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, ఈ యాసంగిలో నారాయణపూర్‌ రిజర్వాయర్‌ కింద చొప్పదండి నియోజకవర్గంలోని పలు మండలాల రైతులు వందలాది ఎకరాల్లో వరిపంట సాగుచేయడం జరిగిందన్నారు. సాగునీరు విడుదల చేస్తామంటూ ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడంతో రైతాంగం కూడా వరి సాగుకు మొగ్గు చూపారని, తక్షణమే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్‌కు నీటిని విడుదల చేసి ఎండిపోయే దశలో ఉన్న పంటలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల అధ్యక్షులు పురుమల్ల మనోహర్‌, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరవేణి తిరుపతి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, ఎంసీటీసీ జావ్వాజి హరీశ్‌, కిషన్‌ సెల్‌ అధ్యక్షుడు బుర్గ గంగన్న, బట్టు లచ్చన్న, ముత్యం శంకర్‌, రాయమల్లు, పంజాల శ్రీనివాస్‌, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, అశోక్‌, తోట కరుణాకర్‌, మల్లేశం, కోల ప్రభాకర్‌, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌, గాజుల అజయ్‌, దిలీప్‌, భువన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వోరుగంటి

మానకొండూర్‌: మండలంలోని దేవంపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆహార భద్రత కమిషన్‌ సభ్యుడు వోరుగంటి ఆనంద్‌ అధికారులతో కలిసి అకస్మికంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. మెనూ పాటించడం లేదని, కడుపు నిండా అన్నం పెట్టడం లేదని, తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా విద్యార్థులు ఫిర్యాదు చేశారు. విద్యార్థులతో విడి విడిగా సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో లేకపోవడం, ఫుడ్‌ కమిటీలు పేరుకు మాత్రమే ఉన్నాయని, సరిగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై విచారణ జరిపి పది రోజుల్లో కమిషన్‌ కార్యాలయానికి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, మండల విద్యాధికారి మధుసూదనాచారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో మంగళవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్‌ జువేరియా ప్రకటించారు. కరీంనగర్‌ పట్టణంలోని 1,4,10,13,16,28,30,31,32,36,40,56వ డివిజన్లు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హుజురాబాద్‌ పట్టణంలో 12,30వ వార్డుల్లో, అదే మండలంలోని ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద గ్రామాల్లో, జమ్మికుంట పట్టణంలోని 7,28వ వార్డులు, అదే మండలంలోని తనుగుల, వీణవంక మండలం మామిడాలపల్లి, రెడ్డిపల్లి, బేతికల్‌, చిగురుమామిడి మండలం రేకొండ, ముదిమాణిక్యం, చొప్పదండి పట్టణంలో 8వ వార్డు, అదే మండలంలోని వెదురుగట్ట, చాకుంట, ఇల్లందకుంట మండలం రాచపల్లి, కనగర్తి, గంగాధర మండలం గర్శకుర్తి, గోపాల్‌రావుపల్లి, కురిక్యాల, రామడుగు మండలం పందికుంటపల్లి, కొక్కెరకుంట, కొత్తపల్లి పట్టణం 5వ వార్డు, అదే మండలంలోని బొమ్మకల్‌, కరీంనగర్‌ రూరల్‌ మండలం చర్లబూత్కూర్‌, గోపాల్‌పూర్‌, మానకొండూరు మండల కేంద్రంతోపాటు గంగిపల్లి, ఊటూర్‌, సైదాపూర్‌ మండలం సోమారం, నలరామయ్యపల్లి, కేశవపట్నం మండలం తాడికల్‌, మెట్‌పల్లి, తిమ్మాపూర్‌ మండలం ఇందిరానగర్‌, మన్నెంపల్లి, గన్నేరువరం మండలం జంగపల్లిలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వాలీబాల్ కోర్టు ప్రారంభం



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలోని క్రీడాప్రాంగణంలో సోమవారం వాలీబాల్ కోర్టును సర్పంచ్ ఊరడి మంజుల మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్ గోనె నర్సయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

కొత్తపల్లి: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి మధుసూదనాచారి అన్నారు. కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. నోడల్ ఆఫీసర్ జలజారాణి, హెచ్ఎం రాజరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు సోమవారం మొగ్దుంపూర్‌కు చెందిన తాండ్ర అంజన్న చారిటెబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్, జీకే పుస్తకాలు అందజేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ట్రస్టు చైర్మన్ తాండ్ర మధుకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గాలిపల్లి రవీందర్, మీసాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగునూరులోని ప్రతిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8నెలల బాలుడికి ఓ పాజిటివ్ రక్తం అత్యవరం కాగా.. శ్రీశాతవాహన ఎన్జీవో ప్రధాన కార్యదర్శి జెట్టి రాజు రక్తదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన రాజును శ్రీశాతవాహన ఎన్జీవో అధ్యక్షుడు గుండేటి శ్రీనాథ్, సామాజిక కార్యకర్త అంగేటి తిరుపతిరెడ్డి, దిక్సూచి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బిజిగిరి నవీన్‌కుమార్, సభ్యులు అంబటి వినోద్, వరాల దేవేందర్, కొమ్ముల జీవన్ రెడ్డి తదితరులు అభినందించారు.

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం



కరీంనగర్: నగరంలోని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ సోమవారం కంటి వెలుగు సిబ్బందిని సన్మానించారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగును 20 రోజులుగా డివిజన్ ప్రజలకు ఎంతో ఓపికతో సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రజిత, నిర్మల, సరిత, సీవో భాస్కర్, ఆశా వర్కర్లు వినోద, రమ, ఆర్పీ అనూషా, బీఆర్ఎస్ నాయకులు నిసార్, తిరునగిరి గోపాల్, బైరం కుమార్, గొర్రె వాసు, కూర వినోద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో అయిదో తరగతిలో ప్రవేశానికి అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వాతి కోరారు. 2023– 24 విద్యా సంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోచ్‌ల రెమ్యునరేషన్ ఇంకెప్పుడు..?

- ఇంకా అందని డబ్బులు, ట్రాక్‌షూట్‌లు
- రెండునెలలు గడిస్తే మళ్లీ వేసవి శిబిరాలు ప్రారంభం
- అసహనం వ్యక్తం చేస్తున్న కోచ్‌లు



అంబేడ్కర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ నగరపాలక సంస్థ గతేడాది వేసవి సెలవుల్లో అంబేడ్కర్ స్టేడియం వేదికగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను అట్టహాసంగా నిర్వహించింది. నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు నెల రోజుల పాటు రోజూ ఉదయం క్రీడాశిక్షణ శిబిరాలకు హాజరయ్యారు. ఇలా 2017 నుంచి 2022 వరకు శిబిరాలు నిర్వహించగా సుమారు 3 వేలకు పైగా చిన్నారులు పాల్గొన్నారు. వీరందరికీ శిక్షణ నిచ్చేందుకు సుమారు 70 మందికి పైగా కోచ్‌లను క్రీడాశాఖ ఎంపిక చేసింది. వీరికి గౌరవ వేతనంగా కొంత మొత్తాన్ని నగర పాలక సంస్థ అందజేస్తోంది. కానీ 2022లో నిర్వహించిన శిబిరాలకు సంబంధించిన రెమ్యునరేషన్ తొమ్మిది నెలలు గడిచినా ఇవ్వకపోవడంతో కోచ్‌లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా మరో రెండు నెలలు గడిస్తే మళ్లీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు.

తొమ్మిది నెలలు గడిచినా..

2022 మే 9 నుంచి జూన్ 10 వరకు నెలరోజుల పాటు 28 క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఇందుకు నగర పాలక సంస్థ అధికారులతో పాటు జిల్లా క్రీడాశాఖ అధికారులు కొందరు కోచ్‌లను ఎంపికచేసి వారికి శిక్షణ కాలం ముగిసిన అనంతరం గౌరవ వేతనం ఇవ్వాలి. శిక్షణ శిబిరాలు ముగిసి తొమ్మిది నెలలు గడిచినప్పటికీ గౌరవ వేతనంతో పాటు క్రీడాకిట్‌లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుడుతున్నారు. ఇప్పటికైనా గౌరవ వేతనంతో పాటు ట్రాక్ షూట్‌లు అందజేయాలని కోరుతున్నారు.

అసహనం వ్యక్తం చేస్తున్న కోచ్‌లు..

వేసవి సెలవుల్లో నెలరోజులు 3వేల మందికి పైగా చిన్నారులకు 28 క్రీడాంశాల్లో కోచ్‌లు శిక్షణనిచ్చారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు శిబిరాలు నిర్వహించగా తమకు గౌరవవేతనం నెలలపాటు ఇవ్వడం లేదని అసహనం వ్యక్తంచేస్తున్నారు.

నాలుగేళ్లుగా శిక్షణ ఇస్తున్నాం



2017లో వేసవి శిబిరాలు ప్రారంభం కాగా 2022 వరకు ఇదే తంతు కొనసాగుతోంది. వేసవి సెలవుల్లో మేము సొంతంగా శిక్షణ శిబిరాలను నిర్వహించే వాళ్లం. నాలుగేళ్లుగా కేవలం నగర పాలక సంస్థ శిబిరాల్లో శిక్షణనిస్తున్నాం. తమకు సకాలంలో గౌరవ వేతనం అందించడం లేదు. – కోడూరి శేఖర్, కోచ్

తొమ్మిది నెలలు గడిచాయి



వేసవి శిక్షణ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గౌరవ వేతనం ఇస్తామంటే అంగీకరించాం. ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచాయి. ఇస్తామన్న కిట్‌లు కూడా ఇవ్వలేదు. గౌరవ వేతనం ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నాం. – వంశీ, కోచ్

మార్చిలో క్లియర్ అవుతాయి

క్రీడా శాఖ నుంచి కోచ్‌లకు సంబంధించిన లిస్టు ఇటీవల ఇచ్చింది. నగర పాలక పరంగా, టెక్నికల్‌గా అన్ని అంశాలు పూర్తయ్యాయి. మార్చిలో కోచ్‌లకు సంబంధించిన రెమ్యునరేషన్ క్లియర్ అవుతాయి. – వై.సునీల్‌రావు, నగర మేయర్

సిటీ బస్సులు నడపాలి

పబ్లిక్ డిమాండ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ నగర పాలక సంస్థగా ఎదిగి స్మార్ట్ సిటీగా మారింది. ఇరువైపులా 15, 20 కిలోమీటర్లకు విస్తరించింది. జనాభా 4లక్షల వరకు చేరింది. నగరం రోజురోజుకూ విస్తరిస్తున్నప్పటికీ రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సొంత వాహనాలు లేని సామాన్య, మధ్య తరగతి ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు వివిధ పనులపై నగరంలోని ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అంతే కాకుండా సమయం కూడా ఎక్కువే పడుతోంది. రూ.10తో సాగిపోయే ప్రయాణానికి రూ.30 నుంచి రూ.50 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ సంస్థ నగరంలోని వివిధ కాలనీలకు, ప్రధాన మార్గాల్లో సిటీ సర్వీసులను నడిపించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. పద్మనగర్, ఎల్ఎండీ కాలనీ, తీగలగుట్టపల్లి, నగునూర్, మల్కాపూర్, చింతకుంట, రేకుర్తి, లక్ష్మీపూర్, బొమ్మకల్, సదాశివపల్లి, ఇవన్నీ నగరానికి 8 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ రూట్‌లే కాక వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి రావాలంటే ఆటోలను ఆశ్రయిస్తే రూ.50, షేరింగ్ ఆటో అయితే రూ.20లు కావాలి. ప్రజల రవాణ భారాన్ని తగ్గించడానికి సిటీ సర్వీసులను నడపాలని కోరుతున్నారు.

సిటీ సర్వీసులుంటే సౌకర్యంగా ఉంటుంది



పట్టణంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే కష్టతరమవుతుంది. ఆటోలు రిక్షాల్లో వెళ్తే చాలా ఖర్చవుతోంది. అలాగని నడిచి వెళితే చాలా సమయం పడుతుంది. వృద్ధులు, చిన్న పిల్లలు మరిన్ని కష్టాలు పడుతున్నారు. ఆర్టీసీ సిటీ బస్సులు ప్రవేశపెడితే చాలా సౌకర్యం, లాభదాయకం.
– ఎండీ.ఖాసీద్, న్యూ కిరణ్ ఆప్టికల్స్, సివిల్ హాస్పిటల్ రోడ్, కరీంనగర్

ఆటో చార్జీలు భరించలేకపోతున్నాం



నగరంలో ఆటో చార్జీలను భరించలేకపోతున్నాం. నిత్యం ఏదో ఒక పని మీద నగరంలోని సుదూరు ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. ఒక స్టాప్ నుంచి ఇంకో స్టాప్‌కు ఆటో మీద వెళ్లాలన్నా కనీసం రూ.20లు వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి సిటీ బస్సు సౌకర్యం కల్పించాలి.
– నరాల పర్శరాములు, అకౌంటెంట్, సన్‌రైజ్ హాస్పిటల్, కరీంనగర్

శివారు కాలనీలకు బస్సులు వేయాలి



నగరంలోని శివారు కాలనీలకు సిటీ బస్సులు ఏర్పాటు చేయాలి. బొమ్మకల్, పద్మనగర్, ఎల్ఎండీ కాలనీ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు రావాలన్నా, వెళ్లాలన్నా కష్టంగా ఉంది. సిటీ బస్సులు నడిపితే తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో వెళ్లి రావచ్చు.
– కొత్త అనిల్‌కుమార్, సివిల్ కాంట్రాక్టర్, జ్యోతినగర్, కరీంనగర్

సిటీ బస్సులు ప్రారంభించాలి



సిటీ బస్సులు లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిత్యావసరాల కోసం ఎటు వెళ్లాలన్నా వెళ్లే ప్రతిసారి రూ.100 వరకు ఆటోలకే వెచ్చించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి సిటీ బస్సులు ప్రారంభించాలి.
– ఏ. సిరిచందన, విద్యార్థిని, రాంనగర్, కరీంనగర్

వైకుంఠధామాల అభివృద్ధికి పెద్దపీట

- మేయర్ సునీల్‌రావు



పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: నగరంలోని వైకుంఠధామాల అభివృద్ధికి పెట్టపీట వేస్తున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. సోమవారం 9, 32 డివిజన్‌ల పరిధిలోని అల్కాపురి గ్రేవీయార్డులో నగరపాలక సంస్థ రూ.40లక్షల నిధులతో చేపట్టిన బర్నింగ్ ప్లాట్‌ఫాం, కర్మకాండ భవనం, వివిధ సుందరీకరణ పనులను ప్రారంభించారు. నగరంలోని అన్ని వైకుంఠధామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తోందని అన్నారు. మనిషి చివరి ఘట్టానికి చేరే శ్మశానవాటికల్లో అత్యాధునిక హంగులతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అల్కాపురి గ్రేవీయార్డుకు రూ.2 కోట్లు కేటాయించి పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, మర్రి భావన సతీశ్, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్ ప్రారంభం

కరీంనగర్‌లోని 14, 35వ డివిజన్ సప్తగిరికాలనీలో కొత్త విద్యుత్ బిల్లు చెల్లింపుల కేంద్రాన్ని సోమవారం మేయర్ వై.సునీల్‌రావు ప్రారంభించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, మహేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్, డీఈ రాజం, ఎస్ఏవో రాజేశం, టౌన్–2 ఏడీఈ సుధీర్, ఏఈ చంద్రయ్య, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని పంచముఖ అభయాంజనేయస్వామి ఆలయాన్ని మేయర్ సునీల్‌రావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెస్, కరాటే పోటీల్లో 'భగవతి' విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో తెలంగాణ గోజుర్యూ డో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే, నియో కిడ్స్‌లో జరిగిన జిల్లాస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో భగవతి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభకనబర్చారు. ఈశాంత్, హర్షవర్ధిని, సాత్విక్, ఈశాన్, భవీన్‌లు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ బి రమణారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మి లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఏఐఎఫ్‌బీ కేంద్ర కమిటీ సభ్యుడిగా తేజ్‌దీప్‌రెడ్డి



తేజ్‌దీప్‌రెడ్డి

కరీంనగర్: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) కేంద్ర కమిటీ సభ్యుడిగా కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా మహాసభల్లో జిల్లాకు చెందిన తేజ్‌దీప్‌రెడ్డిని కేంద్ర కమిటీ సభ్యుడిగా జాతీయ నాయకత్వం నియమించింది. గతంలో జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా తేజ్‌దీప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి రానున్న రోజుల్లో ఏఐఎఫ్‌బీని బలీయమైన శక్తిగా పనిచేస్తానని అన్నారు. తన నియమాకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు అన్నారు. సోమవారం సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రాసిన ప్రీఫైనల్ పరీక్ష పేపర్లను పరీక్షించి జవాబులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను ఇంకా కష్టపడి చదివేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భద్రయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణమూర్తి, ఐలయ్య, శ్రీనివాస్, శారద, స్వాతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కాంతమ్మ

కరీంనగర్: కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు రెవెన్యూ శివారు సర్వేనంబర్ 669/12ఏలో 3 ఎకరాల 20 గుంటల భూమిలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ కార్ఖానగడ్డకు చెందిన గడప కాంతమ్మ సోమవారం ప్రజావాణిలో జెడ్పీ సీఈవో ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని గతంలో దళితులకు పట్టాలు ఇచ్చారని, అలాంటి భూమిపై దొంగ కాగితాలు సృష్టించి ప్రజాప్రతినిధులు, అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకొని అన్యాక్రాంతమవుతున్న భూమిని తమకు ఇప్పించాలని కోరారు.

'బ్లూబెల్స్'లో జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలతో బ్లూబెల్స్ పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: నగరంలోని హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్‌రెడ్డి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విజ్ఞాన శాస్త్రంలో రామన్ చేసిన పరిశోధనలు, సాధించిన విజయాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

మానకొండూర్‌రూరల్: జగ్గయ్యపల్లిలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషిచేస్తుందన్నారు. జెడ్పీటీసీ శేఖర్, సర్పంచ్ దీప, ఉపసర్పంచ్ సంపత్ రెడ్డి, ధర్మేందర్, నాయకులు జగన్ గౌడ్, నెల్లి మురళి, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే సంక్షేమం

శంకరపట్నం: కేంద్రం నిధులతోనే గ్రామాల్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి అన్నారు. మండలంలోని ఆర్కండ్లలో సోమవారం నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా గ్రామపంచాయితీలను నిర్వీర్యం చేస్తుందన్నారు. మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, జైపాల్, నరేందర్, సాగర్ పాల్గొన్నారు.

ఆజాద్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: అతిచిన్న వయస్సులోనే బ్రిటిష్ వారిని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 92వ వర్ధంతి సందర్భంగా సోమవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు వారి విడుదలకు అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు పూజ, జిల్లా రత్నం సురేశ్, నాయకులు సందేశ్, హరీశ్, అశ్వంత్, అక్షయ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి



బంగారు పతకం సాధించిన రాణి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 11 మంది బంగారు, 10 మంది రజత పతకాలు, 17 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. అత్యధిక పతకాలు సాధించి రెండో స్థానం గ్రాండ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి, కరాటే మాస్టర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వాగ్దేవి విద్యార్థికి బంగారు పతకం

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని కాల్వ రాణి ప్రతిభకనబర్చి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా రాణిని కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, ప్రిన్సిపాల్ పూరెళ్ల రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ మునీందర్, పీజీ ఇన్‌చార్జి పి.రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

మున్సిపల్ వర్కర్స్ నివాళి



నివాళి అర్పిస్తున్న కార్మికులు

కరీంనగర్ సిటీ: వైద్య విద్యార్థిని మృతికి మున్సిపాల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) కరీంనగర్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రాత్రి పూట స్వీపింగ్ చేసే మహిళా కార్మికులు మున్సిపల్ ఆవరణలో, కమాన్ చౌరస్తాలో క్యాండిల్స్ వెలిగించి నివాళి అర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముక్కెర బుజ్జమ్మ మాట్లాడుతూ.. సమాజం సిగ్గుతో తలదించుకోవాలని, ఒక మనిషి మరో మనిషిని ర్యాగింగ్ చేయడం సిగ్గు చేటని అన్నారు సైఫ్ పై కాలేజీలోని ఉన్నతాధికారులకు ప్రీతి ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు స్పందిస్తే ప్రీతి ఆత్మహత్య చేసుకునేది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడారి కమల, కొంకటి పద్మ, ధావు విజయ, కాదశి శాంతమ్మ, అందె విజయ, రాజేశ్వరి, సుశీల, మల్లమ్మ, శారద, ఇల్లందుల విజయ, లక్ష్మి, మీనా, రజిత, రాము, రాజు, దుర్గయ్య, రమేశ్, సురేందర్, మల్లేశం, సురేశ్‌తోపాటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

2న ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం పార్టీ ఆవిర్భవించి 65 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మార్చి 2న కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. వేడుకల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీని కరీంనగర్‌లోని 35 డివిజన్లలో క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు బూత్‌స్థాయి కన్వీనర్లు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

రేపు లాసెట్ నోటిఫికేషన్ విడుదల

- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, న్యాయ కళాశాలల్లో న్యాయ విద్యలో మూడేళ్ల, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీఎస్ లాసెట్–2023, టీఎస్‌పీజీఎల్‌సెట్–2023 షెడ్యూల్ విడుదలైంది. మార్చి 1న నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి విడుదల చేస్తారు. మార్చి 2వ తేదీ నుంచి సెట్ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు స్వీకరణ గడువు ఏప్రిల్ 6. రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 12 వరకు, రూ.1000 అపరాధరుసుముతో ఏప్రిల్ 19, రూ.2వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 26 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో మే 3వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు సెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ లాసెట్–23, టీఎస్‌పీజీఎల్‌సెట్–23 పరీక్షలను మే 25వ తేదీన నిర్వహించనున్నారు. మే 29వ తేదీన ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణకు గడువు మే 31గా నిర్ణయించారు. తుది కీ, ఫలితాల ప్రకటన తేదీలను ఆ తర్వాత ప్రకటించనున్నారు.

నేడు టీఎస్ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సు ల్లో ఈ విద్యా సంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను టీఎస్ఐసెట్–2023 నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, టీఎస్ఐసెట్ చైర్మన్, కేయూ వీసీ తాటికొండ రమేశ్ విడుదల చేస్తారని టీఎస్ఐసెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం తెలిపారు.

సిసోడియాకు ఒక న్యాయం.. అదానీకి ఒక న్యాయమా?

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు కానీ, ఆర్థిక కుంభకోణాల్లో అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిన అదానీని అరెస్టు చేయరా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. నిజాయితీగా అత్యధిక మెజారిటీతో 90 శాతానికి పైగా సీట్లతో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీని కూడా బతకనివ్వరా? అని ఆయన నిలదీశారు.

గుడిసె గోడు.. ఆలకించాలి దొర!




ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న ఆదివాసీలు తమ దైవమైన హీరా సుఖ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం బట్టిసావర్గాం శివారు సర్వే నం.72 వద్ద 20 ఎకరాల్లో సుమారు వెయ్యిమంది గుడిసెలు వేశారు. ఈ స్థలంపై తమకు హక్కులు కల్పించాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మావల ఆర్ఐ హన్మంత్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని గుడిసెలు తొలగించేందుకు ప్రయత్నించగా..వారు వినకపోవడంతో ఆర్ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రపై వరంగల్ వేదికగా చర్చిద్దాం
- కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్
- కేసీఆర్ రాక్షస పాలనకు అంతం ఖాయం
- 4కోట్ల మంది నుంచి కల్వకుంట్ల కుటుంబం బహిష్కరణ
- జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్



బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి



పరకాల: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర లేదంటున్న కేటీఆర్.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమిటో తేల్చుకోవడానికి వరంగల్ ఏకశిల పార్క్ వద్ద చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర సోమవారం పరకాల పట్టణానికి చేరుకుంది. బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలందరూ నా కుటుంబం అని చెప్పుకునే కేటీఆర్ ప్రగతి భవన్‌కు ప్రజలను ఎందుకు రానివ్వడం లేదు. ఒక్క కుటుంబాన్ని అయినా పిలిచి భోజనం పెట్టలేదు. అలాంటి కల్వకుంట్ల కుటుంబాన్ని 4కోట్ల ప్రజలనుంచి బహిష్కరిస్తున్నాం. దీనిని పోరుగడ్డ అయిన పరకాల నుంచి ప్రకటిస్తున్నా'అని అన్నారు. ఓటు అనే ఆయుధంతో కేసీఆర్ రాక్షసపాలను అంతమొందించాలన్నారు. రాక్షసుడి బలంలో చిలుకలో ఉన్నట్లు.. కేసీఆర్ బలం ఎమ్మెల్యేలలో ఉందని వారందరినీ..చిలుక మెడలు విరిచినట్లు..వచ్చే ఎన్నికల్లో వీరిని చిత్తుగా ఓడిస్తే కేసీఆర్ అనే రాక్షసుడు బలహీనుడు అవుతాడన్నారు. వేధింపులతో గిరిజన డాక్టర్ బిడ్డ ప్రీతి ప్రాణాలను పొట్టనపెట్టుకున్నా, 4ఏళ్ల చిన్నారిని కుక్కలు దాడి చేసి చంపినా కూడా చలించని, పలకరించని కల్వకుంట్ల కుటుంబాన్ని క్షమించకూడదన్నారు. 'నీ ఇంట్లో ఆడబిడ్డను ఎవరైనా చంపితే ఇలాగే చేస్తావా'అని కేసీఆర్‌నుద్దేశించి ప్రశ్నించారు.

వైఎస్ హయాంలో సంక్షేమం

రాష్ట్రంలో వైఎస్సార్ హయంలో పేదలకు ఆరోగ్యశ్రీ, రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇల్లుల నిర్మాణం, ఉచిత విద్యుత్ అమలు చేసి ఆదుకున్నారని రేవంత్ గుర్తు చేశారు. మంత్రి దయాకర్ దండుపాళ్యం ముఠా దోపిడీలకు పాల్పడుతోందనీ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలో పేరులోనే ధర్మం తప్ప అంత దందాలే చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అంజయ్యకుమార్ యాదవ్, పరకాల నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి నాయకులతో కలిసి మెడికో ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

'ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాది'

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు, ఫలితాల సాధనకు ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాదులు వేస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యకమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రణాళిక, అర్థగణాంక శాఖ ఉన్నతాధికారులు, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్(సీఈజీఐఎస్) కాకతీయ గవర్నెన్స్ ఫెలో(కేజీఎఫ్)లతో వినోద్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రణాళిక శాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్రంలో కీలకమైన ప్రణాళిక, అర్థగణాంక , సీజీఎస్, కేజీఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

పోలీస్ వాహనాన్ని ఆపి | భైరి నరేశ్‌పై దాడి

- బీజేపీకి, హిందూత్వకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదని బెదిరింపు
- హన్మకొండ పీఎస్‌లో ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు



పోలీస్ వాహనంలోకి చొరబడి దాడి చేస్తున్న వ్యక్తులు

వరంగల్ క్రైం: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేశ్‌పై హన్మకొండలో మూకుమ్మడి దాడి జరిగింది. హన్మకొండ ఆదర్శ కళాశాలలో లా చదువుతోన్న భైరి నరేశ్ సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అతనిపై దాడి జరగనుందని పోలీసులకు అందిన సమాచారంతో వాహనంలో తరలిస్తుండగా కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి ఆపారు. హిందూత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే క్షమించేది లేదంటూ నినాదాలు చేస్తూ పోలీస్ వాహనం లోపలికి చొరబడి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో భైరి నరేశ్‌తోపాటు సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్యుత్ రాజ్ ఉన్నారు. దాడి అనంతరం పోలీసులు భైరి నరేశ్‌ను హన్మకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనాన్ని అడ్డగించి దాడి చేయడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు వేట ప్రారంభించారు.

దాడి సమాచారం తెలిసే పోలీసులను ఆశ్రయించాను

ఆదర్శ లా కళాశాలలోని అంబేడ్కర్ భవన్‌లో ఎదురుగా ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ, ఆర్‌ఎస్ఎస్, భజరంగ్ దళ్, ఏబీవీపీ కార్యకర్తలు నాపై దాడి చేయడానికి ఉన్నారని తెలిసి పోలీసులకు సమాచారం ఇచ్చాను. పోలీసు వాహనంలో బయల్దేరిన నన్ను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వెంబడించి అడ్డుకుని దాడి చేశారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ అందరికీ ఉంది. నాపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం.

–భైరి నరేశ్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు

నిందితులపై కేసు నమోదు చేస్తున్నాం..

సుబేదారి ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసు వాహనాన్ని అడ్డగించి వాహనంపై దాడి చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి, అందులో ఉన్న భైరి నరేశ్‌పై దాడి చేసిన నిందితుల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. చట్టపరంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

– శ్రీనివాస్‌జీ, హన్మకొండ ఇన్‌స్పెక్టర్

మై బిగ్గెస్ట్ చీర్ లీడర్

- మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- సమానత్వం పై ప్రచారం
- అడిషనల్ డీజీ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా భద్రత విభాగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మై బిగ్గెస్ట్ చీర్‌లీడర్'పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా తమ జీవితాల్లో సమానత్వం నింపి, ప్రోత్సహించిన వ్యక్తుల గురించి పరిచయం చేయాలని భద్రత విభాగం ఇంచార్జి, అడిషనల్ డీజీ శిఖాగోయల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ట్వీట్ పెట్టారు. మై బిగ్గెస్ట్ చీర్ లీడర్ పేరిట నిర్వహిస్తున్న ఈ ఆన్‌లైన్ ప్రచారంలో భాగస్వాములు కావాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మహిళా భద్రత విభాగం ట్విట్టర్ ఖాతాలో వీడియో లేదా ఫొటోను జత చేయాలని కోరారు. అదేవిధంగా మరో ముగ్గురిని ట్యాగ్ చేయాలని సూచించారు. ఇలా వచ్చే వీడియోల నుంచి ఉత్తమమైనవి ఎంపిక చేసి, వాళ్లను సన్మానించనున్నట్టు తెలిపారు.

మా నాన్నే నా చీర్‌లీడర్..

అడిషనల్ డీజీ షికా గోయల్ బిగ్గెస్ట్ చీర్ లీడర్ వీడియోలో మాట్లాడుతూ 'నా బిగ్గెస్ట్ చీర్ లీడర్ మా నాన్నే. నాపై నాకంటే మా నాన్నకే ఎక్కువ నమ్మకం ఉండేది. అత్యంత కఠినమైన ఈ పోలీస్‌జాబ్‌లో చేరడంలోనూ ఆయనే కీలకం. సివిల్స్ రిజల్ట్ వచ్చిన రోజు నాకు ఇంకా గుర్తుంది. "ఏం సందేహపడకు..నువ్వు కచ్చితంగా ఈ వృత్తిలో రాణిస్తావు". అని ప్రోత్సహించారు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉండేలా చేసినందుకు నాన్నా నీకు కృతజ్ఞతలు. ఇంట్లో మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లను సమానంగా చూసినందుకు కూడా మీకు కృతజ్ఞతలు చెబుతున్నా..నా మాదిరిగానే మీ జీవితంలోనూ ఒక బిగ్గెస్ట్ చీర్ లీడర్ ఉండే ఉంటారు. వారి గురించి మాకు చెప్పండి'అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీ మెచ్చిన పంచాయతీ

- ఓడీఎఫ్ ప్లస్‌గా.. ముఖరా(కె)
- జాతీయస్థాయిలో గుర్తింపు
- మార్చి4న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కె) పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు అన్న గాంధీజీ మాటలను నిజం చేసిన ఈ పంచాయతీని ఢిల్లీ (కేంద్ర ప్రభుత్వం) మెచ్చి అవార్డుకు ఎంపిక చేసింది. ఏడు వందల జనాభా ఉన్న గ్రామంలో 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇంటింటికీ మరుగుదొడ్డితో పాటు సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా రికార్డు కెక్కింది. తాజాగా జాతీయస్థాయి గుర్తింపు సైతం దక్కించుకుంది. ఈమేరకు మార్చి 4న రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచ్ మీనాక్షి అవార్డు అందుకోనున్నారు.



ముఖరా(కె)లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు

నంబర్‌వన్‌గా..

సాధారణంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు వందశాతం పూర్తయితే ఆ గ్రామాన్ని ఓడీఎఫ్‌గా పరిగణిస్తారు. వీటితోపాటు ఇతర అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తించి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లాలో మొదటి గ్రామంగా ఎంపికైన ముఖరా(కె) రాష్ట్రస్థాయిలో సైతం నంబర్‌వన్‌గా నిలిచింది.

సంతోషంగా ఉంది

మా పంచాయతీకి జాతీయస్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకునే అవకాశం దక్కడం మరింత అదృష్టంగా భావిస్తున్నా. ఒక మహిళా సర్పంచ్‌గా గర్వంగా కూడా ఉంది. గ్రామస్తులందరి సహకారంతోనే ఇది సాధ్యమైంది.

గాడ్గే మీనాక్షి, సర్పంచ్, ముఖరా(కె)

ఐదు అంశాల్లో ప్రత్యేకత..

ముఖరా (కె) పంచాయతీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాల్లో ఐదు అంశాల్లో ప్రత్యేకంగా నిలిచింది. పచ్చదనం– పరిశుభ్రత, సోషల్ సెక్యూరిటీ, కార్బన్ న్యూట్రల్, వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు వంటి అంశాల్లో వందశాతం అమలు చేసి టాప్‌లో నిలిచింది.

ఆదర్శంగా నిలుస్తూ..

- వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలతో పాటు ఆకట్టుకునే పల్లెప్రకృతి వనం, రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం ఈ గ్రామం ప్రత్యేకత.
- గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా 50వేల మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టి రికార్డులోకి ఎక్కింది ఈ పంచాయతీ.
- డిజిటల్ లిటరసీలోనూ అగ్రస్థానం సాధించింది. 2016 సంవత్సరంలో పెద్దనోట్ల రద్దుతో దేశమంతా ఇబ్బందులు పడినా ఈ గ్రామస్తులు మాత్రం వాటిని అధిగమించారు. వందశాతం నగదు రహిత గ్రామంగా నిలిచారు. పేటీఎం, స్వైపింగ్ మిషన్లు, రూపే కార్డులద్వారా లావాదేవీలు జరిపి వందశాతం డిజిటల్ అక్షరాస్యత సాధించి జాతీయస్థాయిలో టాప్‌గా నిలిచారు.
- తడి, పొడి చెత్త సేకరణ ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి రాష్ట్రంలోనే మొదటి గ్రామంగా నిలిచింది ఈ పంచాయతీ.
- సేంద్రియ ఎరువు ద్వారా వచ్చిన ఆదాయంతో పంచాయతీ కార్యాలయంపై ఐదు మెగావాట్లతో సోలర్ విద్యుత్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ విద్యుత్‌ను గ్రామంలో లైట్లు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. కరెంట్ బిల్లు ఆదా చేసుకోవడంలో రాష్ట్రంలోనే తొలి గ్రామంగా గుర్తింపు పొందింది.
- గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామం పయనిస్తుంది. మద్యం అమ్మకాలతో పాటు మాంసహారాన్ని నిషేధించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి రెండేళ్లు..!



ట్రయల్‌రన్‌లో ఉత్పత్తి అయిన యూరియా



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తున్న ప్రధాని మోదీ

- తెలంగాణలో తీరిన యూరియా కొరత
- భారత్ బ్రాండ్ పేరుతో మార్కెట్‌లోకి..
- సాంకేతిక సమస్యలతో తగ్గిన ఉత్పత్తి

ఫెర్టిలైజర్‌సిటీ: మూతపడిన.. ఉత్పత్తిలో వెనుకబడిన కర్మాగారాలను పునరుద్ధరించి ఎరువులను తయారు చేయాలనే సంకల్పంతో మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 2021 ఫిబ్రవరి 28న ట్రయల్ రన్ ద్వారా ఉత్పత్తిని చేపట్టారు. 2021మార్చి23 నుంచి వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించారు. ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ప్రతిరోజు 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి అవుతోంది.

ఫిబ్రవరి వరకు 7,22,244.87 టన్నుల ఉత్పత్తి

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 01 ఏప్రిల్ 2022 నుంచి 26 ఫిబ్రవరి 2023 వరకు 7,22,244.87 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది. 2022 – 23 మొదటి ఆర్థిక సంవత్సరంలో 5,19,689.25 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కాగా 01 అక్టోబర్ 2023 నుంచి ఫిబ్రవరి 21 వరకు సాంకేతిక సమస్యలతో ప్లాంట్ షట్‌డౌన్‌లో ఉండడంతో 2,02,555.62 ఉత్పత్తి చేశారు. ఈ కర్మాగారాన్ని నవంబర్ 12 ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న యూరియాను కిసాన్ బ్రాండ్ నుంచి భారత్ బ్రాండ్‌గా మార్చి.. మార్కెట్‌లోకి సరఫరా చేస్తున్నారు.

దేశీయ ఎరువులతో తగ్గిన దిగుమతులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఆర్‌ఎఫ్‌సీఎల్, సింద్రియా, గోరఖ్‌పూర్, తాడ్చల్ కర్మాగారాల్లో యూరియా ఉత్పత్తి ప్రారంభించడంతో దేశీయంగా ఎరువుల కొరత తీరిపోయింది. రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాలో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి.. మిగిలిన 50 శాతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు.

పులిదాడి మృతులకు పరిహారం పెంపు

- రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు..
- పశువులకు రూ.10వేల నుంచి రూ.50 వేలు చెల్లింపు
- రాష్ట్రంలో తునికాకు సేకరణ కూలీలకు రూ.100 కోట్ల రాయల్టీ మంజూరు
- అడవులను కాపాడినప్పుడే మనకు ఫలాలు
- రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



గంగవ్వకు రూ.83 వేల చెక్కును అందజేస్తున్న మంత్రి ఐకే రెడ్డి, పక్కన కలెక్టర్ హేమంత్ బోర్కడే

దహెగాం/చింతలమానెపల్లి: పులి దాడిలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్న రూ.5లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు, పశువులకు రూ.10 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రకటించారు. కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండల కేంద్రంతోపాటు దహెగాం మండలం లగ్గాం గ్రామ సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో తునికాకు సేకరణ కూలీలకు రాయల్టీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడవులను పెంచేందుకు తెలంగాణకు హరితహారం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 267 కోట్ల మొక్కలు నాటామని తెలిపారు. అడవులు ఉండడంతోనే జిల్లా ప్రజలు తునికాకు సేకరించారని పేర్కొన్నారు. 50 ఆకుల కట్ట ధరను రూ.3లకు పెంచుతామని తెలిపారు. రాష్ట్రంలో తునికాకు సేకరణ కూలీలకు రూ.100 కోట్ల రాయల్టీ మంజూరైనట్లు తెలిపారు.

పోడు భూముల సమస్య పరిష్కరిస్తాం

తెలంగాణ వ్యాప్తంగా పోడు భూముల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు రైతులకు అండగా ఉన్నారని తెలిపారు. సర్వే పనులు పూర్తయిన అనంతరం రైతులకు పోడు భూముల పట్టాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్, సీసీఎఫ్ వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు.

బీ–థర్మల్‌లో నిలిచిన ఉత్పత్తి



బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం

- ఆదివారం అర్ధరాత్రి పునరుద్ధరణ.. సోమవారం వేకువజామున ట్రిప్..
- జనవరిలో ఆరుసార్లు.. ఈనెల మూడుసార్లు ఉత్పత్తికి బ్రేక్

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం వేకువజామున మరోసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఆదివారం అర్ధరాత్రి ఉత్పత్తిని పునరుద్ధరించిన నాలుగు గంటల వ్యవధిలోనే మరోసారి ట్రిప్ అయింది. రెండునెలలుగా బాయిలర్, టర్బయిన్‌లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోతోంది. జనవరిలో ఆరుసార్లు, ఈనెల మూడుసార్లు బాయిలర్ ట్యూబ్స్ లీకేజీ, టర్బయిన్‌లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోవడంతో నిర్వహణ వ్యయం భారంగా మారుతోంది. జనవరి 26 నుంచి విద్యుత్‌సౌధ అధికారులు బీ థర్మల్‌కు బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ కేంద్రం ఒక్కసారి షట్‌డౌన్ అయి తిరిగి ఉత్పత్తి దశలోకి రావాలంటే కనీసం రూ.25 లక్షల వ్యయం అవుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు. ఇలా వారానికోసారి సమస్య ఏర్పడడంతో బొగ్గు, ఆయిల్ నిల్వలు అడుగంటినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మరో వారానికి సరిపడా బొగ్గు మాత్రమే ఉండడం.. ఒక్కసారి పునరుద్ధరణకు మాత్రమే ఆయిల్ ఉండడంతో మరోసారి ట్రిప్ అయితే ఎలా అని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

'ఖని' కళాకారుడికి వివేకానంద జీవిత సాఫల్య పురస్కారం



రమణయ్యను సత్కరిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

కోల్‌సిటీ:గోదావరిఖనికి చెందిన సీనియర్ కళాకారుడు కనకం రమణయ్యను హైదరాబాద్‌లోని వల్లూరి ఫౌండేషన్ స్వామి వివేకానంద జీవిత సాఫల్య అవార్డుతో సత్కరించింది. కళారంగంలో 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న రమణయ్య సింగరేణి సంస్థలో పని చేస్తున్నారు. ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ, వల్లూరి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు దార శ్రీనివాస్, తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అధ్యక్షుడు కృపాదానం తదితరులు రమణయ్య సేవలను కొనియాడారు. ఆయనను శాలువా, మెడల్, అవార్డుతో సన్మానించారు. ఓసీపీ–3 ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, మేనేజర్ రమేశ్ కుమార్ పలువురు అభినందించారు.

● జంగిల్ రాణి



పద్మిని మారీ

అడవిని చేరాలంటే ఆమెను దాటాలి

చేత గొడ్డలి కళ్లల్లో తీక్షణత
'అడవికి నేను కాపలా' అనే ప్రకటన.
65 ఏళ్ల పద్మిని మారీ
ఒరిస్సాలో తన పల్లె చుట్టూ ఉన్న
100 హెక్టార్ల అడవిలో పుల్ల కూడా పోకుండా
ఒక్క కొమ్మా తెగి పడకుండా కాపలా కాస్తోంది.
కలప మాఫియా ఆమె దెబ్బకు తోక ముడిచింది.
అందుకే ఆమెను ఆ ప్రాంతంలో
జంగిల్ రాణి అని పిలుస్తుంటారు.

ఉదయం ఆరూ ఆరున్నరకంతా పద్మిని మారీ ఇంటి పనులన్నీ అయిపోతాయి. ఆ తర్వాత ఆమె తన అసలైన ఇంటికి బయలుదేరుతుంది. అంటే దాపున ఉన్న అడవికి. అదే ఆమె రోజంతా గడిపే ఇల్లు.

ఒరిస్సాలోని నౌపడా జిల్లాలో బిర్సింగ్‌పూర్ అని చిన్న పల్లె ఆమెది. ఆ పల్లెకు ఆనుకునే చిన్న కొండ. దాని చుట్టుపక్కల విస్తారమైన అడవి. అందులో చాలా విలువైన కలప చెట్లు, మందు మొక్కలు, అడవి పళ్లు అన్నీ దొరుకుతాయి.

'మేము అడవి మీద ఆధారపడి బతుకుతాము. అడవిని నరికి, అడవిలో ఉండే జంతువులను చంపి కాదు'.. అంటుంది పద్మిని.

కిరాసాగర్ మారీ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుని ముప్పై ఏళ్ల క్రితం ఆ అడవి పక్క ఊరికి కోడలిగా వచ్చింది పద్మిని. అడవికి వెళ్లి వంట చెరుకు, తేనె, దుంపలు... ఇవన్నీ తెచ్చుకుని బతకడం తొందరగా నేర్చుకుంది.

'కాని అడవిలో ఆ రోజుల్లో కలప దొంగలు విచ్చలవిడిగా తిరిగేవారు. వేటగాళ్లు ఉండేవారు. వారి వల్ల అడవి నాశనమవుతోందని నాకు అర్థమైంది. అడవి పచ్చగా ఉంటే మేము పచ్చగా ఉంటాము. అడవి ఉంటేనే వానలు పడతాయని మా నాన్న నా చిన్నప్పుడు చెప్పేవాడు. అందుకే అడవిని కాపాడాలనుకున్నా' అంటుందామె.

తనకు తానుగా వేసుకున్న ఈ డ్యూటీని పాతికేళ్లు గడిచినా ఆమె వదల్లేదు. రోజూ ఉదయం ఆరున్నరకంతా భుజాన గొడ్డలి వేసుకొని అడవిలోకి బయలుదేరుతుందామె. పుట్టి బుద్ధెరిగాక ఆమె చెప్పులు వేసుకోలేదు. ఇన్నాళ్లుగా ఆమె అడవిలో ఉత్త పాదాలతోనే తిరుగుతుంది. అడవిలోని

> **నన్ను చూడగానే చాలామంది పారిపోతారు. అడ్డం తిరిగితే పెద్దగా అరిచి ఊరివాళ్లు సాయం వచ్చేలా చేస్తాను. ఊర్లోకి తీసుకెళ్లి వాణ్ణి కట్టేస్తాం. వాడు క్షమాపణలు చెప్పి మళ్లీ అడవి ముఖం చూడను అని ప్రమాణం చేస్తే వదిలేస్తాం.**

ప్రతి అడుగు తెలిసినవారే ఉత్త పాదాలతో తిరగ్గలరు. అడవిని ఆమె ఐదారు భాగాలుగా చేసుకుంది. ఒకోరోజు ఒకో భాగంలో తిరుగుతుంది. దారిలో తనకు కనపడిన ఎండుపుల్లల్ని ఒకచోటకు చేరుస్తుంది. అడ్డంగా ఉన్న కొమ్మలను, తీగలను కొట్టి దారి చేస్తుంది. నిన్న ఉన్న అడవే ఇవాళా ఉందా అని చెక్ చేస్తుంది. ఇక పరాయి వ్యక్తి ఎవరైనా కనిపించాడో గొడ్డలి చేతికందుకుంటుంది.

'మొదట వాణ్ణి భయపెడతాను. నన్ను చూడగానే చాలామంది పారిపోతారు. అడ్డం తిరిగితే పెద్దగా అరిచి సాయం వచ్చేలా చేస్తాను. ఊరి వాళ్లు ఎవరో ఒకరు అడవిలో తిరుగుతూనే ఉంటారు. వారొచ్చి పట్టుకుంటారు. ఊర్లోకి తీసుకెళ్లి వాణ్ణి కట్టేస్తాం. వాడు క్షమాపణలు చెప్పి మళ్లీ అడవి ముఖం చూడను అని ప్రమాణం చేస్తే వదిలేస్తాం. అడవిలో రోజూ నేను తిరుగుతానని ఎదురు పడతానని కలప దొంగలకు, వేటగాళ్లకు తెలిసిపోయింది. అందుకే రావడం మానేశారు. మా అడవి మాకు మిగిలింది' అంటుంది పద్మిని.

ఇన్నేళ్లుగా ఆమె ఒక పైసా ఎవరి నుంచి ఆశించకుండా, ఏ జీతం తీసుకోకుండా ఈ పని చేస్తున్నందు వల్ల ఊళ్లో పద్మిని అంటే చాలా గౌరవం. ఆమెను జంగిల్ రాణి అని పిలుస్తారు. ఫారెస్ట్ రేంజర్లు, గార్డులు ఆమె కనిపిస్తే గౌరవంగా మాట్లాడతారు. 'నాకు జీతం ఎందుకు? ఇది ప్రతి మనిషి బాధ్యత' అంటుంది మారీ.

ఈ అడవి పచ్చగా ఉండటం వల్ల వీకెండ్స్‌లో విహారానికి వచ్చేవారి సంఖ్య ఎక్కువ. వారి ఆనందానికి కారణం ఒక బక్కపలచని ఆదివాసి మహిళ అని వారికి తెలియకపోవచ్చు. ఇలాంటి తెలియని మహానుభావుల వల్లే మన దేశంలో ప్రకృతి ఈ మాత్రమైనా మిగిలి ఉంది. ●



బ్యూటిప్

చర్మానికి చెరకు రసం

చెరకు రసంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతుంటాం. దీన్ని దాహం తీర్చుకోవడం కోసం మాత్రమే కాదు.. చర్మ ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరచుకోవడానికి ఉపయోగించుకోవచ్చు. దీనిలో గ్లైకోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మాన్ని ఎప్పుడూ యవ్వనంగా ఉండేలా చేస్తుంది. ఇందుకోసం ఏం చేయాలంటే...

మూడు టేబుల్ స్పూన్ల చెరకు రసంలో.. చెంచా పసుపు కలిపి ముఖానికి అప్లై చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకొంటే చర్మం కాంతిమంతంగా తయారవుతుంది.

ఇంటిప్స్

రుచికే కాదు.. శుభ్రతకు కూడా

టేబుల్ సాల్ట్ అంటే వంటల్లో ఉపయోగించే ఉప్పుతో రకరకాల ఉపయోగాలున్నాయి. అవేంటో చూద్దాం..

ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత, వెల్లుల్లి పొట్టును తీసిన తర్వాత చేతులు ఘాటైన వాసన కలిగి ఉంటాయి. కాబట్టి, చేతులను కొద్దిగా తడి చేసి, ఉప్పు వేసుకుని, రుద్ది , ట్యాప్ వాటర్‌తో కడిగితే సరి! వాసన పోతుంది.



పావు కప్పు నీళ్లలో స్పూన్ టేబుల్ సాల్ట్ వేసి బాగా కలపాలి. ఈ నీటితో మొటిమలను కడగాలి. అలా చేయడం వల్ల మొటిమలు ముడుచుకుపోతాయి. అంతేకాదు, ఉప్పు నీటితో పుక్కిలించడం వల్ల చిన్న చిన్న నోటి పుండ్లు నయం అవుతాయి.

కొందరికి అరికాళ్లలో చెమట పట్టి షూస్ నుంచి దుర్వాసన వస్తుంది. అలా వాసన రాకుండా ఉండాలంటే ఒక క్లాత్‌లో సాల్ట్ నింపి, షూలో చిలకరించాలి. రెండు మూడు గంటలు అలాగే ఉంచి తర్వాత తీసేస్తే షూస్ వాసన రాకుండా ఉంటాయి.



స్మరణ: నేషనల్ సైన్స్ డే

'ఆడపిల్లకు చదువులెందుకు!' అని అనుకునే రోజులవి.
ఆడపిల్ల ఇల్లు దాటి బడికి వెళితే అమితాశ్చర్యంగా చూసే రోజులవి.
అలాంటి రోజుల్లో జానకీ అమ్మాళ్ చదువుల్లో 'రాణి'ంచింది.
శాస్త్రరంగంలో విలువైన పరిశోధనలు చేసింది. నిరంతర స్ఫూర్తిగా నిలిచింది...

కాలాతీత స్ఫూర్తి



జానకీ అమ్మాళ్

కేరళలోని తలచ్చేరీలో 1897లో జన్మించింది జానకీ అమ్మాళ్. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మకమైన 'యూనివర్శిటీ ఆఫ్ మిషిగాన్' స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. 'బొటానికల్ సైన్స్'లో డాక్టరేట్ చేసిన తొలి భారతీయ మహిళగా జానకి చరిత్ర సృష్టించింది.

అమెరికాకు వెళ్లడానికి ముందు మద్రాస్, త్రివేంద్రమ్‌లలో బాటనీ ప్రొఫెసర్‌గా పని చేసింది.

అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత జన్యుశాస్త్ర విభాగంలో ఎన్నో పరిశోధనలు చేసింది.

చెరుకు మొక్కల జీవపరిణామ క్రమంపై ఆమె రాసిన 'క్రోమోజోమ్ అట్లాస్ ఆఫ్ కల్టివేటెడ్ ప్లాంట్స్' ఒక ప్రామాణిక పుస్తకం అయింది. అంతర్జాతీయ స్థాయిలో ఎందరో శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలిచింది.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (కోల్‌కతా)కు ప్రత్యేక అధికారిగా సేవలు అందించింది జానకి. రీజినల్ రీసెర్చ్ లేబొరేటరి (జమ్మూ), బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బొంబాయి), సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (బొంబాయి) గౌరవ శాస్త్రవేత్తగా సేవలు అందించింది. బొటానికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) కార్యదర్శి, గౌరవ అధ్యక్షురాలిగా, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఉపాధ్యక్షురాలిగా పనిచేసింది.

జానకి వృత్తి జీవితం ఎంత స్ఫూర్తిదాయకంగా ఉండేదో వ్యక్తిగత జీవితం కూడా అంతే స్ఫూర్తిదాయకంగా ఉండేది. పిల్లలతో చాలా సరదాగా గడిపేది. వారికోసం ఎన్నో పుస్తకాలు తెచ్చేది. పిక్నిక్‌కు తీసుకెళ్లి సరదా కథలు, శాస్త్రీయ విషయాలు చెప్పేది. క్రమశిక్షణ విషయంలో మాత్రం స్ట్రిక్ట్‌గా ఉండేది.

భారతీయ శాస్త్ర దిగ్గజాలలో ఒకరైన జానకి అమ్మాళ్ ప్రయాణం నల్లేరు మీద నడక కాదు.

పురుషాధిపత్య భావజాలం ఆమెను ఇబ్బంది పెట్టేది. తన సూచనలు, సలహాలను సాటి ఉద్యోగులు పట్టించుకునేవారు కాదు. 'బొటానికల్ సొసైటీ ఆఫ్ ఇండియా'ను కొత్త కాంతితో పునర్‌వ్యవస్థీకరించాలనే జానకి కలను నెరవేరకుండా చేయలని కొందరు అడ్డుపడ్డారు. ఈ విషయం జానకిని చాలా బాధ పెట్టింది.

ఎనభై ఏళ్ల వయసులో ఆమెకు పద్మశ్రీ వచ్చింది. తన ప్రతిభకు తగిన గౌరవం దక్కలేదని విమర్శ ఉంది.

అయితే పురస్కారాలపై ఆమె ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. తన తపనంతా శాస్త్ర పరిశోధనపైనే!

'చేసిన కష్టం ఎప్పుడూ వృథా పోదు. మనం చేసిన పని నిలబడుతుంది' అనేది జానకీ అమ్మాళ్. ఆ మాట అమ్మాళ్ విషయంలో అక్షరాలా నిజమైంది.

గత సంవత్సరం నవంబర్‌లో 'క్రోమోజోమ్ ఉమెన్–నొమాడ్ సైంటిస్ట్: ఇకే జానకీ అమ్మాళ్' అనే పుస్తకం విడుదలైంది. అనేక సంవత్సరాల పరిశోధన తరువాత సావిత్రి ప్రీత నాయర్ ఈ పుస్తకం రాసింది. 650 పేజీల ఈ పుస్తకం జానకీ అమ్మాళ్ జీవితంపై వచ్చిన సమగ్ర పుస్తకంగా పేరు తెచ్చుకోవడమే కాదు శాస్త్రరంగంలో అడుగు పెట్టాలని, అపూర్వ విజయాలు సాధించాలనుకునేవారికి ఎంతో స్ఫూర్తి ఇస్తోంది.

డ్రాగన్ ఫ్రూట్‌తో పసందైన పానీయం



- బెంగళూరులోని ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తల రూపకల్పన
- సింథటిక్ పదార్థాలు కలపని ఈ పానీయం 6 నెలలు నిల్వ ఉంటుంది.
- డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో విలువ జోడింపుతో రైతులకు మేలు

డ్రాగన్ ఫ్రూట్‌ను పండుగా, పండ్ల నుంచి అప్పటికప్పుడు తీసిన తాజా రసం తీసుకోవటమే ఇప్పటి వరకు మనకు తెలుసు. అయితే, నెలల పాటు నిల్వ ఉంచి ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగడానికి సిద్ధంగా ఉండే డ్రాగన్ ఫ్రూట్ పానీయం మార్కెట్‌లో అందుబాటులో లేదు. ఈ కొరత తీర్చే కొత్త సాంకేతికతను బెంగళూరులోని ఐసిఏఆర్ అనుబంధ సంస్థ భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు ఇటీవల రూపొందించారు. డ్రాగన్ ఫ్రూట్స్‌లో ఎరుపు–గుజ్జు (హైలోసెరియస్ పాలీరైజస్), తెల్ల గుజ్జు (హైలోసెరియస్ ఉండటస్) రకాలు ఉంటాయి. ఈ రెండు రకాలతోనూ రెడీ–టు–సర్వ్ (ఆర్.టి.ఎస్.) పానీయాల తయారీ సాంకేతికతను ఐఐహెచ్ఆర్ అభివృద్ధి చేసింది. గుజ్జు రంగును బట్టి పానీయం రంగు వేరుగా ఉంటుంది.

డ్రాగన్ ఫ్రూట్‌ను పిటయ/కమలం అని కూడా పిలుస్తారు. ఇది కాక్టేసి కుటుంబానికి చెందినది. మలేసియా, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేసియా, చైనా దేశాల్లో విస్తారంగా పండించే డ్రాగన్ ఫ్రూట్ సాగు ఇటీవల సంవత్సరాల్లో మన దేశంలోనూ విస్తరిస్తోంది. దేశంలో దాదాపు 3 వేల హెక్టార్లలో సాగవుతోందని అంచనా. ఈ పండ్లకు నానాటికీ పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, వచ్చే ఐదేళ్లలో దాని సాగును 50 వేల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతం, మార్కెట్‌లో పండ్లను రూ. 150–200/ కేజీకి విక్రయిస్తున్నారు. ప్రధానంగా దీన్ని టేబుల్ ఫ్రూట్‌గా, సలాడ్‌గా వాడుతున్నారు. జ్యూస్ దుకాణాలు, రెస్టారెంట్లలో తాజా రసాన్ని వినియోగిస్తున్నారు. మన దేశంలో ప్రస్తుతం ఇ–ప్లాట్‌ఫామ్‌లలో కూడా వాణిజ్య పరంగా ప్యాక్ చేసిన రూపంలో డ్రాగన్ ఫ్రూట్‌తో తయారైన తాగడానికి సిద్ధంగా ఉన్న పానీయం అందుబాటులో లేదు. డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో విలువ జోడింపుతో రైతులకు మేలు కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు.

సహజ రంగు, రుచి యథాతథం

ఈ పండ్లలో పాలీఫెనాల్స్, బీటాలైన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి జీవన శైలి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రసిద్ధి చెందాయి. ఇందులో చిన్న విత్తనాలు, జిగట స్వభావం ఉండే దాని గుజ్జు ప్రత్యేకమైనవి. ఏ ఇతర పండ్లలోనూ ఈ విధంగా ఉండవు. అందువల్ల ఈ ఫ్రూట్‌తో నిల్వ ఉంచి తాగే వీలున్న పానీయాన్ని తయారు చేయడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు డ్రాగన్ ఫ్రూట్ పానీయాన్ని తీసే సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో విత్తనాలు, జిగట పదార్థాన్ని తొలగిస్తారు. కానీ దాని విలక్షణమైన రంగు, రుచి దెబ్బతినకుండా చూశారు. ఈ సహజ పానీయం విటమిన్ సి, పాలీఫెనాల్స్, బీటాలైన్స్‌తో కూడిన ఎరుపు రంగు సహజ ద్రవ్యంతో నిండి ఉంటుంది. ప్రకాశవంతమైన గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్ పానీయం వినియోగదారులకు చక్కటి తేలిక పాటి రుచిని, పోషకాలను అందిస్తుంది. ఈ పానీయం ఆరు నెలల పాటు నిల్వ ఉంటుంది. రుచి లేదా రంగుల కోసం సింథటిక్ పదార్థాలను కలపలేదు. ఈ పండు ప్రత్యేకమైన సహజ రుచిని ఇప్పుడు పానీయాల రూపంలో ఎవరైనా, ఎప్పుడైనా ఆస్వాదించవచ్చు. సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ మార్కెట్‌లో డ్రాగన్ పండ్ల ధర తగ్గిపోకుండా చూడటానికి, పండ్ల రూపంలోనే కాకుండా పానీయం రూపంలో కూడా స్థానికంగా ఏడాది పొడవునా అందుబాటులో తేవడానికి, ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు రూపొందించిన సాంకేతికత ఉపయోగపడుతుంది. తద్వారా డ్రాగన్ ఫ్రూట్ రైతులు స్థిరంగా మంచి ఆదాయాన్ని అందుకోవటానికి వీలవుతుందని చెప్పొచ్చు.

> **డ్రాగన్ పానీయాన్ని రూపొందించే సాంకేతికతను నామమాత్రపు ఫీజు చెల్లించి పండ్ల రసాల ఉత్పత్తిదారులు, సంస్థలు ఐఐహెచ్ఆర్ నుంచి పొందవచ్చు.**

డ్రాగన్ పానీయాన్ని రూపొందించే సాంకేతికతను నామమాత్రపు ఫీజు చెల్లించి పండ్ల రసాల ఉత్పత్తిదారులు, సంస్థలు ఐఐహెచ్ఆర్ నుంచి పొందవచ్చు. ఇతర వివరాలకు.. ఐఐహెచ్ఆర్ (బెంగళూరు) ప్రధాన శాస్త్రవేత్త డా. కరుణాకరన్ (94832 33804), సీనియర్ శాస్త్రవేత్త డా. పుష్ప చేతన్ కుమార్ (83106 08595)లను కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చు.

సాగుబడి

శతభిష కార్తె: మార్చి 4 వరకు
పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

నల్ల తామర తీవ్రత రసాయన సాగుతో పోల్చితే
ప్రకృతి సాగులో 10 శాతమే!



నల్ల తామర.. మిర్చి రైతులకు నిద్ర లేకుండా చేస్తున్న పురుగు ఇది. నల్లతామర తదితర చీడపీడల తీవ్రత ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తున్న రైతు సాధికార సంస్థ (ఆర్.వై.ఎస్.ఎస్.) క్షేత్ర స్థాయి సిబ్బంది గుంటూరు జిల్లాలోని 20 గ్రామాల్లో ఎంపిక చేసిన రైతుల మిరప తోటలను అనుదినం గమనిస్తున్నారు. అయితే, అన్ని పొలాల్లోనూ ఈ పురుగు దాడి ఒకేలా లేదు. సాగు పద్ధతిని బట్టి ఈ పురుగు తీవ్రతలో ఒకటికి పది రెట్లు వ్యత్యాసం కనిపిస్తోంది. రసాయనాలు వాడే మిరప తోటల్లో కనిపించే నల్ల తామర పురుగుల సంఖ్యలో కేవలం 10% మాత్రమే ప్రకృతి సాగులో ఉన్న మిరప తోటల్లో కనిపిస్తున్నా యని లాం గ్రామంలో ఇటీవల జరిగిన క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడైంది.

రసాయనాలు వాడుతున్న మిరప తోటల్లో పువ్వుకు 20–30 నల్లతామర పురుగులు కనిపిస్తే.. పక్కనే ప్రకృతి సేద్యపు మిరప తోటలో పువ్వుకు 3 పురుగులు కనిపించాయి.

ప్రకృతి సేద్యం ఇలా..

మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న లాం గ్రామం రైతు జి. శేషు రెడ్డి తన పొలంలో మిర్చి పంటకు ముందు (పీఎండీఎస్) 14 రకాల విత్తనాలు చల్లారు. 45 రోజులకు ఆ పంటను కోసిన తర్వాత మిర్చి మొక్కలు నాటారు. మిర్చిలో కొత్తిమీర, బీట్‌రూట్, టమాటా, బీన్స్‌ను అంతర పంటలుగా వేశారు. బంతిని ఎరపంటగా వేశారు. దుక్కిలో ఘనజీవామృతంతోపాటు 12 సార్లు ద్రవ జీవామృతం పిచికారీ చేశారు. 2 సార్లు నీటి తడితో పాటు పారించారు. దశపర్ణి కషాయం 2 సార్లు, ఉల్లి కషాయం 2 సార్లు పిచికారీ చేశారు. 6 రకాల బయో పెస్టిసైడ్స్(బివేరియా బాసియానా, వెర్టిసిలియం లెకానియం, బిడి 500, మెటారైజియం, ట్రైకోడెర్మా విరిడే)ను 6 సార్లు పిచికారీ చేశారు. లాక్టిక్ ఆసిడ్ బాక్టీరియా ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ పొలంలో లేడీ బర్డ్ బీటిల్స్, తేనెటీగలు, జంపింగ్ స్పైడర్స్, డామ్‌సెల్ ఫ్లై వంటి మిత్రపురుగులు కనిపించాయి. మిరప పువ్వులలో సగటున 3 నల్ల తామర పురుగులు ఉన్నాయి. వచ్చే వారం పండు మిర్చి కోతలు ప్రారంభమవుతాయి.

ఖర్చు రూ. 18 వేలు.. దిగుబడి 20 క్వింటాళ్లు..

లాం గ్రామానికి చెందిన రైతులు జి.శేషురెడ్డి, కె.రామిరెడ్డి గత మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మిరప సాగులో వీరు ఎకరానికి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కషాయాలు, సొంతంగా తయారు చేసుకున్న జీవన పురుగుమందులను సైతం వాడుతున్నారు. ఇందుకుగాను వీరికి ఎకరానికి రూ. 18 వేల వరకు ఖర్చు అయ్యింది. తొలికోత త్వరలో కోయబోతున్నారు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల ఎండు మిర్చి దిగుబడి వచ్చే పరిస్థితి ఉందని సిఆర్‌పి గురవయ్య తెలిపారు.

రసాయన సేద్యం ఇలా..

లాం గ్రామంలో రసాయన వ్యవసాయం చేసే రైతు ఆర్.జోజప్ప మిరప పొలంలో అంతర పంటలు, ఎర పంట లేవు. రసాయనిక ఎరువులతో పాటు తరచుగా పురుగుమందులు చల్లుతున్నారు. ప్రతి మిరప పువ్వులో 20 నుంచి 30 వరకు నల్ల తామర పురుగులను ఆర్.వై.ఎస్.ఎస్. సిబ్బంది గమనించారు. మిరప తోట అంతటా కింది ముడత, పైముడతతో ఆకులు ముడుచుకు పోయాయి. మొజాయిక్ వైరస్ సోకిన మిరప మొక్కలు కూడా రెండు కనిపించాయి.

ఖర్చు రూ. 60 వేలు.. దిగుబడి 10 క్వింటాళ్లు..

జోజప్ప ఎకరానికి ఎరువులు, పురుగుమందులకే రూ. 60 వేల నుంచి 80 వేల వరకు ఖర్చుపెట్టారు. ఈ తోటలో నల్లతామర తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. పైముడత, కింది ముడత వల్ల పంట దిగుబడి ఎకరానికి 10 క్వింటాళ్లకు పడిపోయే పరిస్థితి నెలకొందని సిఆర్‌పి గురవయ్య(99484 55728) తెలిపారు.



డా.ఖాదర్, ఉష దంపతులు

అసలు పని ఇప్పుడే మొదలైంది!

> **పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలితో 'సాక్షి' ముఖాముఖి**

స్వతంత్ర శాస్త్రవేత్త, సిరిధాన్యాల ప్రచారకర్త డా. ఖాదర్ వలి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డా. ఖాదర్, ఉషా ఖాదర్ దంపతులతో 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు ఇటీవల ముచ్చటించారు. దాదాపు గంటసేపు జరిగిన ముఖాముఖిలో కొన్ని ముఖ్యాంశాలు.. మీ కోసం..

'ప్రపంచ ఆహార సంస్కృతి తల్లకిందులైంది. ఆహారం ప్రజల చేతుల్లోంచి కేంద్రీకృత కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. వాణిజ్యప్రయోజనాల కోసం పారిశ్రామికంగా ఉత్పత్తి చేసిన ఆహారోత్పత్తుల వల్ల మన పొట్టలో మేలు చేసే సూక్ష్మజీవ రాశి నశించిపోయింది. ఆహారంలో రసాయనాలకు తోడు రసాయనాలతో కూడిన ఔషధాల వినియోగం పెరిగిపోవటం వల్ల ఈ ఉపద్రవం జరిగింది. ఆహారోత్పత్తి పద్ధతులు, ఆహార పదార్థాలు మారిపోయి అనారోగ్యకరమైన అంశాలను సంతరించుకున్నాయి.

కార్పొరేట్ సంస్థలు 70 ఏళ్లుగా నడిపిన ఆహార రాజకీయాల వల్ల ఆహార, ఆరోగ్య, పర్యావరణ పరంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రీకృత కార్పొరేట్ ఆహార రాజకీయాల్లో శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములుగా మారిపోయిన ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎరుకతో ఆలోచించాలి. వరి, గోధుమలు, పాలు, చక్కెర వంటి ఈ కాలపు ఆహార పదార్థాలలో అనారోగ్యం కలిగించే అంశాలు ఇమిడి ఉన్నాయని గ్రహించాలి. తమకు మేలు చేసే సిరిధాన్యాలను తిరిగి ఆహారంలోకి తెచ్చుకోవాలి. ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ.

భూతాపం పెచ్చుమీరుతున్న విపత్కర పరిస్థితుల్లో మెట్ట భూముల్లో గాలిలో తేమను పీల్చుకొని పెరిగే సి4 పంటలైన సిరిధాన్యాలే మానవాళికి దిక్కు. 8 బిలియన్ల జనాభాకే కాదు భవిష్యత్తులో 700 బిలియన్ల జనాభాకు కూడా ఆరోగ్యదాకమైన ఆహారాన్ని అందించే సత్తా సిరిధాన్యాలకు ఉంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించినందుకు కృతజ్ఞతలు. స్వదేశంలోనే ఉంటూ ప్రజ్ఞాపూర్వకంగా గ్రహించిన ఈ విషయాలను గత పాతికేళ్లుగా ప్రచారం చేస్తున్న నాకు ఈ పురస్కారం రావటం అధికారికంగా ఊతాన్నిచ్చిందని భావిస్తున్నాను. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకుంటున్న ప్రపంచ దేశాలు కలసికట్టుగా ఈ దిశగా కదిలితే వచ్చే రెండేళ్లలోనే పరిస్థితుల్లో గుణాత్మక మార్పు తేవటం సాధ్యమవుతుంది. సిరిధాన్యాలను జనబాహుళ్యం ప్రధాన ఆహారంగా మార్చే కృషిలో అసలు పని ఇప్పుడే మొదలైంది. యువతలో ఆహార–ఆరోగ్య సంబంధమైన ఎరుకను పెంపొందించేందుకు ఈ ఏడాది అధిక ప్రాధాన్యం ఇస్తాను..' అన్నారు డా. ఖాదర్.



డా.ఖాదర్, ఉషతో ముచ్చటిస్తున్న పంతంగి రాంబాబు

(డా. ఖాదర్ వలి, ఉష దంపతులతో 53 నిమిషాల ఇంటర్వ్యూ వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చెయ్యండి)



సెమీస్‌లో శ్రీకాంత్‌కు షాక్

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. పుణేలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 19-21, 13-21తో మిథున్ మంజునాథ్ (రైల్వేస్) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి (తెలంగాణ)-ట్రీసా జాలీ (కేరళ) జోడీ ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం 21-16, 21-18తో సిమ్రన్ -రితిక (మహారాష్ట్ర) జోడీపై నెగ్గింది.



గుజరాత్ జెయింట్స్ కెప్టెన్‌గా బెత్ మూనీ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ కెప్టెన్‌గా... భారత ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో తొలి డబ్ల్యూపీఎల్ జరగనుంది. 29 ఏళ్ల మూనీ ఇప్పటి వరకు 83 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడి 2 సెంచరీలు, 18 అర్ధ సెంచరీల సహాయంతో 2,380 పరుగులు చేసింది.

10 ఆలౌట్

- టి20 క్రికెట్‌లో 'ఐల్ ఆఫ్ మ్యాన్' జట్టు చెత్త రికార్డు
- 2 బంతుల్లో 2 సిక్సర్లతో స్పెయిన్ గెలుపు


స్పెయిన్ జట్టు

కార్టజెనా (స్పెయిన్): టి20లంటే ఎప్పుడు మెరుపులేనా? అప్పుడప్పుడు మలుపులుంటాయి... బౌలింగ్ దెబ్బలూ ఉంటాయి. బ్యాటర్లు, బ్యాటింగ్ జట్లే కాదు... పొట్టి క్రికెట్లో అరివీర భయంకర బౌలింగ్, బౌలర్లు కూడా తారెత్తిస్తారు. స్పెయిన్ జట్టు కూడా అదే పని చేసింది. 'ఐల్ ఆఫ్ మ్యాన్' అనే చిన్న ద్వీపదేశాన్ని క్రికెట్ చరిత్రలో నిలిచేంతగా దెబ్బ కొట్టింది. స్పానిష్ బౌలర్ల ధాటికి 11 మంది బరిలోకి దిగిన 'ఐల్ ఆఫ్ మ్యాన్' క్రికెట్ జట్టు అంతా కలిసి 10 పరుగులకే ఆలౌటైంది. ఇదో రికార్డు అయితే 11 పరుగుల లక్ష్యాన్ని స్పెయిన్ జట్టు రెండు సిక్సర్లతో పూర్తి చేయడం మరో విశేషం. అంటే 19.4 ఓవర్లు మిగిలుండగానే గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు 8.4 ఓవర్లలో 10 పరుగులకు కుప్పకూలింది. ఆరుగురు డకౌట్ కాగా, జోసెఫ్ (4) టాప్ స్కోరర్! స్పెయిన్ బౌలర్లలో మొహమ్మద్ కమ్రాన్, అతీఫ్ మెహమూద్ చెరో 4 వికెట్లు, బర్న్స్ 2 వికెట్లు తీశారు. అతీఫ్ 4 వికెట్లలో 'హ్యాట్రిక్' కూడా ఉంది. అతీఫ్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లోని తొలి మూడు బంతులకు ల్యూక్ వార్డ్, బియర్డ్, ఎడ్వర్డ్ వెబ్‌స్టర్ అవుటయ్యారు. 11 పరుగుల విజయ లక్ష్యాన్ని స్పెయిన్ బ్యాటర్ అవైస్ అహ్మద్ (12 నాటౌట్; 2 సిక్సర్లు) ఒక్కడే ముగించేశాడు. 'ఐల్ ఆఫ్ మ్యాన్' బౌలర్ జోసెఫ్ తొలి బంతి నోబాల్ వేయగా, 2, 3 బంతుల్ని అవైస్ భారీ సిక్సర్లుగా బాదాడు. 6 మ్యాచ్‌ల సిరీస్‌ను స్పెయిన్ 5-0తో కైవసం చేసుకుంది. వానతో రెండో టి20 రద్దయ్యింది. ఐల్ ఆఫ్ మ్యాన్ చెత్త రికార్డుతో రెండు రికార్డులు కనుమరుగయ్యాయి. అంతర్జాతీయ క్రికెట్లో చెక్ రిపబ్లిక్‌తో 2019లో జరిగిన పోరులో టర్కీ అత్యల్ప స్కోరు (21 ఆలౌట్) తెరమరుగైంది. ఇక ఓవరాల్ టి20 ఫార్మాట్‌లో అడిలైడ్ స్ట్రయికర్స్ ధాటికి సిడ్నీ థండర్స్ గత ఆగస్టులో 15 పరుగులకు ఆలౌటైన రికార్డు కూడా చెదిరిపోయింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)లో ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు 2017లో అసోసియేట్ సభ్య దేశంగా మారింది. 2018లో టి20 ప్రపంచకప్ యూరోప్ క్వాలిఫయింగ్ టోర్నీలో పోటీపడి ఆరో స్థానంలో నిలిచింది.

జొకోవిచ్ 'నంబర్‌వన్' రికార్డు

అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు



దుబాయ్: టెన్నిస్ చరిత్రలో ఏ ప్లేయర్‌కూ సాధ్యం కాని ఘనతను సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ సొంతం చేసుకున్నాడు. 1973 నుంచి టెన్నిస్‌లో కంప్యూటర్ ర్యాంకింగ్స్ మొదలయ్యాక అత్యధిక వారాలు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) తాజా ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ 6,980 పాయింట్లతో తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. దాంతో ఈ సెర్బియా స్టార్ నంబర్‌వన్ ర్యాంక్ హోదాలో 378 వారాలు పూర్తి చేసుకోవడం ఖాయమైంది. ఇప్పటి వరకు ఈ రికార్డు జర్మనీ దిగ్గజం, మహిళా స్టార్ స్టెఫీ గ్రాఫ్ పేరిట ఉంది. గ్రాఫ్ 377 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన ప్లేయర్‌గా 2021 మార్చిలోనే జొకోవిచ్ గుర్తింపు పొందాడు. స్విట్జర్లాండ్ మేటి రోజర్ ఫెడరర్ (310 వారాలు) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు. తాజాగా అటు పురుషుల విభాగంలోగానీ, ఇటు మహిళల విభాగంలోగానీ అత్యధిక వారాలు నంబర్‌వన్‌గా నిలిచిన ప్లేయర్‌గా ఈ సెర్బియా యోధుడు చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. 'మీరందరి ప్రేమాభిమానం కారణంగా నా కెరీర్‌లో ఎన్నో కొత్త ఘనతలు సాధించాను. తాజాగా అత్యధిక వారాలు నంబర్‌వన్‌గా నిలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించినందుకు చాలా ఆనందంగా ఉంది' అని దుబాయ్ ఓపెన్‌లో పాల్గొనేందుకు వచ్చిన 35 ఏళ్ల జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ 2011 జూలై 4న 24 ఏళ్ల 43 రోజుల ప్రాయంలో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ అయ్యాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన 28 ప్లేయర్లలో ఒకడైన జొకోవిచ్ రికార్డుస్థాయిలో ఏడుసార్లు సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించాడు.

అత్యధిక వారాలు అగ్రస్థానంలో నిలిచిన టాప్-5 ప్లేయర్లు

1. జొకోవిచ్	378 వారాలు
2. స్టెఫీ గ్రాఫ్	377 వారాలు
3. మార్టినా నవ్రతిలోవా	332 వారాలు
4. సెరెనా విలియమ్స్	319 వారాలు
5. రోజర్ ఫెడరర్	310 వారాలు

ఇంగ్లండ్ లక్ష్యం 258


విలియమ్సన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనలో ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమవుతోంది. రెండో టెస్టులో ఇంగ్లండ్ విజయానికి మరో 210 పరుగులు కావాలి. చేతిలో 9 వికెట్లున్నాయి. 258 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోయి 48 పరుగులు చేసింది. అంతకుముందు కివీస్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (132; 12 ఫోర్లు) వీరోచిత సెంచరీతో ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. ఫాలోఆన్‌లో 202/3 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 162.3 ఓవర్లలో 483 పరుగుల వద్ద ఆలౌటైంది. విలియమ్సన్ 29 పరుగులకు చేరుకోగానే రాస్ టేలర్ (7,682) రికార్డును అధిగమించి... న్యూజిలాండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...



న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) పురుషుల ప్రో లీగ్‌లో భాగంగా ప్రపంచ చాంపియన్ జర్మనీ, నాలుగో ర్యాంకర్ ఆస్ట్రేలియా జట్లతో జరిగే మ్యాచ్‌ల్లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రూర్కెలాలో జరిగే మ్యాచ్‌ల్లో మార్చి 10న జర్మనీతో... 12న ఆస్ట్రేలియాతో...13న జర్మనీతో... 15న ఆస్ట్రేలియాతో భారత జట్టు తలపడుతుంది.

భారత హాకీ జట్టు: హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), హార్దిక్ సింగ్ (వైస్ కెప్టెన్), పీఆర్ శ్రీజేశ్, జుగ్‌రాజ్ సింగ్, నీలం సంజీప్ జెస్, జర్మన్‌ప్రీత్ సింగ్, సుమిత్, మంజీత్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రబిచంద్ర సింగ్, విష్ణుకాంత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, షంషేర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, ఎస్. కార్తీ, సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, గుర్జంత్ సింగ్.

మోహన్ హర్షకు రజతం



సాక్షి, హైదరాబాద్: ఫజా అంతర్జాతీయ పారాథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అథ్లెట్ ఉయ్యాల మోహన్ హర్ష రజత పతకం సాధించాడు. టి47 కేటగిరీ 100 మీటర్ల పరుగులో మోహన్ హర్ష 11.26 సెకన్లలో లక్ష్యానికి చేరి రెండో స్థానంలో నిలిచాడు.

ఐసీసీ జట్టులో రిచా ఘోష్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో ముగిసిన మహిళల టి20 ప్రపంచకప్‌లో రాణించిన రిచా ఘోష్‌కు ఐసీసీ 'మోస్ట్ వాల్యుబుల్ టీమ్'లో చోటు దక్కింది. భారత జట్టు నుంచి ఒక్క రిచాకే ఈ టీమ్‌లో స్థానం లభించడం విశేషం. ఈ మెగా టోర్నీలో 19 ఏళ్ల రిచా... 31 నాటౌట్ (పాక్‌పై), 44 నాటౌట్ (వెస్టిండీస్‌పై), 47 నాటౌట్ (ఇంగ్లండ్‌పై) ఇన్నింగ్స్‌లతో మొత్తం 136 పరుగులు చేసింది. ఆరోసారి విశ్వవిజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు నుంచి అత్యధికంగా నలుగురు క్రికెటర్లు ఈ జట్టులోఎంపికయ్యారు.

ఫైనల్లో ఎస్‌ఆర్‌ఆర్, గౌతమ్ కాలేజీ జట్లు


ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ జట్టు

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ జూనియర్ విభాగంలో ఎస్‌ఆర్ ఆర్ కాలేజీ (మంచిర్యాల), గౌతమ్ జూనియర్ కాలేజీ (ఈసీఐఎల్) జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. సీనియర్ విభాగంలో వాగ్దేవి డిగ్రీ కాలేజీ (మంచిర్యాల), భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ (సైనిక్‌పురి) జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఫైనల్స్ నేడు జరుగుతాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాప సింగారంలోని బాబురావు సాగర్ మైదానంలో ఈ టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన జూనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ తొమ్మిది వికెట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ (వరంగల్)పై గెలిచింది. ముందుగా పాలిటెక్నిక్ కాలేజీ 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. అనంతరం ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ 7.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 89 పరుగులు చేసి గెలుపొందింది. ఎస్‌ఆర్‌ఆర్ ప్లేయర్ కృష్ణతేజ 25 బంతుల్లో 52 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గౌతమ్ జూనియర్ కాలేజీ 67 పరుగుల తేడాతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ (వరంగల్)ను ఓడించింది. ముందుగా గౌతమ్ కాలేజీ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేసింది. అన్విత్ రెడ్డి 16 బంతుల్లో 32 పరుగులు చేశాడు. అనంతరం పాలిటెక్నిక్ కాలేజీ 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 52 పరుగులకే పరిమితమై ఓడిపోయింది.

సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కాలేజీ ఎనిమిది వికెట్లతో ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీ (ఖమ్మం)పై నెగ్గింది. ముందుగా ఎస్‌ఆర్ బీజీఎన్‌ఆర్ కాలేజీ 10 ఓవర్లలో 9 వికెట్లకు 74 పరుగులు చేయగా... వాగ్దేవి కాలేజీ 6 ఓవర్లలో 2 వికెట్లకు 75 పరుగులు చేసి గెలిచింది. సాయి 16 బంతుల్లో 38 పరుగులు చేశాడు. సీనియర్ విభాగం రెండో మ్యాచ్‌లో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ ఐదు వికెట్లతో ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కాలేజీని ఓడించింది. మొదట ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం భవాన్స్ వివేకానంద కాలేజీ 6.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. భవాన్స్ ప్లేయర్ కృతిక్ 17 బంతుల్లో 51 పరుగులు సాధించాడు.

ప్రపంచ మహిళల బాక్సింగ్ పోటీలకు భారత జట్టు

50 కేజీల బరిలో నిఖత్ జరీన్



న్యూఢిల్లీ: వచ్చే నెల 15 నుంచి 26 వరకు స్వదేశంలో జరిగే ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 12 వెయిట్ కేటగిరీల్లో భారత బాక్సర్లు పోటీపడతారు. గత ఏడాది టర్కీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 50 కేజీల విభాగంలో తాను సాధించిన స్వర్ణ పతకాన్ని న్యూఢిల్లీలోనూ నిలబెట్టుకునేందుకు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ బరిలోకి దిగనుంది.

భారత జట్టు: నీతూ ఘంఘాస్ (48 కేజీలు), నిఖత్ జరీన్ (50 కేజీలు), సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ లంబోరియా (60 కేజీలు), శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు), సనమచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు), సవీటి బూరా (81 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 81 కేజీలు).

సినిమా


శ్రుతీహాసన్

నేను లక్కీ

'నేను చాలా లక్కీ' అంటున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. గత కొన్నేళ్లుగా శాంతను హజారికాతో శ్రుతీహాసన్ ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వీలున్నప్పుడల్లా కలిసి రెస్టారెంట్, షాపింగ్ మాల్స్, పార్టీలకు వెళుతుంటారు శాంతను అండ్ శ్రుతి. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారామె. అందులో భాగంగా తాజాగా శాంతను హజారికాతో ఉన్న ఓ ఫోటోను షేర్ చేశారు శ్రుతీహాసన్. ''శాంతనుతో కలిసి బయటకువెళ్లి భోజనం చేయడాన్ని నేనెంతగానో ఆస్వాదిస్తుంటాను. మేమిద్దరం భోజన ప్రియులమే. భోజనం చేస్తూ మాట్లాడుకోవడం మా ఇద్దరికీ ఇష్టమైన అంశం. ఫుడ్‌ను ప్రేమించే వ్యక్తితో నేను ప్రేమలో ఉన్నందుకు అదృష్టంగా భావిస్తున్నా'' అని పేర్కొన్నారు శ్రుతీహాసన్. ఇక ఆమె హీరోయిన్‌గా నటించిన 'సలార్', ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.


శ్రీనివాసా చిట్టూరి, ఇళయరాజా, నాగచైతన్య, వెంకట్ ప్రభు

ప్రముఖ సంగీత దర్శకుడు మాస్ట్రో ఇళయరాజా 'రాజా లైవ్ ఇన్ కాన్సర్ట్' కోసం హైదరాబాద్‌కి వచ్చారు. ఈ సందర్భంగా 'కస్టడీ' చిత్రబృందం ఆయన్ను కలిసి, అభినందనలు తెలిపింది. ఇళయరాజాను కలిసిన వారిలో హీరో నాగచైతన్య, డైరెక్టర్ వెంకట్ ప్రభు, నిర్మాత శ్రీనివాసా చిట్టూరి ఉన్నారు. కాగా 'కస్టడీ' చిత్రానికి ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

ఆ అవకాశం రాలేదు

- రణ్‌బీర్ కపూర్



'భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ బయోపిక్‌లో నేను నటించబోతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు' అన్నారు బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్. డైరెక్టర్ లవ్ రంజన్ తెరకెక్కించిన తాజా హిందీ చిత్రం 'తూ ఝూటీ మై మక్కార్'. రణ్‌బీర్ కపూర్, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన ఈ చిత్రం మార్చి 8న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు రణ్‌బీర్ కపూర్. ''గంగూలీ గారికి ప్రపంచమంతా ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన బయోపిక్ అంటే అది అందరికీ స్పెషలే. కానీ ఆయన బయోపిక్‌లో నటించాలనే అవకాశం నాకు రాలేదు. నాకు తెలిసి ఈ బయోపిక్‌కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ఇంకా జరుగుతుందనుకుంటున్నాను'' అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ''ప్రముఖ గాయకులు, నటులు కిషోర్ కుమార్‌గారి బయోపిక్ కోసం 11ఏళ్లుగా వర్క్ జరుగుతోంది. దర్శక-నిర్మాత, నటుడు అనురాగ్ బసు ఈ స్క్రిప్ట్ వర్క్‌లో భాగస్వామిగా ఉన్నారు. నేను చేయబోయే నెక్ట్స్ బయోపిక్ కిషోర్ కుమార్‌గారిదే అవుతుందనుకుంటున్నాను'' అన్నారు. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'యానిమల్' చేస్తున్నారు రణ్‌బీర్ కపూర్. ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టు 11న రిలీజ్ కానుంది.

రోబోలా నటించా


హన్సిక

హీరోయిన్ హన్సిక రోబోలాగా నటించారు. ఎమ్.రాజేష్ దర్శకత్వంలో హన్సిక, ముగెన్ రావ్, శాంతను, జనని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'ఎమ్‌వై 3'. సౌత్ కొరియన్ టెలివిజన్ సిరీస్ 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్' ఆధారంగా 'ఎమ్‌వై 3' సిరీస్ రూపొందింది. ఈ సిరీస్‌లో నటించిన అనుభవాన్ని తాజాగా పంచుకున్నారు హన్సిక. ''ఈ కథ విన్నప్పుడు ఇందులోని పాత్రలు పోషించడం చాలా సులువు అనుకున్నాను. కానీ నా కెరీర్‌లోనే అత్యంత కష్టమైన ప్రాజెక్ట్ ఇది.. ఎందుకంటే ఇందులో నేను ద్వి పాత్రాభినయం చేశాను. అందులో ఓ పాత్ర రోబో. దీంతో రోబోలాగా నటించాల్సి వచ్చింది. షూటింగ్ సమయంలో కనురెప్పలు వాల్చకూడదు.. అలాగే కొన్ని సెకన్లపాటు శ్వాస కూడా తీసుకోకూడదు.. ప్లాస్టిక్ బొమ్మలా ఉండాలి. ఇది చాలా కష్టంగా అనిపించింది. అయితే నా కెరీర్‌లో బెస్ట్ క్యారెక్టర్ కూడా ఇదే. 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్' సిరీస్‌ను నేను చూడలేదు. చూసి అందులో చేసినట్లు నటించడం నాకు ఇష్టం ఉండదు. కొత్తగా, ఫ్రెష్‌గా చేయడమే నాకు నచ్చుతుంది'' అన్నారు హన్సిక.

ఇకపై అలా జరగదు

- సమంత


సమంత

''గతంలో ఎన్నో విషయాలు నన్ను బాధపెట్టాయి. కానీ ఇకపై అలా జరగదు. కేవలం ప్రేమ, కృతజ్ఞతతో మాత్రమే ముందుకు సాగుతున్నా'' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'ఏమాయ చేసావె'. నాగచైతన్య హీరోగా గౌతమ్ వాసుదేవ మీనన్ దర్శకత్వం వహించారు. 2010 ఫిబ్రవరి 26న విడుదలైన ఈ సినిమా మంచి హిట్ అయింది. ఈ మూవీలో జెస్సీ పాత్రలో అలరించారు సమంత. ఈ సినిమా విడుదలై ఆదివారంతో (2023 ఫిబ్రవరి 26) 13 ఏళ్లు పూర్తయ్యాయి. చిత్ర పరిశ్రమలో విజయవంతంగా 13 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తన సినీ జర్నీపై భావోద్వేగ ప్రకటనని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు సమంత. ''మీరంతా నాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను థ్యాంక్స్. నేను ఎంత ఎదిగినా, ఎంత దూరం ప్రయాణించినా మీరు చూపించే ప్రేమాభిమానాన్ని మర్చిపోలేను. నాపై ఇంతటి అభిమానం చూపిస్తున్నందుకు థ్యాంక్స్.. ఇది ఎప్పటికీ ఇలాగే ఉండాలి. అలాగే నాకు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను పరిచయం చేస్తోన్న ప్రతిరోజుకూ ధన్యవాదాలు'' అన్నారు. కాగా సమంత ప్రస్తుతం 'సిటాడెల్' అనే వెబ్ సిరీస్‌తో పాటు విజయ్ దేవరకొండకి జోడీగా 'ఖుషి' చిత్రంలో నటిస్తున్నారు.

యాక్షన్ ధ్రువ


విక్రమ్

విక్రమ్ హీరోగా, రీతూ వర్మ, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ధ్రువనక్షత్రం'. గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సిమ్రాన్, ఆర్.పార్తిబన్ కీలక పాత్రలు చేశారు. స్పై అండ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'ధ్రువనక్షత్రం' త్వరలో థియేటర్స్‌లోకి రానుంది. ఈ చిత్రంలో ధ్రువ పాత్రలో నటించారు విక్రమ్. 2016లో ఈ సినిమాకు సంబంధించిన వర్క్స్ మొదలయ్యాయి. ఈ మూవీ మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తుందనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. కానీ ఇప్పటి వరకు తొలిపార్టు కూడా రిలీజ్ కాలేదు. మొదటి భాగం షూటింగ్ పూర్తి కావడంతో ప్రస్తుతం నేపథ్య సంగీతం పనులు స్టార్ట్ అయ్యాయి. ఈ విషయాన్ని చిత్ర సంగీత దర్శకుడు హారీష్ జైరాజ్ తెలిపారు. 'త్వరలో థియేటర్స్‌లో కలుద్దాం' అన్నారాయన. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ 'ధ్రువనక్షత్రం' చిత్రం ఈ ఏడాది రిలీజ్ అవుతుందని కోలీవుడ్ టాక్.

వేసవిలో బిచ్చగాడు


విజయ్ ఆంటోనీ


విజయ్ ఆంటోనీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'బిచ్చగాడు 2'. కావ్య థాపర్ హీరోయిన్. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్‌పై ఫాతిమా విజయ్ ఆంటోనీ నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రూపొందింది. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ మిల్టన్ ఓం ప్రకాష్, రచన, సంగీతం, ఎడిటింగ్, దర్శకత్వం: విజయ్ ఆంటోనీ.

క్రైమ్ కామెడీ


శ్వేత అవస్తి

నరేష్ అగస్త్య, శ్వేత అవస్తి జంటగా వీరభద్రమ్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దిల్ వాలా'. డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై నబీ షేక్, తూము నర్సింహా పటేల్ నిర్మిస్తున్న ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తయింది. ''క్రైమ్ కామెడీ జోనర్‌లో రూపొందుతోన్న చిత్రమిది. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను బ్యాంకాక్‌లో చిత్రీకరిస్తాం. ఏప్రిల్‌లో రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు వీరభద్రమ్ చౌదరి. వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్, ప్రగ్యా నైనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిత్, సంగీతం: అనూప్ రూబెన్స్.

మ్యాచింగ్.. మ్యాచింగ్


పూజ, ఈశ్వర్, నైనా

ఈశ్వర్, నైనా సర్వార్ జంటగా రాజేష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాస రావు, విష్ణువర్ధన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకానుంది. రోషన్ సాలూరి, గౌర హరి సంగీతం అందించారు. ఈ మూవీలోని 'మ్యాచింగ్.. మ్యాచింగ్..' అనే ప్రత్యేక పాటను 'సెలబ్రిటీ క్రికెట్ లీగ్' బాలీవుడ్ టీమ్ అధ్యక్షుడు షకీల్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పాండు అలిజాల, కెమెరా: అరుణ్ ప్రసాద్.

సినిమాలపై ఇష్టంతో...

ప్రముఖ వ్యాపారవేత్త బి.శ్రీ రంగం శ్రీనివాస్ 'అమేజింగ్ స్క్రీన్ రీల్స్' (ఏఎస్‌ఆర్) పేరుతో ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి వస్తున్నారు. తాజాగా 'ఏఎస్‌ఆర్' లోగోని డైరెక్టర్ సముద్ర, నిర్మాత శోభారాణి లాంచ్ చేశారు. శ్రీరంగం శ్రీనివాస్ మాట్లాడుతూ-''సినిమాలపై ఉన్న ఇష్టంతో పాటు ఇండస్ట్రీలో కొత్త వాళ్లకి అవకాశాలు ఇచ్చి, సపోర్ట్‌గా నిలవాలని ఏఎస్‌ఆర్ సంస్థను స్థాపించాం'' అన్నారు. నిర్మాత లగడపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



లోగో రిలీజ్ చేస్తున్న సముద్ర

సాక్షి బిజినెస్
మంగళవారం
28-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	176	59,288
నిఫ్టీ ▽	73	17,392

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,485	△ 91
డోజోన్స్	32,970	△ 93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,935	△ 56
డాక్స్	15,381	△ 172
షాంఘై	3,258	▽ 9
నికాయ్	27,423	▽ 30

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్)	55,666
బంగారం (22 క్యారెట్)	55,443
వెండి (కేజీ)	63,466

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.12	83.79
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	97.42	100.70
€	యూరో	ఎస్‌బీఐ	85.93	89.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.86	61.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.56	56.91
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.44	62.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.09	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.66	23.45
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.80	12.87

ఈ ఏడాది మధ్యలో టారిఫ్‌ల పెంపు

ఎయిర్‌టెల్ చీఫ్ మిట్టల్ వెల్లడి



బార్సెలోనా: ఈమధ్యే పలు దఫాలుగా ప్లాన్ల టారిఫ్‌లను పెంచిన టెలికం సంస్థ భారతి ఎయిర్‌టెల్ మరో విడత వడ్డింపునకు సిద్ధమవుతోంది. పెట్టుబడులపై రాబడులు అత్యంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో టారిఫ్‌లను పెంచే అవకాశం ఉందని కంపెనీ చైర్మన్ సునీల్ మిట్టల్ తెలిపారు. దీనివల్ల అట్టడుగున ఉన్నవారిపై పడే ప్రభావంపై స్పందిస్తూ.. ప్రజలు మిగతా వాటిపై చేసే ఖర్చులతో పోలిస్తే పెంపు చాలా స్వల్పమే ఉంటుందని పేర్కొన్నారు. 'ఒక్కటి తప్ప.. అన్నీ పెరిగాయి. జీతాలు .. అద్దెలు పెరిగాయి. ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ప్రజలు 30 జీబీ డేటాను దాదాపు ఏమీ కట్టకుండానే వినియోగిస్తున్నారు. దేశంలో మరో వొడాఫోన్ తరహా పరిస్థితి తలెత్తకూడదు. మనకు ఒక భారీ టెలికం సంస్థ అవసరం' అని మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొన్న సందర్భంగా మిట్టల్ చెప్పారు.

కోటి మందికి ఎయిర్‌టెల్ 5జీ

టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ కోటి మంది 5జీ చందాదార్లను సొంతం చేసుకుంది. 2024 మార్చి నాటికి దేశంలోని ప్రతి పట్టణం, ప్రధాన గ్రామీణ ప్రాంతాల్లో 5జీ సేవలను చేర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో అడుగుపెట్టినట్టు తెలిపింది. ప్రపంచ స్థాయి 5జీ ప్లస్ అనుభూతిని అందించడానికి సరైన మార్గంలో ఉన్నట్టు విశ్వసిస్తున్నామని సంస్థ సీటీవో రన్‌దీప్ సెఖోన్ తెలిపారు. 2022 నవంబర్‌లో 10 లక్షల మంది కస్టమర్లు కంపెనీ 5జీ వేదికపైకి వచ్చారు. వాణిజ్య పరంగా సేవలు ప్రారంభించిన 30 రోజుల్లోనే ఈ ఘనతను సాధించామని ఎయిర్‌టెల్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్లను 5జీ ఎక్స్‌పీరియెన్స్ జోన్స్‌గా తీర్చిదిద్దామని కంపెనీ వివరించింది.

ఇన్ఫీ నుంచి ప్రైవేట్ '5జీ సర్వీసులు'



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా తమ క్లయింట్ల కోసం ప్రైవేట్ 5జీ–యాజ్–ఎ–సర్వీస్‌ను ప్రారంభించింది. దీనితో కంపెనీలకు అధిక బ్యాండ్‌విడ్త్, తక్కువ లేటెన్సీ, విశ్వసనీయ వైర్‌లెస్ కనెక్టివిటీ లభించగలదని సంస్థ తెలిపింది. డేటా ప్రాసెసింగ్‌కు పట్టే వ్యవధిని కుదించడం ద్వారా నెట్‌వర్క్‌లో జాప్యాన్ని తగ్గించగలిగే మల్టీ–యాక్సెస్ ఎడ్జ్ కంప్యూటింగ్ సాంకేతికతను ఇందులో వినియోగిస్తున్నట్లు ఇన్ఫీ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి మేన్ ఫార్మా పోర్ట్‌ఫోలియో

105 మిలియన్ డాలర్ల డీల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆస్ట్రేలియన్ సంస్థ మేన్ ఫార్మా గ్రూప్‌నకు చెందిన అమెరికన్ ప్రిస్క్రిప్షన్ ఔషధాల పోర్ట్‌ఫోలియోను దేశీ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్ఎల్) కొనుగోలు చేయనుంది. ఇందుకోసం 105 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 860 కోట్లు) వెచ్చించనుంది. దీనికి సంబంధించి మేన్ ఫార్మాతో తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఎస్ఏ ఒప్పందం కుదుర్చుకున్నట్లు డీఆర్ఎల్ తెలిపింది. ఒప్పందం ప్రకారం 90 మిలియన్ డాలర్లను ముందుగా నగదు రూపంలో చెల్లించనుండగా, నిర్దిష్ట అంశాలకు లోబడి 15 మిలియన్ డాలర్ల వరకూ చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ పోర్ట్‌ఫోలియోలో 45 ఉత్పత్తులు, అభివృద్ధి దశలో ఉన్న నాలుగు ప్రొడక్టులతో పాటు మహిళల ఆరోగ్యానికి సంబంధించి పలు జనరిక్ ఔషధాలు ఉన్నట్లు డీఆర్ఎల్ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ తెలిపారు. గతేడాది జూన్ 30తో ముగిసిన సంవత్సర కాలానికి ఈ పోర్ట్‌ఫోలియో ఔషధాల విక్రయాలు 111 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వివరించారు.

అమెరికాలో వ్యాపారానికి ఊతం..

అమెరికాలోని తమ రిటైల్ ప్రిస్క్రిప్షన్ ఔషధాల వ్యాపారానికి ఈ పోర్ట్‌ఫోలియో మరింతగా ఊతమివ్వగలదని ఇజ్రేలీ తెలిపారు. అలాగే, పేషంట్లకు చౌకగా ఔషధాలను మరింతగా అందుబాటులోకి తేవాలన్న తమ లక్ష్యానికి కూడా తోడ్పాటునివ్వగలదని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల విభాగంలో గణనీయంగా వాటాను పెంచుకోవడానికి దోహదపడగలదని వివరించారు.

సోమవారం బీఎస్ఈలో డాక్టర్ రెడ్డీస్ షేరు 2% మేర క్షీణించి రూ. 4,415 వద్ద ముగిసింది.

ఏపీలో విష్ణు కెమికల్స్ పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ విష్ణు కెమికల్స్ కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. వచ్చే అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లో స్పెషాలిటీ కెమికల్స్ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనకు బోర్డు సోమవారం ఆమోదముద్ర వేసినట్లు తెలిపింది. విష్ణు కెమికల్స్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా 57 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఆటోమొబైల్, ఫార్మా, ఉక్కు తదితర పరిశ్రమలకు ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.



ఏడో రోజూ నష్టాలే

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- నెల కనిష్టానికి సెన్సెక్స్
- నాలుగు నెలల కనిష్టానికి నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో స్టాక్ సూచీలు ఏడోరోజూ నష్టాలను చవిచూశాయి. ఐటీ, మెటల్, ఆటో షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 176 పాయింట్లు పతనమై 59,288 వద్ద, నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 17,392 వద్ద స్థిరపడ్డాయి. సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో సెన్సెక్స్ 526 పాయింట్లు క్షీణించి 59,464 వద్ద, నిఫ్టీ 166 పాయింట్లు పతనమై 17,299 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే మిడ్ సెషన్ తర్వాత యూరప్ మార్కెట్లలో సానుకూల ర్యాలీతో పాటు ప్రైవేట్ బ్యాంక్, రియల్టీ, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీల నష్టాలు కొంతమేర తగ్గాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.28%, మిడ్‌క్యాప్ సూచీ 0.69 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2022 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2232 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ పది పైసలు నష్టపోయి 82.85 స్థాయి వద్ద స్థిరపడింది.

- గడిచిన ఏడు రోజుల్లో సెన్సెక్స్ 2,031 పాయింట్లు(3.5%) నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.10.37 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.257 లక్షల కోట్లకు దిగివచ్చింది.

దేశీ మార్కెట్‌పై గ్లోబల్ దిగ్గజాల కన్ను

- కన్జూమర్ ప్రొడక్టుల విక్రయాలపై భారీ ఆశలు
- జాబితాలో పెప్సీకో, కోకకోలా, మాండెలెజ్
- యూనిలీవర్, లారియల్ కొత్త వ్యూహాలు

ముంబై: కన్జూమర్ ప్రొడక్టుల గ్లోబల్ దిగ్గజాలు దేశీ వినియోగ మార్కెట్‌పై సానుకూలంగా స్పందిస్తున్నాయి. ప్రధానంగా పెప్సీకో, కోకకోలా, మాండెలెజ్ యూనిలీవర్, లారియల్ దేశీయంగా పటిష్ట అమ్మకాలు సాధించాలని ప్రణాళికలు వేస్తున్నాయి. ఇందుకు దేశీ ఆర్థిక వృద్ధి పరిస్థితులు సహకరించనున్నట్లు పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ పరిస్థితులకుతోడు, స్థూల ఆర్థిక వాతావరణం అనిశ్చింతగా ఉన్నప్పటికీ ఇండియా గ్రోత్ స్టోరీ పలు అవకాశాలను కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నాయి. గత కేలండర్ ఏడాది(2022)లో పటిష్ట అమ్మకాలు సాధించడంతో ఈ ఏడాది(2023)లోనూ మరింత మెరుగైన పనితీరును సాధించాలని ఆశిస్తున్నాయి. 2022 ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ కన్జూమర్ ప్రొడక్ట్ దిగ్గజాలు పలు అంచనాలను ప్రకటించాయి.

మార్కెట్‌ను మించుతూ

సౌందర్య కేంద్రంగా ఆవిర్భవించే బాటలో భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నట్లు కాస్మెటిక్



ప్రొడక్టుల దిగ్గజం లారియల్ పేర్కొంది. గతేడాది పటిష్ట అమ్మకాలు సాధించామని, మార్కెట్‌ను మించి రెండు రెట్లు వృద్ధిని అందుకున్నట్లు తెలియజేసింది. ఇండియా తమకు అత్యంత ప్రాధాన్యతగల మార్కెట్ అని పేర్కొంటూ భారీ లక్ష్యాలతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించింది. గణాంకాల ప్రకారం చూస్తే 2030కల్లా ఇండియా ప్రపంచ జనాభాలో 20 శాతం వాటా, నైపుణ్యంగల సిబ్బందిలో 30 శాతం వాటాను ఆక్రమించుకోనున్నట్లు అభిప్రాయపడింది. వెరసి కంపెనీ వృద్ధికి దేశీ మార్కెట్ కీలకంగా నిలవనున్నట్లు తెలియజేసింది.

పానీయాలకు భళా

2022కు పానీయాల అమ్మకాల్లో ఇండియా మార్కెట్ అత్యుత్తమంగా నిలిచినట్లు కోకకోలా చైర్మన్, సీఈవో జేమ్స్ క్విన్సీ పేర్కొన్నారు. పానీయాల విభాగంలో ఇండియా మార్కెట్ అత్యంత భారీగా విస్తరించే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు. దీంతో పలు అవకాశాలకు తెరలేవనున్నట్లు తెలియజేశారు. బెవరేజెస్ వినియోగంలో దీర్ఘకాలిక మార్కెట్‌గా నిలవనున్నదని, ఇకపై మరింత వృద్ధికి వీలున్నదని అంచనా వేశారు. వినియోగ రంగంలో 2022లో దేశీయంగా విస్తారమైన వృద్ధి నమోదైనట్లు యూనిలీవర్ పేర్కొంది. పోటీతత్వం, విభిన్న బ్రాండ్లు, ధరల పోర్ట్‌ఫోలియో ద్వారా వినియోగదారులను ఆకట్టుకున్నట్లు వివరించింది. గ్రామీణ ప్రాంతాలకుమించి పట్టణాలలో విక్రయాలు ఊపందుకున్నట్లు కంపెనీ సీఈవో అలెన్ జోప్ వెల్లడించారు. ఇకపైన సైతం మార్కెట్‌ను మించిన వృద్ధిని అందుకోగలమని భావిస్తున్నట్లు తెలియజేశారు.

రెండంకెల వృద్ధి

2022లో దేశీయంగా రెండంకెల వృద్ధిని అందుకున్నట్లు ఎఫ్ఎంసీజీ దిగ్గజం మాండెలెజ్ తెలియజేసింది. ప్రధానంగా చాకొలెట్లు, బిస్కట్లతోకూడిన పోర్ట్‌ఫోలియో జోరు చూపినట్లు పేర్కొంది. గతేడాది ఇండియా, బ్రెజిల్ మార్కెట్‌లలో అత్యధిక స్థాయిలో అమ్మకాలు సాధించినట్లు వెల్లడించింది. ఇక బెవరేజెస్ దిగ్గజం పెప్సీకో సైతం దేశీయ మార్కెట్లో గతేడాది అత్యంత పటిష్ట వృద్ధిని సాధించినట్లు తెలియజేసింది. పానీయాలతోపాటు.. స్నాక్స్ అమ్మకాల ద్వారా మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు వెల్లడించింది.

డివ్‌జీ టార్క్ ఇష్యూ @ రూ. 560-590

మార్చి 1–3 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ మార్చి 1న ప్రారంభంకానుంది. 3న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 560–590గా నిర్ణయించింది. తద్వారా రూ. 412 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ నేడు(28న) ప్రారంభంకానుంది. ఐపీవోలో భాగంగా రూ. 180 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 39.34 లక్షల షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు, వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలు, తయారీ సౌకర్యాల పరికరాల కొనుగోలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 25 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా సిస్టమ్ లెవెల్ ట్రాన్స్‌ఫర్ కేస్, టార్క్ కప్లర్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్లు అందిస్తోంది. క్లయింట్ల జాబితాలో ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ ఆటో పార్ట్స్ తదితరాలున్నాయి. మార్చి 14న కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ అయ్యే వీలుంది.

రూ. 2,500 కోట్లతో శ్యామ్ స్టీల్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టీఎంటీ ఉక్కు కడ్డీల తయారీ సంస్థ శ్యామ్ స్టీల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తమ రిటైల్ కార్యకలాపాలను మరింతగా విస్తరించనుంది. వచ్చే అయిదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 500 పైచిలుకు డీలర్ డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు కంపెనీ డైరెక్టర్ లలిత్ బెరివాలా తెలిపారు. అలాగే నటుడు విజయ్ దేవరకొండను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు పేర్కొన్నారు. ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు రూ. 2,500 కోట్ల మేర ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లోని ప్లాంటుపై రూ. 1,000 కోట్లు, మరో కొత్త ప్లాంటుపై రూ. 1,500 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు బెరివాలా చెప్పారు. ప్రస్తుత సామర్థ్యం వార్షికంగా 0.7 మిలియన్ టన్నులుగా ఉండగా, దీన్ని 1 మిలియన్ టన్నులకు పెంచుకుంటున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 4,500 కోట్ల టర్నోవరు నమోదు కాగా వచ్చే మూడేళ్ల వ్యవధిలో దీన్ని రూ. 9,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐపీఈటీ అడ్మిషన్ టెస్ట్-2023

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీఐపీఈటీ) 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత

- » **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ అండ్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ):** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
- » **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ):** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: మూడేళ్లు.
- » **పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ కాడ్/కామ్:** డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: 1.5 ఏళ్లు.
- » **పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్:** మూడేళ్ల సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.05.2023.
- » **సీపెట్ పరీక్ష తేది:** 11.06.2023.
- » **వెబ్‌సైట్:** www.cipet.gov.in

యూపీఎస్సీలో 43 పోస్టులు

ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కేంద్ర విభాగాలు/ శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 43.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ డైరెక్టర్–క్యాపిటల్ మార్కెట్(సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్)–01, అసిస్టెంట్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–కన్నడ(సెంట్రల్ సెక్రటేరియట్ లైబ్రరీ)–01, స్పెషలిస్ట్ గ్రేడ్3–రేడియో–డయాగ్నసిస్(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–14, స్పెషలిస్ట్ గ్రేడ్3–ఓబ్‌స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–12, స్పెషలిస్ట్ గ్రేడ్3–ట్యూబర్క్యులోసిస్(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–03, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ–ఎలక్ట్రికల్(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ)–03, డిప్యూటీ ఓర్ డ్రెస్సింగ్ ఆఫీసర్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–05, మినరల్ ఆఫీసర్–ఇంటెలిజెన్స్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–04.
- » **అర్హత:** సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ, ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ, ఎంబీబీఎస్, డీఎం, ఎంఎస్, ఎంసీహెచ్, డిప్లొమా, బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.03.2023.
- » **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సుల వివరాలు:** ఫుల్ టైం పీహెచ్‌డీ(అండర్ విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ)–02 సీట్లు.
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
- » **అర్హత:** 55శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్(ఈసీఈ/సీఎస్ఈ) ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఫెలోషిప్:** నెలకు రూ.38,750(మొదటి, రెండో సంవత్సరం), రూ.43,750 (మూడు, నాలుగు, ఐదో సంవత్సరం)తోపాటు రెంట్ రీయింబర్స్‌మెంట్, రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ అందుతుంది.
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.03.2023.
- » **వెబ్‌సైట్:** online.uceou.edu.

పీవీ ఎన్ఆర్‌వీయూ, రాజేంద్రనగర్‌లో ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » **మాస్టర్ ఆఫ్ వెటర్నరీ కోర్సులు:** 40 సీట్లు(రాష్ట్ర కోటా కింద 30, ఇన్–సర్వీస్ అభ్యర్థులకు 10 సీట్లు కేటాయించారు).
- » **విభాగాలు:** వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.07.2022 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఐసీఏఆర్–ఏఐఈఈఏ(పీజీ)–2022 ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.03.2023.
- » **కౌన్సెలింగ్ తేది:** 16.03.2023.
- » **మొదటి సెమిస్టర్ రిజిస్ట్రేషన్ తేది:** 23.03.2023.
- » **వెబ్‌సైట్:** tsvu.nic.in

మేనేజ్‌మెంట్ పీజీకి మరో మార్గం.. సీమ్యాట్!

కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా సీమ్యాట్! దేశవ్యాప్తంగా ఉన్న.. ఏఐసీటీఈ అనుబంధ కళాశాలలు, ఇతర ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంబీఏ, పీజీడీఎం సహా.. పీజీ స్థాయిలో పలు మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది!! ఎన్‌టీఏ.. తాజాగా సీమ్యాట్-2023 దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. సీమ్యాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్...

- » వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్స్‌కు సీమ్యాట్ స్కోర్ ప్రామాణికం
- » ఎంబీఏ, మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం
- » సీమ్యాట్‌తోపాటు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు
- » సీమ్యాట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



మేనేజ్‌మెంట్‌లో పీజీ లేదా ఎంబీఏ ప్రోగ్రామ్‌ల నగానే.. ఎక్కువ మంది విద్యార్థులు క్యాట్, ఐసెట్‌లపైనే గురిపెడతారు. వీటిలో ర్యాంకు రాకపోతే నిరాశకు గురవుతారు.అలాంటి వారికి చక్కటి ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.. సీమ్యాట్. క్యాట్, ఐసెట్ సన్నద్ధతతో సీమ్యాట్‌లో సులువుగా విజయం సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్‌లు

సీమ్యాట్ స్కోర్‌తో.. ప్రస్తుతం దేశంలో వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ తదితర పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే అవకాశముంది. ఏఐసీటీఈ అనుబంధ కళాశాలల్లో సీమ్యాట్ స్కోర్‌తో ఎంబీఏలో చేరొచ్చు. అదే విధంగా.. డి.వై పాటిల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ), ఐఐఆర్ఎం, కె.జె.సోమయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, గ్జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీస్–రాంచీ తదితర ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా సీమ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణ, కర్నాటక తదితర రాష్ట్రాలు సీమ్యాట్‌ను అధికారిక పరీక్షగా ప్రకటించాయి. దీంతో క్యాట్, ఎక్స్ఏటీలలో మంచి ర్యాంకు దక్కని విద్యార్థులకు సీమ్యాట్ చక్కని ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.

అర్హత

సీమ్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

అయిదు విభాగాలు.. 400 మార్కులు

- జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే సీమ్యాట్ పరీక్షను మొత్తం అయిదు విభాగాల్లో 400 మార్కులకు నిర్వహిస్తారు.
- క్వాంటిటేటివ్ టెక్నిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు –80 మార్కులు; జనరల్ అవేర్‌నెస్ 20ప్రశ్నలు–80 మార్కులు; ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 20ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది.
- పరీక్షకు కేటాయించిన సమయం 3 గంటలు.
- ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి.
- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

మలి దశలో జీడీ, పీఐలు

సీమ్యాట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్‌లు మలిదశలో.. గ్రూప్ డిస్కషన్(జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ) నిర్వహిస్తున్నాయి. వీటిల్లో చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, సీమ్యాట్ స్కోర్‌కు వెయిటేజీ కల్పించి ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. గ్రూప్ డిస్కషన్‌లో.. కరెంట్ అఫైర్స్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ నైపుణ్యాలను పరిశీలిస్తున్నారు. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు నేరుగా సీమ్యాట్ స్కోర్ ఆధారంగా కనీస కటాఫ్‌ను నిర్దేశించి.. ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందించి సీట్లు భర్తీ చేస్తున్నాయి.

మెరుగైన స్కోర్‌కు మార్గాలివే

క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్

గణిత, డేటా విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ సాధించాలంటే.. అర్థమెటిక్–రేషియో, మిక్చర్స్, వర్క్, యావరేజ్, పర్సంటేజెస్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్ (మ్యాగ్జిమా–మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. డేటా ఇంటర్‌ప్రెటేషన్‌కు సంబంధించి టేబుల్స్,పై ఛార్ట్స్, బార్ డయాగ్రమ్స్ అండ్ గ్రాఫ్స్, ఛార్ట్స్‌లను పరిశీలించడం, వాటిలోని గణాంకాలను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకునేలా ప్రిపరేషన్ సాగించాలి.

లాజికల్ రీజనింగ్

అభ్యర్థుల్లోని తార్కిక విశ్లేషణను గుర్తించే విభాగం ఇది. ఇందులో లాజికల్ రీజనింగ్‌లోని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు ప్రిపరేషన్‌లో లీనియర్, సీటింగ్, సీక్వెన్సింగ్ అండ్ అరేంజింగ్ విత్ కండిషన్స్ టు కోడింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. స్టేట్‌మెంట్స్–కంక్లూజన్, లాజికల్ పజిల్, న్యూమరికల్ పజిల్, వెన్ డయాగ్రమ్, ట్రూ–ఫాల్స్ స్టేట్‌మెంట్స్, విజువల్ రీజనింగ్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టితో ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం క్యాట్, ఎక్స్ఏటీ తదితర పరీక్షల పూర్వ ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్

ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో యూసేజ్ ఆఫ్ ఆర్టికల్స్, యూసేజ్ ఆఫ్ నౌన్స్ అండ్ ప్రొనౌన్స్, అడ్జెక్టివ్స్, అడ్‌వెర్బ్స్, ప్రిపోజిషన్స్–రెగ్యులర్, ఫాలోవుడ్, సింటాక్స్, సబ్జెక్ట్–వెర్బ్ అరేంజ్‌మెంట్, సింపుల్, కంటిన్యూయస్, పర్ఫెక్ట్ టెన్సెస్ అండ్ కండిషనల్ అన్‌రియల్ పాస్ట్, జంబల్డ్ పారాగ్రాఫ్స్ వంటి అంశాలపై పట్టు సాధించడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకునే వీలుంది. అదే విధంగా రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజెస్ కూడా ఈ విభాగంలో ఉంటాయి.

500 నుంచి 600 పదాలతో పాసేజ్‌లు ఇస్తారు. తర్వాత పాసేజ్‌కు సంబంధించిన ఇంటర్‌ఫియరెన్స్ డ్రాన్, సెంట్రల్ ఐడియా, ఫ్రేజెస్, ఇడియమ్స్ తదితరాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి స్కోర్ సాధించేందుకు ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రికలను రోజూ చదువుతూ.. వొకాబ్యులరీ పెంచుకోవాలి. సెంటెన్స్ ఫార్మేషన్‌పై పట్టుసాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలపై అవగాహనను పరీక్షించే విభాగం ఇది. దీనికోసం స్టాండర్డ్ జీకే బుక్స్, న్యూస్ పేపర్లు, వీక్లీలు, వెబ్‌సైట్స్, పిరియాడికల్స్‌ను అనుసరించాలి. వీటితోపాటు బిజినెస్ న్యూస్, జాతీయ, అంతర్జాతీయ అంశాలు; వార్తల్లో వ్యక్తులు; భారత రాజ్యాంగం; వివిధ దేశాలు –కరెన్సీలు; భారతదేశం –రాష్ట్రాలు; అంతర్జాతీయ సంస్థలు; ద్రవ్య, కోశ గణాంకాలు, ఇటీవల చోటు చేసుకుంటున్న సమకాలీన పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశాలు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కీలకమని భావించి గతేడాది ఈ విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌నకు సంబంధించిన టెక్నికల్ టెర్మినాలజీ(సీడ్ ఫండింగ్, క్రౌడ్ ఫండింగ్, ఏంజెల్ ఇన్వెస్టర్స్ తదితర)గురించి తెలుసుకోవాలి.స్టార్టప్ ఇండియా,మేకిన్ ఇండియా వంటి పథకాల లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలి.

250కి పైగా స్కోర్ లక్ష్యంగా

సీమ్యాట్ ద్వారా టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు.. 250 నుంచి 350 మార్కులు సాధించేలా కృషి చేయాలి. గత రెండేళ్ల ఫైనల్ మెరిట్ లిస్ట్‌లను పరిగణనలోకి తీసుకుంటే.. 300కు పైగా స్కోర్ సాధించిన అభ్యర్థులు వేయి మందికి పైగా ఉండగా, 250 నుంచి 300 మధ్యలో స్కోర్ సాధించిన అభ్యర్థుల సంఖ్య దాదాపు 10 వేలుగా ఉంది. కాబట్టి అభ్యర్థులు ఈ శ్రేణిలో స్కోర్ సాధించేలా కృషి చేస్తే టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం ఖరారు చేసుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 6, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మార్చి 7 – 9, 2023
- **సీమ్యాట్ పరీక్ష తేదీ:** మే నెలలో నిర్వహించే అవకాశం ఉంది.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **పూర్తివివరాలకు వెబ్‌సైట్:** cmat.nta.nic.in

క్లుప్తంగా...



జస్టిస్ ప్రియదర్శినికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈవో

గణనాథుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

యాదమరి (చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీవర సిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

టీఎస్ఎస్పీడీసీఎల్‌కు 'సోలార్' పురస్కారం

సాక్షి, హైదరాబాద్: రూఫ్‌టాప్ సౌర విద్యుత్ విభాగంలో 'విజేత'గా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్).. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) సంస్థ అందించే పురస్కారాన్ని అందుకుంది. ఈ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఐసీసీ తాజాగా నిర్వహించిన 3వ గ్రీన్ ఊర్జా పురస్కారాల ప్రదానోత్సవంలో టీఎస్ఎస్పీడీసీఎల్‌కు వెండి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేసింది. రాష్ట్రంలో సోలార్ రూఫ్‌టాప్ పవర్ నెట్ మీటరింగ్ స్థాపిత సామర్థ్యాన్ని 259 మెగావాట్లకు పెంచినందుకు గాను సంస్థకు ఈ అవార్డు లభించిందని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి తెలిపారు.

దాల్మియా కేసులో వాదనలు వినిపించిన రాజగోపాల్

సాక్షి, హైదరాబాద్: దాల్మియా సిమెంట్ కేసులో గనులశాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్ సీబీఐ కోర్టులో తన వాదనలను తానే వినిపించుకున్నారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఆయన డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం సీబీఐ కోర్టు వాదనలు చేపట్టగా..కేసును ఆయనే వాదించారు. తనకు అవకాశం ఇచ్చిన న్యాయమూర్తికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

213 ఔషధాలతో సైడ్ ఎఫెక్ట్స్



డాక్టర్ సలహా మేరకే వాడాలి

- ఇష్టారాజ్యంగా బయట కొనుగోలు చేయొద్దు
- ర్యాంటిడిన్ వాడితే కొందరిలో ఆకస్మికంగా గుండెపోటు
- ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: కాస్త ఒళ్లు వెచ్చబడితే వెంటనే ఇంట్లో తెచ్చిపెట్టుకున్న పారాసిటమాల్ మాత్ర వేసుకుంటాం.. గొంతునొప్పి రాగానే మెడికల్ షాపుకెళ్లి అజిత్రోమైసిన్ అడుగుతాం.. ఒళ్లు నొప్పులకు ఐబూప్రోఫిన్ మాత్ర మింగేస్తాం.. ఇలా సాధారణ రోగాలకు మనలో చాలామంది వైద్యుడిని సంప్రదించకుండానే సొంత చికిత్స తీసుకుంటుంటారు. అయితే ఇది ప్రమాదకరమని, ఎలాంటి మందులనైనా డాక్టర్ సలహాతోనే వాడాలని ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ సూచించింది. ఇష్టారాజ్యంగా మందులను వేసుకుంటే శరీరంలో తీవ్రమైన దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయని హెచ్చరించింది. ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావొచ్చని తెలిపింది. ముఖ్యంగా 213 ఔషధాల వాడకం వల్ల కొందరిలో ఈ తరహా సైడ్ ఎఫెక్ట్స్ రావొచ్చంటూ ఆ జాబితాను విడుదల చేసింది.

పరిశోధనల తర్వాత..

వివిధ కంపెనీలు పరిశోధనలు, అనుమతులు పొందాక తయారుచేసి విక్రయించే మందులను రోగులు వాడాక కొందరిలో సైడ్‌ఎఫెక్ట్స్ కనిపించొచ్చు. దీనిపై అందే ఫిర్యాదుల ఆధారంగా మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు ఈ విషయాన్ని ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేస్తాయి. ఆయా సైడ్ ఎఫెక్ట్స్‌పై ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ పరిశోధనలు చేసింది. గుర్తించిన అదనపు సైడ్‌ఎఫెక్ట్స్ సమాచారాన్ని ప్రజలకు, డాక్టర్లకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థకు సిఫార్సు చేసింది. ఆ ప్రకారం కంపెనీలకు సమాచారమివ్వాలని కోరింది. సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా చర్యలు తీసుకురావాలని కోరింది. 2014 నుంచి 2020 వరకు సైడ్ ఎఫెక్ట్స్ వెలుగుచూసిన 213 రకాల మందుల జాబితాను ఇండియన్ ఫార్మకోఫియా కమిషన్ విడుదల చేసింది.

వాటిల్లో కొన్నింటి వివరాలు..

- **పైపరాసిలిన్ కజోబ్యాక్టిమ్ ఇంజెక్షన్:** తీవ్రమైన ఇన్ఫెక్షన్ కోసం వాడే యాంటిబయాటిక్ ఇది. దీనివల్ల కొందరిలో శ్వాస సమస్య, ఎముకల బలహీనత, పొటాషియం లోపం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావొచ్చు.
- **మ్యానిటాల్ ఇంజెక్షన్:** తలకు దెబ్బ తగిలినప్పుడు, ఇన్ఫెక్షన్ వచ్చి మెదడులో నీరు చేరినపుడు దీన్ని వాడతారు. దీనివల్ల పొటాషియం లోపం వంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావొచ్చు.
- **రేబిస్ వ్యాక్సిన్:** దీనివల్ల ఒక్కోసారి శరీరం మొత్తం సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి.
- **ర్యాంటిడిన్:** సాధారణంగా ఎసిడిటీకి వాడతారు. దీనివల్ల కొందరిలో సడన్‌గా గుండె ఆగిపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా వైద్యుడి సలహా మేరకు మరేదైనా మందు వాడాలి.
- **సెఫ్ట్రాక్జోమ్:** దీన్ని సాధారణ జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు, విరేచనాలకు, చిన్నచిన్న గడ్డలకు కూడా వాడతారు. దీనివల్ల కొందరిలో శరీరమంతా రియాక్షన్ రావొచ్చు. అది ఒక్కోసారి ప్రాణాంతకం కావొచ్చు. కొందరిలో చర్మం ఊడిపోతుంది.
- **అజిత్రోమైసిన్:** యాంటీబయోటిక్. జలుబుకు ఎక్కువగా వాడతారు. దీనివల్ల కొందరిలో శరీరమంతా చిన్నచిన్న చీము కురుపులు వస్తాయి.
- **బ్రూఫెన్:** దీన్ని మధ్యస్థాయి నొప్పులు తగ్గించేందుకు వాడతారు. దీనివల్ల కొందరిలో శరీరమంతా రియాక్షన్ రావొచ్చు. చర్మం లేచిపోతుంది.
- **అమాక్సిలిన్ క్లలానిక్ యాసిడ్ ట్యాబ్లెట్:** జలుబు వంటి వాటికి వాడే యాంటీబయోటిక్ ఇది. కొందరిలో శరీరమంతా రియాక్షన్ రావొచ్చు.
- **సిప్రోఫ్లాక్సిన్:** దీన్ని తేలికపాటి చర్మ ఇన్ఫెక్షన్లకు, చీముగడ్డల తగ్గుదలకు వాడతారు. కొందరిలో శరీరమంతా రియాక్షన్ వచ్చే అవకాశముంది.
- **యామ్లో డెఫిన్:** బీపీని తగ్గించే మందు ఇది. దీన్ని వాడటం వల్ల కొందరిలో వెంట్రుకలు ఊడిపోతాయి. చిగుళ్లు పెరుగుతాయి.
- **సెఫిక్జిమ్:** యాంటీబయోటిక్. తేలికపాటి గొంతు, శ్వాసకోశ సమస్యలు, ఉదర ఇన్ఫెక్షన్లకు వాడతారు. కొందరికి నోట్లో అల్సర్లు ఏర్పడతాయి.
- **ఓఫ్లాక్సిన్:** విరేచనాలు తగ్గేందుకు వాడతారు. కొందరిలో శరీరమంతా సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. కొందరిలో ప్రాణాంతకమైన రియాక్షన్లు రావొచ్చు.
- **ట్రెమడాల్:** నొప్పి తగ్గేందుకు వాడే మాత్ర. దీనివల్ల కొందరిలో వెక్కిళ్లు వస్తాయి. ఒక్కోసారి మూత్రం ఆగిపోవచ్చు.
- **గ్లిబెంక్లమైడ్:** షుగర్ తగ్గించేందుకు వాడతారు. దీన్ని వల్ల కొందరిలో గుండెదడ వస్తుంది.
- **ప్యాంటొప్రజోల్:** దీన్ని ఎసిడిటీకి వాడతారు. దీన్ని వాడటం వల్ల కొందరిలో కిడ్నీ సంబంధిత సమస్యలు వస్తాయి.
- **జింక్:** బలానికి వాడే ఈ టాబ్లెట్ వల్ల కొందరిలో విరేచనాలు రావొచ్చు.
- **పారాసిటమాల్:** జ్వరానికి వాడతారు. దీనివల్ల కొందరిలో చర్మంపై చిన్నచిన్న కురుపులు వస్తాయి.
- **లోసార్టాన్:** బీపీని తగ్గించే ఈ మందు వాడకం వల్ల కొందరిలో కండరాలు పట్టుకుంటాయి. అతిగా పనిచేస్తే ఎలా నొప్పులు వస్తాయో దీని వల్ల అలాగే జరుగుతుంది.
- **రెమిడిసివీర్:** కరోనా, ఎబోలా వైరస్ కట్టడికి వాడతారు. దీనివల్ల కొందరిలో గుండె వేగం తగ్గుతుంది.
- **ఎటినెలాల్:** బీపీ తగ్గించే మందు. దీన్ని వాడటం వల్ల కొందరిలో చర్మానికి ఇన్ఫెక్షన్ వస్తుంది.
- **యాంబ్రాక్సాల్:** దగ్గు తగ్గించేందుకు వాడతారు. దీనివల్ల కొందరిలో కన్నీళ్లు వస్తాయి.
- **డెకడ్రాన్:** ఆస్తమాలో, ఇన్ఫెక్షన్లకు వాడతారు. దీనివల్ల కొందరిలో వెక్కిళ్లు వస్తాయి.
- **అమాక్సిలిన్:** తేలికపాటి యాంటీబయోటిక్ ఇది. దీనివల్ల కొందరిలో కళ్లమంటలాంటిది వస్తుంది.
- **ఎమిట్రిప్లిన్:** తీవ్రమైన ఆందోళన, ఒత్తిడి, డిప్రెషన్‌కు వాడతారు. దీర్ఘకాలిక నొప్పులకు ఉపయోగిస్తారు. దీనివల్ల కొందరిలో చిగుళ్ల రంగు మారుతుంది.
- **సెఫ్ట్రాజోమ్:** ఆసుపత్రుల్లో చేరినవారికి సర్జరీకి ముందు వాడే యాంటీబయోటిక్. దీనివల్ల కొందరిలో గుండెదడ వస్తుంది.
- **టెల్మాసార్టాన్:** బీపీకి వాడతారు. దీంతో కొందరిలో చర్మ సంబంధ రియాక్షన్లు వస్తాయి. కొందరిలో ముఖం నల్లబడుతుంది.
- **అటర్వస్టాటిన్:** దీన్ని చెడు కొవ్వు తగ్గించేందుకు వాడతారు. దీనివల్ల కొందరిలో విటమిన్–డి కొరత ఏర్పడుతుంది.

ఇది సమంజసమేనా?

- 'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో సుప్రీంకోర్టు అసహనం
- బాధ్యతాయుత సీఎం హోదాలో ఉండి న్యాయమూర్తులకు వీడియో క్లిప్పింగులు పంపడం సబబేనా?
- ఇది న్యాయమూర్తుల ఆలోచనను మార్చడమే..
- సిట్ అయితే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేయదా అని ప్రశ్న
- హోలీ సెలవుల తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని నిర్ణయం
- ఏ ధర్మాసనం విచారించేదీ చీఫ్ జస్టిస్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ''తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో ఉండి న్యాయమూర్తులకు కేసుకు సంబంధించిన వీడియో క్లిప్పింగులు పంపిస్తారా? బాధ్యతాయుతమైన హోదాలో ఉండి అలా చేయడం సబబేనా?''అని 'ఎమ్మెల్యేలకు ఎర' వ్యవహారంలో సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ తీరు అసౌకర్యంగా ఉందని, ఇది న్యాయమూర్తుల ఆలోచనను మార్చడమేనని అభిప్రాయం వ్యక్తం చేసింది. 'ఎమ్మెల్యేలకు ఎర' కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అరవిందకుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. మొదట ఆయన వాదన ప్రారంభిస్తుండగానే ధర్మాసనం కల్పించుకుని.. 'కోర్టు సమయం ముగిసే లోపు వాదనలు పూర్తవుతాయా?'అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య మనుగడనే ప్రశ్నించేలా ఉన్న ఈ కేసు చాలా తీవ్రమైందని, వాదనలు వినాలని దవే కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా సీబీఐకి కేసు విచారణను ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ''సిట్ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. మరి రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి ఉండదా?''అని ప్రశ్నించగా.. స్థానిక హైకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు చేస్తుందని దవే వివరించారు. అసలు ఈ కేసు దర్యాప్తులో సీఎం జోక్యం చేసుకున్నారన్న ప్రసక్తే సరికాదని, విలేకరుల సమావేశం నిర్వహిస్తే జోక్యం అనడం సరికాదని పేర్కొన్నారు. సీబీఐ దర్యాప్తు చేస్తున్న కేసులు నిత్యం టీవీల్లో ప్రసారం అవుతున్నాయని, ఆదివారం ఢిల్లీ డిప్యూటీ సీఎం విచారణపైనా ప్రసారాలు వచ్చాయని గుర్తు చేశారు.

ఇది అసౌకర్యంగా ఉంది

దవే వాదనల మధ్యలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'సీఎం న్యాయమూర్తులకు ఆడియో, వీడియో క్లిప్పింగులు పంపించడం సమంజసమేనా?'అని ప్రశ్నించింది. సీఎం వ్యవహరించిన తీరు న్యాయమూర్తుల ఆలోచనను మార్చడమేనని అభిప్రాయపడింది. అయితే దీనిపై సీఎంను సంప్రదించకుండానే తాను క్షమాపణలు చెప్తున్నానని, ఈ అంశాన్ని మరో కోణంలో చూడాల్సి ఉందని న్యాయవాది దవే ధర్మాసనాన్ని కోరారు. ఈ విధంగా కేసుకు సంబంధించిన క్లిప్పింగులు పంపడం అసౌకర్యంగా ఉందని జస్టిస్ బీఆర్ గవాయి పేర్కొనగా.. విచారణను మరో ధర్మాసనానికి బదిలీ చేయొచ్చని దవే సూచించారు.

హోలీ సెలవుల తర్వాత విచారణ

హోలీ సెలవుల తర్వాత ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ధర్మాసనం నిర్ణయించింది. అయితే ప్రస్తుతం విచారిస్తున్న ఇద్దరు న్యాయమూర్తులం వేర్వేరు కాంబినేషన్ల ధర్మాసనాల్లో ఉంటున్నామని.. చీఫ్ జస్టిస్ నుంచి తగిన ఆదేశాలు తీసుకొని, తగిన బెంచ్ ముందు ఈ పిటిషన్‌ను లిస్ట్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

సిట్ దర్యాప్తునకు అనుమతించండి

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో ఐదు గంటల వీడియో, ఆడియో కాల్స్, వాట్సాప్ చాట్‌లతో కూడిన ఆధారాలు ఉన్నాయని ధర్మాసనానికి దవే వివరించారు. సిట్ వద్ద కీలక ఆధారాలు ఉన్నాయని, ఇప్పుడు సీబీఐ దర్యాప్తు అంటే ఎలాగని.. హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సిట్ దర్యాప్తునకు అనుమతించాలని కోరారు. ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తున్న దర్యాప్తు సంస్థలు.. అధికార బీజేపీ నేతలపై ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రాంతీయ ప్రభుత్వాలను పడగొట్టాలని బీజేపీ చూస్తోందని, ఎమ్మెల్యేలను పార్టీ చేర్చుకునేందుకు డబ్బులతో ప్రలోభపెడుతోందని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు అనే సరికి ఈ కేసు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. దవే వాదనలు కొనసాగిస్తుండగా జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకొంటూ.. కేసుకు సంబంధించిన ఆధారాలను ముఖ్యమంత్రికి ఇచ్చారా? అని ప్రశ్నించారు. అక్టోబర్ 27న తాము కోర్టుకు ఆధారాలను సమర్పించామని, నవంబరు 3న పూర్తి సమాచారంతో కూడిన పెన్‌డ్రైవ్‌ను అందజేశామని దవే తెలిపారు. ''సీఎం కొత్తగా ప్రెస్‌మీట్‌లో ఏమీ చెప్పలేదు. చట్టబద్ధమైన పాలనలో ఉన్నాం. కోర్టులు పూర్తిస్థాయి ఆధారాల కోసం చూడాలి. వాస్తవం కళ్లు మూసుకోరాదు. ఇది బీజేపీ లేదా బీఆర్ఎస్ గురించి కాదు. ప్రజాస్వామ్యం గురించి, వారిని అధికారంలోకి తెచ్చిన సామాన్యుల గురించి.. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ అవసరం'' అని ధర్మాసనానికి దవే విన్నవించారు. కాగా.. ఈ కేసులో బీజేపీ తరఫున సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ హాజరయ్యారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.